www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సీఎస్‌గా నీరబ్ కుమార్



జీఏడీ ఉత్తర్వులు.. వెంటనే బాధ్యతల స్వీకరణ

అమరావతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరుతున్న వేళ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ నియమితులయ్యారు. ఆయనను సీఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ శుక్రవారం జీవో 1034 జారీచేసింది. ఆ వెంటనే సచివాలయంలోని సీఎస్ చాంబర్‌లో టీటీడీ, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానాల వేద పండితుల ఆశీస్సుల మధ్య నీరబ్ కుమార్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎస్‌గా

మిగతా 12వ పేజీలో...

శనివారం | 8-6-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 53 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 3.56 తదుపరి తదియ; నక్షత్రం: ఆర్ద్ర రా. 7.42 తదుపరి పునర్వసు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 5.43-7.27; అమృతఘడియలు: ఉ. 9.42-11.18; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇక సమష్టి నిర్ణయాలు

ఎన్డీయే స్ఫూర్తికి అనుగుణంగా పనిచేస్తా.. జీవన నాణ్యతపై దృష్టి సారిస్తాం

- సామాన్యుల జీవితాల్లో కనీస స్థాయికి జోక్యం
- ఎన్డీయే ఎంపీలకు 24/7 అందుబాటులో ఉంటా
- ఏపీ విజయం అభివృద్ధి ఆకాంక్షల ప్రతిబింబం
- చంద్రబాబుకు పేదల సంక్షేమమే ముఖ్యం
- పవన్ కేవలం పవన్ కాదు ఒక తుఫాను
- కాంగ్రెస్ వచ్చే పదేళ్లలో కూడా వంద దాటదు
- తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు విఫలమైంది
- అందుకే మాకు రెట్టింపు సీట్లు: ప్రధాని మోదీ
- ఎన్డీయే పక్ష నేతగా మోదీ ఏకగ్రీవ ఎన్నిక
- చంద్రబాబు, నితీశ్, పవన్, తదితరుల మద్దతు



ప్రధాని మోదీని సత్కరించి వెంకన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న చంద్రబాబు, పవన్

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పాలనకు సంబంధించి ఇక అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకునేందుకు కృషి చేస్తానని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. అన్నింటికన్నా దేశం ముఖ్యం అన్న సూత్రానికి కట్టుబడి ఎన్డీఏ కూటమి పని చేస్తుందని చెప్పారు. శుక్రవారం ఉదయం పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాలులో ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత కూటమి ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించారు. తాను ఎన్డీఏ స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తానని ప్రకటించారు. వాజపేయి, ప్రకాశ్ సింగ్ బాదల్, జార్జి ఫెర్నాండెజ్, శరద్ యాదవ్, బాల్ ఠాక్రేలు వేసిన కూటమి బీజాలు ఇవాళ బలమైన వృక్షంగా మారాయని, ప్రజలు దానికి దోహదం చేశారని ఆయన చెప్పారు. ఆ మహానుభావుల వారసత్వం తనకు లభించినందుకు గర్వంగా ఉందన్నారు. తన పక్కన ఉన్న ఎన్డీయే నేతలందరిలోనూ ఒక సమాన లక్షణం కనపడుతోందని, అదే సుపరిపాలన అని మోదీ చెప్పారు. తాను గుజరాత్‌లో ఉన్నా, చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నా తమందరి పాలనలో కేంద్ర బిందువు పేదల సంక్షేమమే

మిగతా 2వ పేజీలో...

రేపు మోదీ ప్రమాణం

- రాత్రి 7.15 గంటలకు..
- రాష్ట్రపతిని కలిసిన ఎన్డీయే నేతలు
- మోదీని పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకున్నట్లు రాష్ట్రపతికి లేఖ

2

సరైన టైంలో సరైన నేత!

- మోదీపై చంద్రబాబు ప్రశంసల జల్లు
- ఎన్నికల్లో రాత్రింబవళ్లూ కష్టపడ్డారు
- మోదీకి సంపూర్ణ మద్దతు: బాబు

మోదీ జాతికి స్ఫూర్తి

ఆయన సారథిగా ఉన్నంతవరకూ దేశం ఎవరికీ తలవంచదు: పవన్

నెహ్రూ సరసన మోదీ!

- వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ఎన్నిక!
- కాంగ్రెసేతర పక్షాల నుంచి తొలి వ్యక్తిగా ఘనత

ఏపీ నుంచి ఎవరికి చాన్స్!

రామ్మోహన్ సహా ప్రచారంలో పలువురి పేర్లు 11

12న చంద్రబాబు ప్రమాణస్వీకార ముహూర్తం ఉ.11.27 11

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా రాహుల్!.. నేడు సీడబ్ల్యూసీ భేటీలో నిర్ణయం

నూతన మద్యం విధానం పేరుతో వింత బ్రాండ్లు ప్రవేశపెట్టి... అవినీతి 'కిక్కు'తో వేల కోట్లు వెనకేసుకున్నారు! ఇప్పుడు ఈ అవినీతి తీగ లాగడం మొదలైంది. ఇక... డొంక కదలడమే మిగిలింది. ఏపీ బేవరేజెస్ ఎండీ హోదాలో మద్యం కొనుగోళ్లు, అమ్మకాల్లో కీలక పాత్ర పోషించిన వాసుదేవ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కీలకమైన ఫైళ్లను తీసుకెళ్లారంటూ ఆయనపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఆ వెంటనే... హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోదాలు కూడా జరిపింది.



'కిక్కు'.. దించుతున్నారు

ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీపై కేసు

- ఫైళ్లు 'ఎత్తుకెళుతూ' దొరికిన వాసుదేవరెడ్డి
- సామాన్యుడి ఫిర్యాదుతో సీఐడీ కేసు
- హైదరాబాద్‌లోని నివాసంలో సోదాలు
- విచారణ... కీలక సమాచారం లభ్యం
- వైసీపీ లిక్కర్ స్కామ్‌లో ఆయనదే కీలక పాత్ర



వాసుదేవరెడ్డి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయంలో మద్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో... ఏపీ బేవరేజెస్ ఎండీ వాసుదేవరెడ్డిని ఈసీ పక్కకు తప్పించింది. అయితే... వైసీపీ ఓటమి తర్వాత, గురువారం ఆయన తన వెంట కొన్ని కీలక ఫైళ్లు తీసుకెళ్లినట్టు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయం నుంచి అనుమానాస్పద రీతిలో ఫైళ్లు తీసుకెళుతుండగా చూశానంటూ.. గద్దె శివకృష్ణ అనే వ్యక్తి

మిగతా 8వ పేజీలో...

మద్యం స్కాం రూ.5 వేల కోట్లు

- అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ దోపిడీ..
- కమీషన్ల కోసం కంపెనీలకు రేట్లు పెంపు
- పెంచింది తిరిగి వైసీపీ నేతల చేతుల్లోకే

వాసుదేవరెడ్డి కీలక పాత్ర



రామోజీరావుకు వెంటిలేటర్‌పై చికిత్స 11

- బీపీ పెరిగి తీవ్ర అస్వస్థత
- స్టెంట్ వేసిన వైద్యులు
- ఇతర సమస్యలు తలెత్తడంతో ఇబ్బందికరంగా పరిస్థితి

కవ్వింపులు.. దాడులు!

- బెజవాడ, గుడివాడల్లో హైటెన్షన్
- వంశీ, కొడాలి ఇళ్లపై టీడీపీ కార్యకర్తల రాళ్లు, కోడి గుడ్లదాడి.. తీవ్ర ఉద్రిక్తత
- విజయవాడలో యార్లగడ్డ అనుచరులపై లాఠీచార్జి.. పలువురికి గాయాలు 12
- పోలీసు వాహనాలు ధ్వంసం
- వంశీ అనుచరులే రెచ్చగొట్టారు: యార్లగడ్డ
- కొడాలి నాని రాజకీయ సన్యాసం శపథం నిలబెట్టుకోవాలని తెలుగుయువత పట్టు

జగన్ హాహాకారాలు!

నాడు తన వాళ్ల దౌర్జన్యాలు చేస్తే 'బీపీ'!

నేడు బాధితులు ఎదురుతిరిగితే దాడులా? 11

హింస, హత్యాకాండలకు ఐదేళ్లపాటు దన్ను

పోదుర్లే కాస్త ఆగండి!

వైసీపీ అధికారులకు పూర్తి స్థాయిలో చెక్

- సెలవులు రద్దు.. రిలీవ్ చేయొద్దు
- ఐపీఎస్ సంజయ్ లీవ్ రద్దు చేసిన జీఏడీ
- రాజేశ్వరరెడ్డిని వెనక్కి పంపించాలని లేఖ
- రెవెన్యూ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా టీడీపీ నేతల ఆర్థిక మూలాలపై వరుస దాడులు
- ప్రభుత్వం మారగానే డిప్యుటేషన్ రద్దుచేసుకుని వెనక్కి.
- రాజేశ్వర్‌రెడ్డిని వెనక్కి పిలిపిస్తున్న జీఏడీ
- లెక్క తేలే వరకూ ఏపీలో ఉండాల్సిందే
- గీత దాటిన అధికారులకు స్పష్టీకరణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కొత్త ప్రభుత్వం కొలువు తీరకముందే వైసీపీ అధికారుల లెక్కలు తేలుస్తున్నారు. "జగనన్నే సర్వం. ఆయనతోనే మేముంటాం" అంటూ ప్రభుత్వాధికారులమన్న మాటే మరిచిన వారందరినీ మడత పెట్టేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడకముందే చల్లగా జారుకుందాం అని చూసినవారికి చెక్ పెట్టేశారు. ఇప్పటికే రాష్ట్రం దాటిన వారు తిరిగి వెనక్కి రావాలంటూ సాధారణ పరిపాలన విభాగం తాఖీదులు జారీ చేసింది. చివరికి సెలవుపై వెళ్తున్న

మిగతా 12వ పేజీలో...

సీఎంవోలో ప్రక్షాళన

- పూనం, రేవు, భరత్ గుప్తాలకు బదిలీ
- వారికి పోస్టింగ్ ఇవ్వని కొత్త సీఎస్ నీరబ్
- జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశాలు
- 27వరకు జవహర్ సెలవుకు ఆమోదం
- తప్పుకోవాలని నామినేటెడ్ పదవుల్లోని వారికీ సంకేతాలు
- వారికి వారుగానే వెళ్లిపోయేలా చర్యలు

11



సంజయ్



రఘురామిరెడ్డి

సీఐడీ నుంచి సంజయ్ అవుట్

విజిలెన్స్ నుంచి కొల్లి రఘురామిరెడ్డి తొలగింపు

- కొత్త సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు
- 2 బాధ్యతలూ డీజీపీకి అదనంగా అప్పగింత
- ఫైబర్‌నెట్ ఎండీ మధుసూదన్‌రెడ్డి, మైన్స్ డైరెక్టర్ వెంకటరెడ్డికీ ఉద్వాసన

అమరావతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా వైసీపీ చట్టాలను అమలుచేసి, అక్రమ అరెస్టులతో రెచ్చిపోయిన పోలీసు అధికారులపై వేటు పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడకముందే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన

మిగతా 11వ పేజీలో...

మళ్లీ మంచి రోజులు!

కేంద్రంలో తెలుగుదేశానికి అత్యంత ప్రాధాన్యం

- గతంలో యునైటెడ్ ఫ్రంట్‌లో బాబు కీలకం
- వాజపేయి సర్కారు ఏర్పాటులోనూ అంతే
- కేంద్రంలో పరపతితో రాష్ట్ర ప్రయోజనాల సాధన
- ఇప్పుడు మరోసారి ఎన్డీయేలో కీలక పాత్ర
- ఉదారంగా నిధులు, ప్రాజెక్టులకు అవకాశం

(అమరావతి/న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌కు అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయి. ప్రజల తాజా తీర్పుతో రాష్ట్రం ముందడుగు వేసేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. అభివృద్ధికి పాతరేసి, అరాచక పాలన సాగించిన వైసీపీని ప్రజలు ఓడించి టీడీపీని గద్దెనెక్కించడం ఒక ఎత్తు! కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పాటులో తెలుగుదేశం పార్టీ కీలకంగా మారడం మరో ఎత్తు! కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించిన ప్రతిసారీ... రాష్ట్ర ప్రయోజనాలను గరిష్ఠ స్థాయిలో సాధించారు. తాజా ఎన్నికల్లో

మిగతా 11వ పేజీలో...

నీట్‌పై నీలినీడలు

పరీక్ష నిర్వహణ, ఫలితాలపై తీవ్ర ఆరోపణలు

- ప్రశ్నపత్రం లీకేజీ, మార్కుల్లో అవకతవకలు
- ఎన్నడూ లేని విధంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్
- వారిలో 8 మందిది ఒకే పరీక్షా కేంద్రం
- పది రోజుల ముందే ఎన్నికల ఫలితాల నాడు రిజల్ట్స్
- పరీక్ష మళ్లీ నిర్వహించాలంటున్న తల్లిదండ్రులు
- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలి: ఖర్గే
- నీట్ రద్దుకు అందరం కలిసి ఉద్యమిద్దాం: స్టాలిన్



(సెంట్రల్ డెస్క్)

24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంతో ముడిపడిన నీట్-2024 పరీక్ష నిర్వహణ, వెల్లడైన ఫలితాలు తీవ్ర వివాదం సృష్టిస్తున్నాయి. అనేక మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షను మళ్లీ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తున్నారు. నీట్‌ఫ్రాడ్, నీట్‌పేపర్‌లీక్, నీట్‌స్కామ్, నీట్‌రీకండక్ట్ వంటి హ్యాష్‌ట్యాగ్‌లు సోషల్ మీడియాలో

మిగతా 2వ పేజీలో...

నెహ్రూ సరసన మోదీ!

» వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ఎన్నిక!



న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన నెహ్రూ రికార్డును మోదీ సమం చేశారు. కాంగ్రెసేతర పక్షాల నుంచి ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టనున్న తొలి వ్యక్తి మోదీనే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో తొలిసారి లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఫలితాల తర్వాత నెహ్రూ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1957, 62 సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ఆయన విజయపథాన నడిపించి ప్రధాని అయ్యారు. నెహ్రూ కుమార్తె ఇందిరకు కూడా ఈ రికార్డు సాధ్యం కాలేదు. ఇందిర 4 పర్యాయాలు ప్రధానిగా చేసినా వరుస ఎన్నికలలో గెలవలేదు. బీజేపీ వరుసగా 2014, 19, 24 సార్వత్రిక ఎన్నికల్లో గెలవడం.. మూడోసారి కూడా మోదీయే ప్రధాని బాధ్యతలు చేపట్టనుండటంతో నెహ్రూ సరసన నిలవనున్నారు. అయితే 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఇప్పటిదాకా అత్యధిక కాలం ప్రధానిగా చేసిన రికార్డు మాత్రం ఇందిరా గాంధీ పేరిటే ఉంది. ఆమె 15 ఏళ్ల 350 రోజులు ప్రధాని పదవిలో ఉన్నారు. గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో మధ్యతరగతి కుటుంబంలో 1950లో మోదీ జన్మించారు. హీరాబెన్, దామోదర్ దాస్ మోదీ దంపతులకు ఆయన మూడో సంతానం. విద్యార్థి దశలోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. అతికొద్దికాలంలోనే బీజేపీ అగ్రనాయకత్వం దృష్టిని ఆకర్షించారు. మోదీని ఎల్‌కే అడ్వాణీ ప్రోత్సహించారు. 1990లో అడ్వాణీ రథయాత్రలో మోదీ పాల్గొన్నారు. 1992లో మురళీ మనోహర్ జోషి చేపట్టిన కన్యాకుమారి-కశ్మీర్ ఏక్తా యాత్రకు మోదీ జాతీయ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2001లో గుజరాత్ సీఎం అయ్యారు. గోద్రా అల్లర్ల సమయంలో మోదీ తీరుపై తీవ్రవిమర్శలొచ్చాయి. రాజీనామా చేయాలనే డిమాండ్లు ఎన్డీయే మిత్రపక్షాల నుంచి సైతం వచ్చాయి. అయినప్పటికీ 2014 మేలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టేవరకు గుజరాత్ సీఎంగా పనిచేశారు.

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా రాహుల్!


» నేడు వర్కింగ్ కమిటీ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) నేతగా రాహుల్‌గాంధీని ఎన్నుకొనే అవకాశం ఎక్కువగా కనబడుతోంది. ఆయన నాయకత్వంలో తిరిగి జాతీయ స్రవంతిలో పుంజుకొని సాధారణ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించడంతో ఆయన్నే పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నుకోవాలని డిమాండ్లు ఊపందుకున్నాయి. సాధారణంగా పార్లమెంటరీ పార్టీ లీడరే కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి అవుతారు. మోదీ సర్కారు ఏడాదిలోపు పడిపోతుందని గట్టిగా విశ్వసిస్తున్న కాంగ్రెస్.. ఇండీకూటమికి తన ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌ని ఇప్పటి నుంచే ప్రాజెక్టు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శనివారం ఢిల్లీలో సమావేశం కానుంది. ఈ భేటీలో సీపీపీ నేతగా రాహుల్‌ను ప్రతిపాదిస్తూ తీర్మానం చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

ఇక సమష్టి నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఎన్డీఏ కూటమి భారతదేశ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు అంకిత భావంతో పని చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. విపక్ష నేతలు చెబుతున్నట్లుగా తమనెవరూ ఓడించలేదని మోదీ అన్నారు. అదే సమయంలో ఓడిపోయిన వారిని అపహాస్యం చేయబోమని చెప్పారు. తాజా ఎన్నికల తీర్పు దేశం ఎన్డీఏ కూటమినే విశ్వసిస్తోందనే విషయాన్ని స్పష్టం చేసిందని మోదీ వ్యాఖ్యానించారు. గత పదేళ్ల పాలన ట్రెయిలర్ మాత్రమేనని తాను గతంలో చేసిన వ్యాఖ్యలు కేవలం ఎన్నికల ప్రసంగం కాదని, తన నిశ్చితాభిప్రాయమని మోదీ చెపారు. పార్లమెంటులోని అన్ని పార్టీలు తమకు సమానమేనన్నారు. తన ప్రసంగంలో మోదీ ప్రతిపక్షాలపై సహజ శైలిలో చెణుకులు విసిరారు. ఇండియా కూటమి 2024 ఎన్నికలకే పరిమితమని భాగస్వామ్య పార్టీలు చెప్పడంలోనే వాటి అధికార దాహం స్పష్టమవుతోందని విమర్శించారు. ఎన్నికలు జరుగుతుండగానే విపక్షం ఈవీఎంలపై దుష్ప్రచారం కొనసాగించిందని, సుప్రీంకోర్టు దాకా వెళ్లారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వారి నోళ్లు మూత పడ్డాయని మోదీ అన్నారు. ఈవీఎంలను ప్రశ్నించే ప్రతిపక్షాలు ఈ శతాబ్దానికి చెందిన వారు కాదని తనకు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఫలానా వారికి మంత్రిపదవులు వస్తున్నాయని మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను ఎంపీలు పట్టించుకోవద్దని మోదీ పిలుపునిచ్చారు. ఇవన్నీ తప్పుడు వార్తల్లో ఆరితేరిన ఇండీ కూటమి సృష్టేనని చెప్పారు. పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్న తర్వాత కూడా దేశంలో అతి పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ వంద సీట్లు కూడా సాధించలేకపోయిందని మోదీ వ్యాఖ్యానించారు. వచ్చే పదేళ్లలో కూడా ఆ పార్టీ సీట్ల సంఖ్య వంద దాటబోదన్నారు. గత మూడు ఎన్నికల్లో కలిపి వారికి వచ్చిన సీట్ల



ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీకి పాదాభివందనం చేయడానికి నితీశ్ ప్రయత్నం

కన్నా ఎక్కువ సీట్లు ఈ ఎన్నికల్లో తమకు లభించాయని గుర్తు చేశారు. ఈ సారైనా ప్రతిపక్షాలు దేశ నిర్మాణానికి దోహదం చేస్తాయని, పార్లమెంట్ చర్చల్లో పాల్గొంటాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

అందరికీ అందుబాటులో ఉంటా

రానున్న పదేళ్లలో సుపరిపాలన, అభివృద్ధి, జీవన నాణ్యతపై దృష్టి కేంద్రీకరిస్తుందని, సామాన్య ప్రజల జీవితాల్లో కనీస జోక్యం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తాను పూర్తిగా దేశానికి కట్టుబడి ఉంటానని, 24 గంటలూ ఎన్డీఏ ఎంపీలకు అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. దేశం కోసం కలిసికట్టుగా పని చేద్దామని చెప్పారు. పోటీ స్ఫూర్తితో కూడిన సహకార సమాఖ్య విధానాన్ని ఎన్డీఏ ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు. పేదలు, మధ్య తరగతికి సాధికారికత కల్పించడం తమ ప్రాధాన్యత అని మోదీ ప్రకటించారు. ఎన్డీఏ అంటే "న్యూ, డెవలప్డ్, యాస్పిరేషనల్" ఇండియా అన్నారు.

మోదీ పేరును ప్రతిపాదించిన రాజ్‌నాథ్

సీనియర్ బీజేపీ నేత రాజ్‌నాథ్ సింగ్ ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా మోదీ పేరును ప్రతిపాదించారు. అమిత్ షా, నితిన్ గడ్కరీ బలపరిచారు. అనంతరం ఇతర ఎన్డీఏ నేతలు కుమారస్వామి, చంద్రబాబు, నితీశ్, ఏక్‌నాథ్ షిండే, చిరాగ్ పశ్వాన్, జతిన్‌రాం మాంఝీ, పవన్ కల్యాణ్‌లు మోదీని ప్రశంసిస్తూ ఆయన నాయకత్వాన్ని సమర్థించారు.

ఫడ్నవీస్.. రాజీనామా చేయకండి

లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీకి వచ్చిన దారుణ ఫలితాలకు తానే బాధ్యత వహిస్తూ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన దేవేంద్ర ఫడ్నవీస్‌ను అమిత్ షా వారించినట్లు సమాచారం. శుక్రవారం ఎన్డీఏ కూటమి సమావేశంలో ఫడ్నవీస్ రాజీనామా ప్రస్తావన వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై సీఎం ఏక్‌నాథ్ శిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌తో బీజేపీ పెద్దలు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశమనంతరం అమిత్ షాతో ఫడ్నవీస్ భేటీ అయ్యారు. "మీరు రాజీనామా చేస్తే బీజేపీ కార్యకర్తల నైతిక స్థైర్యం దెబ్బతింటుంది. కాబట్టి రాజీనామా చేయకండి" అని షా చెప్పారు.

లోకం తీరు



రేపు మోదీ ప్రమాణం

» రాత్రి 7-15 గంటలకు ముహూర్తం

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార ముహూర్తం ఖరారైంది. ఆదివారం రాత్రి 7-15 గంటలకు ప్రధానమంత్రి, ఇతర మంత్రి మండలి సభ్యులతో రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయిస్తారని రాష్ట్రపతి భవన్ నుంచి శుక్రవారం రాత్రి అధికారిక ప్రకటన వెలువడింది. అంతకు ముందు మోదీని ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకున్నామని, ఆయనను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ కూటమికి చెందిన నేతలందరూ రాష్ట్రపతి ముర్మును కలిసి సంయుక్త లేఖను సమర్పించారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలన్నీ మోదీని ప్రధానిగా సమర్థిస్తూ వేర్వేరు లేఖలను కూడా రాష్ట్రపతికి అందజేశాయి. ఇదిలా ఉండగా, రాష్ట్రపతి అభ్యర్థన మేరకు ప్రధాని మోదీ తన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి తేదీ సమయాన్ని సూచించారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఢిల్లీని 9, 10 తేదీల్లో నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. రాష్ట్రపతితో భేటీ తర్వాత బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తన నివాసంలో మిత్రపక్షాల నేతలతో వేర్వేరుగా చర్చలు జరిపారు.చంద్రబాబు, నితీశ్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, పవన్ కల్యాణ్, చిరాగ్ పశ్వాన్, జయంత్ చౌదరి, అనుప్రియ పాటిల్, అజిత్ పవార్‌లు నడ్డాతో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొన్నారు. తెలుగుదేశం, జనతాదళ్(యు)లకు రెండు కేబినెట్, రెండు సహాయ మంత్రి పదవులు ఇచ్చేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. శివసేన, లోక్ జనశక్తిలకు ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి చొప్పున ఇచ్చే అవకాశాలున్నాయి. జనతాదళ్(ఎస్), జనసేన, ఆర్ఎల్‌డీలకు ఒక కేబినెట్ కానీ, స్వతంత్ర హోదాలో ఒక సహాయమంత్రి పదవి కానీ కేటాయించవచ్చు. అప్నాదళ్‌లకు ఒక సహాయ మంత్రి కేటాయించే అవకాశాలున్నాయి.

పవన్ ఒక తుఫాను

దక్షిణ భారతదేశంలో తమ కూటమి కొత్త చరిత్రను సృష్టించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అతి పెద్ద విజయం లభించిందని చంద్రబాబుతో అన్నానన్నారు. జనసేన అధినేత పవన్ పవనం కాదని, తుఫాను అని మోదీ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో లభించిన భారీ విజయం అభివృద్ధి పట్ల సామాన్య మానవుడి ఆకాంక్షలకు ప్రతిబింబం అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఇటీవలే ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అనతికాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మోదీ అన్నారు. అందుకే ఎన్డీఏ సీట్లు రెట్టింపు అయ్యాయని వ్యాఖ్యానించారు. కర్ణాటకలోనూ అదే పరిస్థితి ఉందన్నారు. తమిళనాడులో సీట్లు రాకపోయినా ఓట్ల శాతం బాగా పెరిగిందని చెప్పారు. కేరళలో తరతరాలుగా వేల మంది కార్యకర్తలు బలిదానం చేశారని, ఇవాళ పార్లమెంట్‌లో తమ ప్రతినిధి ప్రవేశించారని ఆయన అన్నారు. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, పుదుచ్చేరి, ఒడిసా విజయాలనూ ఆయన ప్రస్తావించారు. ఒడిసాలో జగన్నాథుడు పేదల దేవుడని, రాష్ట్రం రానున్న రోజుల్లో అభివృద్ధికి చోదక శక్తిగా మారుతుందని చెప్పారు.

18వ లోక్‌సభ తొలి సమావేశం 15న!

న్యూఢిల్లీ, జూన్ 7: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 15 నుంచి 22వ తేదీ వరకు జరిగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యుల ప్రమాణ స్వీకారాలతో ఈ నెల మూడో వారంలో సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నాయి. ప్రమాణ స్వీకారాలు రెండ్రోజుల పాటు జరిగే అవకాశం ఉందని, అనంతరం స్పీకర్ ఎన్నిక ఉంటుందని తెలిపాయి. ఆ తర్వాతి రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారని చెప్పాయి. సమావేశాలు జరుగుతుండగానే తొలి సెషన్ ముగింపుపై కొత్తగా ఎంపికైన మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించాయి. ఈ సమావేశాల్లో భాగంగా ప్రధానిమంత్రి తన కేబినెట్‌ను ఉభయసభలకు పరిచయం చేస్తారని తెలిపాయి.

సరైన టైంలో సరైన నేత!

ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసల జల్లు



న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ సరైన సమయంలో భారత దేశానికి లభించిన సరైన నాయకుడని టీడీపీ అధినేత చంద్రబాబు కొనియాడారు. తన విధానాలను సమర్థంగా అమలు చేయడంలో ఆయన్ను మించిన వారు లేరని.. విజన్ ఉన్న ఆయన హయాంలో ఏది అనుకుంటే అది సాధించగలమని ప్రశంసించారు. శుక్రవారమిక్కడ పార్లమెంటు సెంట్రల్ హాలులో శుక్రవారం జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్డీయే పార్లమెంటరీ నేతగా మోదీని టీడీపీ తరఫున సగర్వంగా సమర్థిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీయేతో తమ పార్టీకి చిరకాల బంధం ఉందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మోదీ మూడు సభలు, ఒక భారీ రోడ్‌షోలో పాల్గొని ఎన్డీయే ఘన విజయానికి కారణమయ్యారని చెప్పారు. 'సార్వత్రిక ఎన్నికల్లో మోదీ రాత్రింబవళ్లూ అలుపెరగకుండా విస్తృత ప్రచారం చేశారు. ఉదయం ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఎలా ఉన్నారో, రాత్రి ప్రచారం ముగించే ముందు కూడా అలాగే ఉండేవారు. రాష్ట్ర ప్రజలు ఎన్డీయేపై సంపూర్ణ విశ్వాసం చూపారు. 95% సీట్లలో గెలిపించారు. నా మిత్రుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మేం కలిసికట్టుగా కృషి చేసి ఈ విజయం సాధించాం' అన్నారు. దేశ చరిత్రలో కీలకమైన ఘట్టంలో ఉన్నామని చంద్రబాబు అన్నారు. 'గత పదేళ్లలో మోదీ నాయకత్వంలో ఎన్నో కీలక చర్యలు చేపట్టారు. అంకిత భావంతో ఆయన చేసిన కృషి వల్ల మనం ప్రపంచంలో శక్తిమంతమైన దేశంగా మారాం. నాలుగు దశాబ్దాలుగా నేను రాజకీయాల్లో ఉంటున్నాను. ఎందరో నేతలను చూశాను. కానీ అంతర్జాతీయంగా దేశాన్ని గర్వంతో తలెత్తుకునేలా చేసిన ఘనత మోదీకే దక్కుతుందని చెప్పగలను. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ఆయన నేతృత్వంలో ప్రపంచంలో ఒకటో లేదా రెండో అతి పెద్ద ఎకానమీగా మారుతుందనే విశ్వాసం నాకుంది. జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య సమతుల్యం ఉండాలి. అప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుంది' అని తెలిపారు.

మోదీ జాతికి స్ఫూర్తి : పవన్

భారతజాతి యావత్తుకూ మోదీ స్ఫూర్తి అని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన సారథిగా ఉన్నంతవరకు దేశం ఎవరికీ తలవంచదని చెప్పారు. ఆయన నాయకత్వంలో పనిచేయడం తమకు గర్వకారణమన్నారు. 'దేశాన్ని ఆయనెంతో ప్రభావితం చేశారు. దేశసేవకు ఆయనే మాకు ప్రేరణ. ఆయన దేశభక్తి, అభివృద్ధి పట్ల అంకిత భావం గొప్పవి. ఆయన మార్గనిర్దేశంలోనే ఆంధ్రలో ఘనవిజయం సాధించాం' అని ఎన్డీయే ఎంపీల సమావేశంలో తెలిపారు. ఎన్డీయే పార్లమెంటరీ సారథిగా మోదీకి పూర్తి మద్దతు ప్రకటించారు. 'ఆయన 15 ఏళ్ల ప్రధానిగా ఉంటారని.. దేశం దిశ-దశ మారతాయని 2014లోనే చంద్రబాబు చెప్పారు. ఇప్పుడా మాట నిజమవుతోంది. ఆయన మూడోసారి ప్రధానిగా బాధ్యతలు తీసుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన విజన్-2047తో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలని భారతీయులందరి ఆకాంక్ష. ఆయన పాలనలో ఆసేతుహిమాచలం భద్రంగా ఉంది. ఆర్థికంగానూ పరుగులు తీస్తోంది. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి ముందుకు సాగుతోంది. ప్రపంచ దేశాల్లో భారత ప్రతిష్ఠను ఆయన ఇనుమడింపజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎన్డీయే ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆశిస్తున్నాను. మోదీ సూచనలు, సలహాలతో రాష్ట్ర సర్కారుకు ముందుకు సాగుతుంది' అని పవన్ అన్నారు.

నీట్‌పై నీలినీడలు

(మొదటి పేజీ తరువాయి)

హోరెత్తుతున్నాయి. ప్రశ్నాపత్రాల లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో మోదీ సర్కార్ ఆడుకుంటోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది. మే 5న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్ యూజీ-2024 పరీక్షను నిర్వహించింది. 24 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాశారు. అయితే, పరీక్ష నిర్వహణకు కేవలం రెండు రోజుల ముందే ఓ స్కామ్ బయటపడింది. పరశురామ్ రాయ్ అనే ఓ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ యజమాని, తుషార్‌భట్ అనే ఓ టీచర్ కలిసి గుజరాత్‌కు చెందిన 16 మంది విద్యార్థులను నీట్‌లో అక్రమంగా పాస్ చేయించటానికి ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇక పరీక్ష జరిగిన రోజున ప్రశ్నాపత్రం లీకైందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. లీకైన ప్రశ్నాపత్రం ఇదేనంటూ కొన్ని ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. దీంతో నీట్‌ను మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్ అదే రోజున మొదలైంది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఫలితాల వెల్లడిని నిలిపివేయటానికి సుప్రీంకోర్టు నిరాకరించినప్పటికీ.. ఈ వ్యవహారాన్ని సమీక్షించటానికి అంగీకరించింది. కాగా, నీట్ ఫలితాలను ఈ నెల 14న విడుదల చేయాల్సి ఉండగా.. ఎన్‌టీఏ హఠాత్తుగా లోక్‌సభ ఫలితాలు వెలువడిన 4న అంటే పది రోజుల ముందే విడుదల చేసింది. యావత్ మీడియా, దేశప్రజానీకం దృష్టి ఎన్నికల ఫలితాల మీద ఉన్న సమయంలో ఎన్‌టీఏ ఇలా చేయటం లక్షలాది మంది విద్యార్థులను, తల్లిదండ్రులను దిగ్భ్రాంతి పరిచింది. ఎన్నికల ఫలితాల హడావిడిలో ఎవరూ నీట్ పరీక్ష నిర్వహణలో, ఫలితాల్లో జరిగిన అక్రమాలను పట్టించుకోరనే ఉద్దేశంతోనే ఎన్‌టీఏ ఇలా చేసిందన్న ఆరోపణలు వచ్చాయి.

ఫలితాల్లో గందరగోళం

ఇక వెల్లడైన ఫలితాలు కూడా పెద్ద వివాదాన్ని సృష్టించాయి. ఏకంగా 67 మంది విద్యార్థులు ఈసారి వందశాతం మార్కులు (720) సాధించి దేశంలో నంబర్ వన్ ర్యాంకును తెచ్చుకున్నారు. నీట్ చరిత్రలోనే ఇంతమంది విద్యార్థులకు నంబర్‌వన్ ర్యాంకు ఎన్నడూ రాలేదు. ఈ 67 మందిలో 8 మంది హరియాణాలోని ఒకే పరీక్షకేంద్రానికి చెందిన వారు కావటం మరో విశేషం. అంతే కాదు, వీరి హాల్‌టికెట్ నెంబర్లు ఒకే సిరీస్‌తో ఉన్నాయి. ఇక 67 మంది టాపర్లకు ఫస్ట్ ర్యాంకు ఇచ్చిన ఎన్‌టీఏ.. కౌన్సెలింగ్ ర్యాంకులను మాత్రం దశాంశ (డెసిమల్) పద్ధతిలో వేర్వేరుగా ఇచ్చింది. దేని ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించారన్నది వెల్లడించలేదు. ఫలితాల్లో చోటు చేసుకున్న మరో విచిత్రం ఏమిటంటే.. కొందరు విద్యార్థులకు 717, 718, 719 మార్కులు వచ్చాయి. నీట్ పరీక్ష మూల్యాంకన పద్ధతి ప్రకారం ఇలా రావటానికి వీల్లేదు. ఎందుకంటే, నీట్ పరీక్షలో సరైన జవాబుకు 4 మార్కులు ఇస్తారు. తప్పు జవాబుకు ఒక మైనస్ మార్కు ఉంటుంది. మొత్తం 180 ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసిన వారికి 720 మార్కులు (ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు చొప్పున) వస్తాయి. ఒక ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా వదిలేసిన విద్యార్థికి 4 మార్కులు తగ్గి, మొత్తం స్కోరు 716 లభిస్తుంది. లేదా ఒక ప్రశ్నకు తప్పు సమాధానం రాస్తే.. మరో మార్కు తగ్గి 715 అవుతుంది. అంతేగానీ 719, 718, 717 వంటి మార్కులు రావటానికి అవకాశం లేదు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు ఇది పెద్ద ఉదాహరణ అని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఎన్‌టీఏ గురువారం వివరణ ఇస్తూ.. కొన్ని పరీక్ష సెంటర్లలో విద్యార్థులకు పరీక్ష సమయం వివిధ కారణాల వల్ల వృథా అయిందని, వారికి అదనపు మార్కులు కలిపామని, అందువల్లే 719, 718, 717 మార్కులు కొందరికి వచ్చాయని తెలిపింది. అయితే, ఒక్కో విద్యార్థికి ఎంత సమయం వృథా అయ్యింది? దేని ఆధారంగా నిర్ణయించారు? అన్న దానిపై వివరణ లేదు. అనేక మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్ష పెద్ద స్కామ్‌గా తయారైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదులు పోటెత్తుతున్నాయి. ఎన్‌టీఏ వివరణతో ఎవరూ సంతృప్తి చెందటం లేదు.

కేంద్రం స్పందించాలి: ప్రియాంకాగాంధీ

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు నిర్వహించాలని విపక్ష కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో మోదీ ప్రభుత్వం ఆడుకుంటోందని విమర్శించారు. నీట్ పరీక్షపై, ఫలితాలపై లక్షలాదిమంది విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తుంటే కేంద్రం ఎందుకు సమాధానం ఇవ్వటం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ నిలదీశారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. నీట్‌పై తమ వ్యతిరేకతను తాజా పరిణామాలు బలపరుస్తున్నాయన్నారు. నీట్ వంటి పరీక్షలు పేదలకు, సమాఖ్య విధానానికి, సామాజిక న్యాయానికి వ్యతిరేకమైనవని.. అందరం కలిసి వీటిని తిప్పికొట్టాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. మరోవైపు, నీట్ పరీక్షపై ఓ విద్యార్థి దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఎన్‌టీఏ వివరణ కోరుతూ శుక్రవారం నోటీసులు జారీ చేసింది.

పెంచిన వారే గొంతుకోసి చంపేశారు!

- ఆస్తిని తిరిగి దక్కించుకునేందుకు ఘాతుకం
- ప్రకాశం జిల్లా బాలిక హత్య కేసులో పురోగతి

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడే...కానీ, ఆస్తి వ్యామోహం అతన్ని క్రూరుణ్ణి చేసింది...భార్య సహకరించింది. ఫలితం దత్తత పుత్రికను దంపతులు దారుణంగా హత్యచేశారు. నిందితుడైన ఆ ఉపాధ్యాయుడు వైసీపీ అధికారంలోకి వస్తుందని భారీ మొత్తంలో బెట్టింగ్‌లు కట్టి నష్టపోయినట్టు కూడా సమాచారం.


శాన్విరెడ్డి

కంభం, జూన్ 7 : ప్రకాశం జిల్లాలో సంచలనం సృష్టించిన తొమ్మిదేళ్ల బాలిక శాన్విరెడ్డి హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. పెంపుడు తల్లిదండ్రులే అత్యంత క్రూరంగా ఆ చిన్నారి గొంతుకోసి చంపారని విచారణలో వెల్లడైనట్టు సమాచారం. మండల కేంద్రమైన అర్థవీడులో గురువారం పట్టపగలు ఇంట్లోనే శాన్విరెడ్డి (9) హత్యకు గురైన విషయం విదితమే. పోలీసుల విచారణలో శాన్విరెడ్డిని పెంపుడు తండ్రి రమణారెడ్డి సమక్షంలోనే పెంపుడు తల్లి పద్మావతి కత్తితో గొంతు కోసి హత్య చేసినట్టు ఒప్పుకున్నారని సమాచారం. రాచర్లకు చెందిన రమణారెడ్డి, రంగారెడ్డిలు సోదరులు. రమణారెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ అర్థవీడులో స్థిరపడ్డారు. రంగారెడ్డి వృత్తిరీత్యా ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్‌లో ఉంటున్నారు. రమణారెడ్డికి పిల్లలు లేకపోవడంతో తమ్ముడి కుమార్తె శాన్విరెడ్డి(9)ని ఎనిమిదేళ్ల క్రితం దత్తత తీసుకున్నారు. అప్పట్లోనే తమ ఆస్తిని శాన్విరెడ్డి పేరిట రాసినట్టు సమాచారం. అయితే శాన్విరెడ్డి పెరుగుతున్న కొద్దీ అసలు తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోతుందన్న అభద్రతాభావం రమణారెడ్డి దంపతుల్లో ఏర్పడింది. పైగా రమణారెడ్డి ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తుందని భారీ మొత్తంలో బెట్టింగ్‌లు పెట్టి నష్టపోయాడు. దీంతో దత్తపుత్రిక పేరిట రాసిన ఆస్తిని తిరిగి చేజిక్కించుకోవాలని భావించారు. ఈనేపథ్యంలోనే శాన్విరెడ్డిని అసలు తల్లి రెండు రోజులు తమ ఇంటికి తీసుకెళ్లింది. తిరిగి తెచ్చుకునేందుకు పద్మావతి డోన్ వెళ్లగా రెండు రోజులు ఉండి వస్తుందిలే అని చెప్పింది. దీంతో శాన్విరెడ్డి ఎప్పటికైనా కన్న తల్లిదండ్రుల ఇంటికే వెళ్లిపోతుందని పద్మావతి కక్ష పెంచుకొంది. ఐదు రోజుల క్రితం శాన్విరెడ్డిని అర్థవీడు తీసుకువచ్చారు. గురువారం ఉదయం పదునైన కత్తితో పద్మావతి శాన్విరెడ్డి గొంతు కోసి హత్య చేసింది. ఇదంతా రమణరెడ్డి చూస్తూ ఉన్నట్టు సమాచారం. పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్టు తెలిసింది.

ఆ బదిలీలన్నీ సక్రమమేనట!

- 1200 మందిని బదిలీ చేసి, కొందరినేనని వెల్లడి
- ఆ వివరాలు వెల్లడించకుండా అత్యంత గోప్యత
- లంచాలు తీసుకోకపోతే ఎందుకు వెల్లడించలేదు?
- టీచర్లు బొత్స ఆఫీసు చుట్టూ ఎందుకు తిరిగారు?
- ఎమ్మెల్యేలు అడిగారని ఎందుకు చెప్పారు?
- డబ్బులు పోయాయని వాపోతున్న టీచర్లు

దొడ్డిదారి బదిలీలపై బొత్స వితండవాదం .. టీచర్లు అడిగారు... మేం చేశామని వ్యాఖ్య

అమరావతి/విశాఖపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన ఉపాధ్యాయుల అక్రమ బదిలీల వ్యవహారంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వితండ వాదనకు దిగారు. అవి అక్రమ బదిలీలు కావని, అంతా సక్రమంగానే జరిగాయని బుకాయించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' సహా ఇతర పత్రికల్లో ప్రచురితమైన అక్రమ బదిలీల వార్తపై ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "కొందరు టీచర్లు వారి ఆరోగ్య కుటుంబ, ఇతరత్రా ఇబ్బందుల రీత్యా బదిలీలు కావాలని అర్జీ పెట్టుకున్నారు. వాటిని పూర్తిగా పరిశీలించి, క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకున్న తర్వాతే బదిలీలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఎన్నికల ఫలితాలు విడుదలైన వెంటనే ఆ బదిలీలు ఆపాలని నేనే అధికారులను కోరాను. దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనేది కొత్త ప్రభుత్వం ఇష్టం. లంచాలు తీసుకోవాల్సిన అగత్యం, అవసరం మాకు లేదు" అని పేర్కొన్నారు. అయితే.. ఈ వ్యవహారంలో తప్పు జరిగి ఉంటే విచారణ చేసుకోవచ్చని మాత్రం ఆయన ఎక్కడా సూచించలేదు. సాధారణంగా ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు తప్పు జరగలేదని నేతలు పేర్కొంటారు. విచారణకు సైతం డిమాండ్ చేస్తారు. ఇదే అధికారంలో ఉన్నప్పుడు ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధం అంటూ పదేపదే ప్రకటించిన బొత్స.. ఇప్పుడు విచారణ అనే కనీస ప్రస్తావన చేయలేదు. గతేడాది సాధారణ బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా చేశారు. ఆ వెంటనే అక్రమ బదిలీల వ్యవహారాన్ని ప్రారంభించారు. సాధారణ బదిలీల్లోనే వివిధ రూపాల్లో బదిలీల పాయింట్లలో వెయిటేజీ ఉంటుంది. అనారోగ్య సమస్యలు, జీవిత భాగస్వామి కోటా(స్పౌజ్), పిల్లల అనారోగ్య సమస్యలు, దివ్యాంగులు, ఇతరత్రా కేటగిరీలకు మినహాయింపులు, పాయింట్లలో వెయిటేజీలు ఉంటాయి. బొత్స చెప్పే సమస్యలు వాటి పరిధిలోకే వస్తాయి. కానీ, సాధారణ బదిలీల్లో ఇలాంటి కారణాలు చూపకుండా ఆ వెంటనే ఆరోగ్య సమస్యలపై బదిలీ కావాలని ఎందుకు కోరారు? అయినా బదిలీలు ముగిసిన వెంటనే దరఖాస్తులు ఎందుకు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఇక, సాధారణ బదిలీల తరహాలో సిఫారసు బదిలీల వ్యవహారాన్ని ఎందుకు బహిర్గతం చేయలేదనేది మరో ప్రశ్న. ఈ వ్యవహారంలో అడుగడుగునా ఎందుకు గోపత్య పాటించారు? అనే సందేహాలకు కూడా బొత్స ఎక్కడా సమాధానమివ్వలేదు. ఈ అక్రమ బదిలీలు ఆపాలని ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో నేతలు కోరగా బొత్స వారిపై చిందులు తొక్కారు. వాటితో మీకేం సంబంధం అంటూ నిలదీశారు. ఇదే విషయాన్ని మీడియా ప్రశ్నించగా "సిఫారసు బదిలీలు చేస్తే తప్పేంటి? ఎమ్మెల్యేలు అడిగితే ఆ మాత్రం చేయకూడదా? అవి కూడా చేసుకోలేకపోతే ప్రభుత్వం ఎందుకు?" అంటూ అక్రమాలను బహిరంగంగా సమర్థించుకున్నారు. అంతే తప్ప ఫలానా రూల్ ప్రకారం చేస్తున్నాం అని మాత్రం చెప్పలేకపోయారు.

ఎన్నడూ జరగని విధంగా

సాధారణంగా ప్రభుత్వంలో పరిపాలనా కారణాల రీత్యా బదిలీలు జరుగుతుంటాయి. సాధారణ బదిలీలతో సంబంధం లేకుండా ఇవి ఎప్పుడైనా చేయొచ్చు. అలాగని ఏ ప్రభుత్వంలోనూ వందల సంఖ్యలో ఈ బదిలీలు జరగవు. కానీ, మాజీ మంత్రి బొత్స ఈ తరహా బదిలీలకు ఏకంగా గేట్లు తెరిచారు. ఒకేసారి 1200 మందిని బదిలీచేసి, ఇప్పుడేమో కొందరినే చేశామని చెబుతున్నారు. కేవలం పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్, సచివాలయం, బొత్స పేషీకి తప్ప ఇంకెవరికీ ఈ బదిలీల గుట్టు తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ఇదిలా వుంటే, బదిలీలకు లంచాలిచ్చి మోసపోయిన టీచర్లు ఎవరికీ చెప్పుకోలేక లబోదిబోమంటున్నారు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- లంచాలు తీసుకోకుండా బదిలీలు చేసి ఉంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు రాగా వాటిని ఏ పద్ధతిలో 1200కు పరిమితం చేశారు?
- ఫలానా కారణంతో కొంత మందిని బదిలీ చేయలేదనే విషయాన్ని అప్పట్లోనే ఎందుకు స్పష్టం చేయలేదు?
- పారదర్శకంగా బదిలీ చేసి ఉంటే రహస్యంగా ఎందుకు ఉంచారు?


మీడియాతో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ

టీచర్ల బదిలీల్లో బొత్సదే కీలకపాత్ర

- టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ఉపాధ్యాయుల అడ్డగోలు బదిలీల వ్యవహారంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ కీలక పాత్ర పోషించారని టీడీపీ నేత, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా బొత్స బదిలీ ఉత్తర్వులు జారీచేశారని, ఈ వ్యవహారంలో భారీగా సొమ్ములు చేతులు మారాయని తెలిపారు. బదిలీలు నిలిపివేస్తూ తాజాగా ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారంలో సొమ్ములు ఇచ్చిన టీచర్లతోపాటు తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. బొత్స ఆయన బృందంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. మిగిలిన శాఖల్లో జరిగిన కుంభకోణాలపైనా విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ.. టీచర్ల అక్రమ బదిలీల్లో బొత్సదే ప్రధాన పాత్ర అని ఆరోపించారు. బదిలీల కోసం ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి 6లక్షల వరకు వసూలు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్లు వరకు వసూలు చేశారని ఆరోపించారు.

రేపు ఏపీ లా సెట్

పెదకాకాని, జూన్ 7: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఏపీ లా సెట్, ఏపీ పీజీ ఎల్ సెట్-2024 ఆదివారం నిర్వహించేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేసింది. పరీక్షకు వచ్చే విద్యార్థులు డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌తోపాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదో ఒకటి తీసుకుని రావాలి. రాష్ట్రవ్యాప్తంగా 105 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


తిరుమల ఆలయం ఎదుట జస్టిస్ జ్యోతిర్మయి

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ద్వారకాతిరుమలలో జస్టిస్ సుజాత


జస్టిస్ సుజాతకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల, జూన్ 7: ద్వారకా తిరుమల చినవెంకన్నను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత శుక్రవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన న్యాయమూర్తికి అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం గర్భాలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి: ముఖేష్ కుమార్ మీనా


ముఖేష్ కుమార్ మీనా

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహారాష్ట్ర హెచ్చరిక

కేంద్రంలో భారతీయ జనతాపార్టీకి సొంతబలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల అవకాశాన్ని దక్కనివ్వకుండా చేసింది మహారాష్ట్ర. ఆ పార్టీని కనీస మెజారిటీకి దూరంగా నిలిపివేయడంలో ఉత్తర్‌ప్రదేశ్ తరువాత ఈ రాష్ట్రమే ప్రముఖపాత్ర పోషించింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఈ రాష్ట్రం నుంచి 23స్థానాలు గెలుచుకున్న బీజేపీకి ఇప్పుడు 9మాత్రమే వచ్చాయి. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు ఏడు, అజిత్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఒకే ఒక్కటి దక్కాయి. మొత్తంగా 48సీట్లలో ఎన్‌డీఏకు వచ్చినవి 17. ఫలితాలు వెలువడగానే, డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్రఫడ్నవీస్ పార్టీ అధిష్టానాన్ని బాధ్యతలనుంచి తప్పించాల్సిందిగా కోరారు. మీడియా సమావేశం పెట్టి, ఈ ఫలితాల పాపం తనదే అన్నారు. ఇక, ఒకేఒక్క సీటు గెలుచుకున్న ఎన్‌సిపీ అధినేత అజిత్‌పవార్ గురువారం సమీక్షాసమావేశం నిర్వహిస్తే, 41మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గైర్హాజరైనారు. ఒకరు విదేశాల్లో ఉన్నారు సరే, మిగతా నలుగురికీ సరిగ్గా అదే రోజు ఆరోగ్యం బాగోలేకపోవడం విశేషం. ముందురోజున ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ మీద భాగస్వామ్యపక్షాలు తమ గౌరవవిశ్వాసాలను ప్రకటించిన ఎన్డీయే సమావేశానికి అజిత్ పవార్ గైర్హాజరైనారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల కారణంగా మహారాష్ట్ర రాజకీయాల్లో రాబోయే రోజుల్లో పలు పరిణామాలు సంభవించబోతున్నాయి.

లోక్‌సభలో 99స్థానాలు నెగ్గి, సెంచరీకి ఒక్కటి తక్కువైన కాంగ్రెస్‌కు మహారాష్ట్రలోని సింగ్లీనుంచి రెబెల్ అభ్యర్థిగా గెలిచిన విశాల్‌పాటిల్ తన మద్దతు ప్రకటించి, తమ పార్టీ బలం నూరుకు చేరినందుకు మహారాష్ట్ర కాంగ్రెస్ సంతోషిస్తోంది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వసంత్‌దాదాపాటిల్ మనుమడి మద్దతును స్వాగతిస్తూ, వెన్నుపోటుదారులకు, ద్రోహులకు వ్యతిరేకంగా తమ పార్టీ ఎంతో అద్భుతంగా పోరాడిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఓ సుదీర్ఘమైన ప్రకటన చేశారు. గత రెండు ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కు పరిమితమైన కాంగ్రెస్ ఈమారు డబుల్ డిజిట్ చేరినందుకు ఆ పార్టీ నాయకులు సంతోషంగా ఉన్నారు. మహారాష్ట్ర ఫలితాలు అనూహ్యమైనవేమీ కావు. ప్రజలు ఎటున్నారో కొంతకాలంగా సూచనలు వెలువడుతూనే ఉన్నాయి. చీలినవారిని కాక, ఏలినవారిని ప్రజలు గుర్తుపెట్టుకున్నారు. నెత్తినపెట్టుకున్నారు.

రెండేళ్ళక్రితం నలభైమంది ఎమ్మెల్యేలతో ఉద్ధవ్‌ఠాక్రేమీద తిరుగుబాటు చేసి, బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఏక్‌నాథ్‌షిండేకు రాష్ట్ర ప్రజలు తాము ఎటువైపో ఈ ఎన్నికల్లో తేల్చిచెప్పారు. వెన్నుపోట్లకు, చీలికలకు పర్యాయపదంగామారి, దేశవ్యాప్తంగా బీజేపీ నేతలు విపక్షపాలిత రాష్ట్రాల్లో షిండేలను సృష్టిస్తాం అంటూ ఒక అస్త్రంగా వాడిన ఏక్‌నాథ్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారు. అలాగే, బాబాయ్ శరద్‌పవార్‌ను కాదని, బీజేపీతో జట్టుకట్టి, ఉపముఖ్యమంత్రి అయిన అజిత్‌పవార్‌కు సైతం భవిష్యత్తు భయం కలిగించారు.

మరాఠా కోటా వివాదం చాలా స్థానాల్లో మహాయుతి విజయావకాశాలమీద ప్రభావం చూపింది. కానీ, ముందుగా ఏక్‌నాథ్‌షిండేనీ, ఆ తరువాత అజిత్‌పవార్‌నీ చీల్చి రాష్ట్రంలో బీజేపీ ఆడిన నాటకం ప్రజలకు నచ్చలేదు. పైగా, అప్పటివరకూ తాము అవినీతిపరులుగా చిత్రీకరించిన అజిత్‌పవార్, అశోక్‌చవాన్ వంటి వారినే బీజేపీ చేర్చుకొని కీలకమైన పదవులు ఇవ్వడం ప్రజలు మెచ్చలేదు. ఈడీ, సీబీఐలను ప్రయోగించి, అధికారపక్ష ఎమ్మెల్యేలను వెంటతరమి, భయపెట్టి, వెన్నుపోట్లకు ప్రోత్సహించి, తమ పార్టీలో చేరగానే వారిని పరిశుద్ధులుగా ప్రకటిస్తున్న బీజేపీ 'వాషింగ్‌మెషీన్' విధానాన్ని ప్రజలు అర్థంచేసుకున్నారు. రాష్ట్రం తీవ్ర వ్యవసాయసంక్షోభాన్ని చవిచూస్తున్నది. ఉల్లిపాయలమీద నలభైశాతం పన్నువేయడం, ఎగుమతులను నిలిపివేయడం కూడా రైతులకు కోపం తెప్పించింది. పదిశాతానికి పైగా దళిత జనాభాతో దళిత చైతన్యం అధికంగా ఉన్న మహారాష్ట్రలో రాజ్యాంగానికి సంబంధించి కాంగ్రెస్ చేసిన హెచ్చరికలు కూడా బాగా పనిచేసినట్టున్నాయి. బీజేపీ ఈమారు బలంగా వస్తే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం మారిపోతుందని, రిజర్వేషన్లకు ముప్పు ఏర్పడుతుందని వారు భయపడినట్టు ఉంది. మహాయుతి దెబ్బతినడానికి ఏయే కారణాలు పనిచేశాయన్నది అటుంచితే, మహావికాస్ అగాడీకి మంచిరోజులు వచ్చాయని ఈ ఫలితాలు తేల్చేశాయి. న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం న్యాయం చేయకపోయినా, తాము ఉన్నామని ఉద్ధవ్‌ఠాక్రేకు, శరద్‌పవార్‌కు ప్రజలు భరోసా ఇచ్చారు.

నవరత్నాలేవి జగన్‌ని కాపాడలేకపోయాయి. ఒక విధంగా చెప్పాలంటే నవరత్నాలు, బటన్ నొక్కుడు ఆయన కొంప ముంచాయి. జగనన్న ఆసరా, జగనన్న గోరుముద్ద అంటూ జగనన్న పేరుతో పథకాలను అమలు చేస్తే ప్రజలు డబ్బుకి ఆశపడతారని భావించిన నేతలకు ప్రజలు సరైన గుణపాఠం నేర్పారు. ఎవరి డబ్బు ఎవరికి ఇస్తున్నారో ప్రజలు అర్థం చేసుకుని ఆత్మగౌరవం కాపాడుకున్నారు.

అరాచకానికి చరమగీతం

విజ్ఞులైన ఆంధ్ర ప్రజలు అరాచక పాలనకు చరమగీతం పాడారు. జగన్ ఓటమి అందరూ ఊహించినదే అయినా కనీసం ప్రతిపక్ష హోదా కూడా రానిస్థితిలో ఓడిపోతారని అనుకోలేదు. 'తన కోపమే తన శత్రువు...' అని శతకకారుడు చెప్పినట్టుగా జగన్ అహంకారమే అతనిని అథఃపాతాళానికి పంపింది. ప్రజలు కేవలం తమ స్వార్థం మాత్రమే చూడరని, భవిష్యత్తు తరాల అభివృద్ధిని కూడా చూస్తారని స్పష్టం చేస్తూ చరిత్రలో నిలిచిపోయే విధంగా తీర్పు చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగా జగన్ ప్రభుత్వం ఓడిపోయి, తెలుగుదేశం అధికారంలోకి వస్తుందన్న వార్తలతో ప్రజలు ఎక్కడికక్కడే బాణాసంచా కాల్చుతూ, స్వీట్లు పంచుకోవడం కనిపించింది.

రాజధాని వస్తుందని, భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని ఎంతో ఉదారంగా 33 వేల ఎకరాలను ఉచితంగా ప్రభుత్వానికి స్వాధీనం చేసిన చిన్న, మధ్య తరగతి రైతులు, బడుగువర్గాలకు అన్యాయం చేస్తూ రాజధానిని విశాఖపట్నానికి తరలిస్తున్నట్టు ప్రకటించిన ఫలితమే ఈ ఎన్నికల ఫలితాలు. అమరావతి రాజధాని తరలింపు ప్రతిపాదనకు నిరసనగా రాజధాని ప్రాంత రైతులు, మహిళలు, బడుగులు నిర్వహించిన ఉద్యమం కార్చిచ్చు జగన్ ప్రభుత్వాన్ని దహించింది. రాష్ట్ర విభజన కారణంగా ఎంతో అభివృద్ధి చెందిన హైదరాబాద్ నగరం తమకు ఏమికాకుండా పోయిందని, ఆంధ్ర ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందనే భావన రాష్ట్ర ప్రజల మనసులలో వుంది. హైదరాబాద్‌కు పోటీగా అమరావతి అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశపడి రాష్ట్ర విభజన తర్వాత తొలుత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేశారు. ఆ తర్వాత జగన్మోహన్‌రెడ్డి తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరడంతో చంద్రబాబు కంటే మెరుగ్గా ఏమైనా చేస్తాడేమోనని రెండోసారి ప్రజలు ఆయనకి అవకాశం ఇచ్చారు. అయితే ఆయన అధికారంలోకి వచ్చిన రెండో రోజే చంద్రబాబుపై కక్షతో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రజావేదికను కూల్చివేయించడాన్ని ప్రజలు మరచిపోలేదని ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయి.



అమరావతిలో దాదాపు 34 వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రాజధాని భవనాలు కనిపిస్తున్నప్పటికీ రాజధాని కాదు.. శ్మశానం అంటూ మంత్రులు వ్యాఖ్యానించడాన్ని ప్రజలు గుర్తుంచుకున్నారు. కొత్త రోడ్ల నిర్మాణానికి తట్ట మట్టి కూడా వేయకపోగా, రాజధాని ప్రాంతంలో సీడ్ యాక్సెస్ రోడ్డు పేరిట నిర్మించిన ఆరు లైన్ల రోడ్లను తవ్వి కంకర తీసుకువెళ్లినా పట్టించుకోని మంత్రుల అహంకార ధోరణిని ప్రజలు బాగా పట్టించుకున్నారు.

నవరత్నాలేవి జగన్‌ని కాపాడలేకపోయాయి. ఒక విధంగా చెప్పాలంటే నవరత్నాలు, బటన్ నొక్కుడు ఆయన కొంప ముంచాయి. మనమంతా పేదలం, ధనవంతులతో పోరాటం అంటూ పెద్ద పెద్ద వాల్‌పోస్టర్లు వేసినా ఆచరణలో ఆయన, ఆయన మంత్రుల వ్యవహారశైలి వారు దానం చేసేవారిగా, ప్రజలు బిచ్చగాళ్లు అనే తరహాలో వ్యవహరించారు. జగనన్న ఆసరా, జగనన్న గోరుముద్ద అంటూ జగనన్న పేరుతో పథకాలను అమలు చేస్తే ప్రజలు డబ్బుకి ఆశపడతారని భావించిన నేతలకు ప్రజలు సరైన గుణపాఠం నేర్పారు. ఎవరి డబ్బు ఎవరికి ఇస్తున్నారో ప్రజలు అర్థం చేసుకుని ఆత్మగౌరవం కాపాడుకున్నారు. బటన్ నొక్కి ప్రతి ఇంటికి ఇన్ని వేలు ఇచ్చాం... ఇన్ని లక్షలు ఇచ్చామని లెక్కలు చెప్పడమే కాకుండా, చివరకు మీరు పార్టీకి ఓటు వేయకపోతే... అంటూ ఒక దశలో వైకాపా నేతలు బెదిరింపులకు కూడా పాల్పడ్డారు.

జగన్ ప్రభుత్వం పెంచిన పన్నులు, ధరలతో మధ్య తరగతి ప్రజల నడ్డి విరిగింది. వీధులను శుభ్రపర్చే బాధ్యత పంచాయితీలు, మున్సిపాలిటీలది. అందుకోసమే ప్రజలు ఇంటి పన్ను చెల్లిస్తారు. కానీ ప్రత్యేక చెత్తపన్ను విధించారు. ప్రజల ప్రమేయం లేకుండా ప్రతి సంవత్సరం ఇంటి పన్నును 15 శాతం పెంచే విధంగా ఉత్తర్వులు ఇచ్చింది. ఎప్పుడూ 500–600 రూపాయలు వుండే మధ్యతరగతి ప్రజల కరెంటు బిల్లులు 1500 నుంచి 2000లకు పెరిగింది. ఉప్పులు, పప్పుల ధరలు ఆకాశాన్ని తాకాయి. పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువ. మద్యం ధరలు విపరీతంగా పెంచారు. బూమ్ బూమ్... థామ్ థామ్ పేర్లతో చీప్ లిక్కర్‌ను అమ్మి ప్రజల ఆరోగ్యంతో ఆడుకున్నారు.

మితిమీరిన కీర్తికాంక్ష కూడా జగన్‌ను అధికారానికి దూరం చేసింది. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరును డాక్టర్ వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్శిటీగా మార్పుచేయడం ప్రజలు ఆమోదించలేకపోయారు. పేరు మార్చినందుకు రోడ్లు ఎక్కి నిరసన తెలిపితే, పోలీసు కేసులు పెడతారనే భయంతో ప్రజలు మౌనంగా ఉన్నారు. ఇక రేషన్ కార్డుల నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటోను ముద్రించడం కాకుండా చివరకు పంట పొలాల సరిహద్దు రాళ్లపై కూడా జగన్ ఫోటో చెక్కించుకోవడం, పంచాయితీ భవనాలు, పాఠశాలల వంటి ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులను వేయడం ప్రజలకు చిరాకు కలిగించింది.

చంద్రబాబు నాయుడు పట్ల జగన్మోహన్‌రెడ్డి ఎంత కసిగా వ్యవహరించారో, అంతకు మించిన కసితో ప్రజలు జగన్‌కి వ్యతిరేకంగా ఓటు చేశారు. ఎన్నికల రోజున ఇతర ప్రాంతాలలో వున్న ఆంధ్ర ప్రాంత ప్రజలు లక్షల సంఖ్యలో తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి విదేశాల నుంచి దాదాపు రెండు లక్షల మంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనడాన్ని బట్టి ప్రజలలో జగన్ పట్ల ఎంత కసి వుందో అర్థం చేసుకోవచ్చు. కసి విషయానికి వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయం కూడా గుర్తుకొస్తుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తానని నమ్మబలికాడు. ఆ మాట నిలుపుకోకపోవడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు కనీసం నిరసన తెలిపే అవకాశం కూడా లేకుండా వారిని నానా హింసలకు గురిచేశాడు. అందుకే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా కసి తీర్చుకున్నారు.

● అన్నవరపు బ్రహ్మయ్య

నరేంద్రుని కొత్త అంకం

ప్రపంచమొక రంగస్థలం. పురుషులు, స్త్రీలు అందరూ నటీనటులు. వారి ప్రవేశాలు, నిష్క్రమణలు వారికున్నాయి. ఏడు అంకాల నాటకంలో ప్రతి మనిషి తన జీవిత కాలంలో అనేక పాత్రలు ధరిస్తాడు.

– విలియం షేక్స్పియర్



భారతదేశ గౌరవనీయ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న తరుణంలో నేనీ కాలమ్‌ను రాస్తున్నాను; మీరు చదవబోతున్నారు. అయితే నరేంద్ర మోదీ ఇంకెంత మాత్రం ఇదివరకటి ప్రధానమంత్రి కారు, కాబోరు. ఏక –పార్టీ ప్రభుత్వ నిరంకుశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిష్క్రమించనున్నారు, ఒక సంకీర్ణ ప్రభుత్వ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ రంగప్రవేశం చేయనున్నారు. అనేక పార్టీలు భాగస్వాములుగా ఉన్న సంకీర్ణమది (ఈ భాగస్వామ్య పక్షాలలో తెలుగుదేశం పార్టీకి 16 మంది, జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి 12 మంది ఎంపీలు ఉన్నారు). ఇటువంటి సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించనుండడం మోదీ మహాశయునికి పూర్తిగా కొత్త అనుభవమే. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్‌గా, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా మోదీ తన 55 సంవత్సరాల ప్రజా జీవితంలో తన సొంత పార్టీకి మెజారిటీ లేని ఒక సంకీర్ణ ప్రభుత్వానికి అధినేత పాత్ర వహించేందుకు ఎన్నడూ సిద్ధం కాలేదు. తనకు తెలియని, స్వీయ స్వభావానికి అనుగుణం కాని ఒక ఆటలో ఆయన ఆడనున్నారు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అనేక రాజకీయ పక్షాలు భాగస్వాములుగా ఉన్న ఒక సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించనుండడం మోదీకి పూర్తిగా కొత్త అనుభవమే. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్‌గా, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా మోదీ తన 55 సంవత్సరాల ప్రజా జీవితంలో సొంత పార్టీకి మెజారిటీ లేని ఒక సంకీర్ణ ప్రభుత్వానికి అధినేత పాత్ర వహించేందుకు ఎన్నడూ సిద్ధం కాలేదు. తనకు తెలియని ఒక ఆటలో ఆయన ఆడనున్నారు!

సరే, ఇటీవలే ముగిసిన 18వ లోక్‌సభ ఎన్నికలలో భారతీయ ఓటర్లు, కొద్ది వారాల క్రితం వరకు అసాధ్యమైనవిగా కన్పించిన, అనూహ్యమైనవిగా అన్పించిన ఎన్నో ఘనమైన ఫలితాలను సాధించారు. అవి: పార్లమెంటు ఉభయ సభలు నియమ నిబంధనల ప్రకారం నడవనున్నాయి. సభాపతి, సభానాయకుడి విచక్షణ మేరకు కాకుండా ఏకాభిప్రాయంతో సభా నిర్వహణ జరగనున్నది; వివిధ సభా సంఘాల కూర్పు మరింత సమతౌల్యంగా జరగనున్నది. ఆ సంఘాల సారథ్య బాధ్యతలను అన్ని రాజకీయ పార్టీలకు మరింత సమరీతిలో అప్పగించడం జరగనున్నది; లోక్‌సభలో గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకుడు ఉంటారు, ప్రతిపక్షంలో తగినంత సంఖ్యలో ఎంపీలు ఉన్నారు; పార్లమెంటులోని ప్రభుత్వ ప్రతిపక్ష సభ్యుల మధ్య ఏకాభిప్రాయం లేనిపక్షంలో రాజ్యాంగ సవరణలు అసాధ్యమవుతాయి; కేబినెట్ లేదా మంత్రిమండలి సమావేశాలు కేవలం ప్రధానమంత్రి నిర్ణయాలను లాంఛనప్రాయంగా ఆమోదించేందుకే ఇంకెంత మాత్రం జరగవు. ప్రధానమంత్రి నిర్ణయాలు కేబినెట్ సమావేశంలో చర్చకు వచ్చేటప్పటికే అవి అమలులో ఉండడం ఇటీవలి సంవత్సరాలలో ఒక పరిపాటిగా ఉన్నది. పెద్దనోట్ల రద్దు లాంటి 'కఠోర ' నిర్ణయాలను 'తెలియజేసేందుకు మాత్రమే' కేబినెట్ సమావేశాలు ఇంకెంత మాత్రం జరగబోవు; రాష్ట్రాల హక్కులను అంగీకరించి, వాటిని కాపాడతారు; కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల సంక్రమణ, మంత్రిత్వ శాఖలు/ విభాగాలకు నిధుల కేటాయింపు, పథకాల రూపకల్పన, ఆమోదం నిర్హేతుకంగా జరగవు. అవి విధిగా ప్రభుత్వ భాగస్వామ్య పక్షాల ఆమోదం, సంతృప్తి మేరకు జరిగి తీరుతాయి; ప్రధానమంత్రి ఇకముందు మరింత తరచుగా ఉభయ సభలకు హాజరై సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తారు, ముఖ్యమైన చర్చలలో పాల్గొంటారు.

ప్రజా తీర్పు నుంచి నేర్చుకోవలిసిన పాఠాలు ఏమిటి? భారత ప్రజలు తమ మనసులోని మాటను ఓటు ద్వారా చెప్పారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వారు అమిత విలువనిస్తున్నారు. వాక్‌స్వాతంత్ర్యాన్ని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు వారు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. గోప్యతా హక్కు, నిరసన తెలిపే హక్కును వారు ప్రగాఢంగా కోరుకుంటున్నారు. 'దేశ ద్రోహం', 'పరువు నష్టం' పేరిట బూటకపు కేసులు మోపే ప్రవృత్తిని పాలకులు విడనాడాలి. 'ఎన్‌కౌంటర్, 'బుల్‌డోజర్ న్యాయం'కు స్వస్తి చెప్పాలి (ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఇదొక పాఠం). రామమందిరం రాజకీయాలకు అతీతమైనది. రాజకీయ ప్రయోజనాలకు మతపరమైన అంశాలను మళ్లీ ఉపయోగించుకోకూడదు (ఇదెంత ముఖ్యమో, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన 77 సంవత్సరాల అవదేష్ ప్రసాద్‌ను అడగండి. అలాగే శ్రావస్తి నియోజకవర్గంలో ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి సాకేత్ మిశ్రా (ప్రధానమంత్రి మాజీ ప్రధాన కార్యదర్శి, ఆలయ నిర్మాణ ట్రస్ట్ చైర్మన్ నృపేంద్ర మిశ్రా కుమారుడు) మరింత ముఖ్యంగా, మరింత బాగా చెబుతారు). అంక్షలు లేని పత్రికా స్వేచ్ఛను ప్రజలు కోరుకుంటున్నారు. బూటకపు ఎగ్జిట్‌పోల్స్ గతించిన విషయమైపోవాలి; ప్రధానమంత్రి అనుక్షణ కదలికలను విసుగెత్తేలా చూపించే పద్ధతిని ఎలక్ట్రానిక్ మీడియా విడనాడాలి; పాలకుల ప్రతి మాటను సమర్థించే వైఖరిని ప్రింట్ మీడియా ఇంకెంత మాత్రం అవలంబించకూడదు; మంత్రులకు ఇబ్బంది కలిగించని రీతిలో ప్రశ్నలు వేయడం శాసన నిర్మాతలకు తగదు; ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐలు అందించిన ప్రకటనలను విధేయపూర్వకంగా వల్లించడాన్ని మానుకోవాలి.

ప్రాంతీయ పార్టీలు తమ ప్రధాన సిద్ధాంతాలు, విశ్వాసాలకు చిత్తశుద్ధితో నిబద్ధమవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఢిల్లీలో ఒక మాట, రాష్ట్ర రాజధానిలో మరొక మాట చెప్పడాన్ని వారు హర్షించరు. అటువంటి ప్రాంతీయ పక్షాలను అసోం గణపరిషత్, శిరోమణి అకాలీదళ్, జేజేపీ, భారత రాష్ట్రసమితి, జనతాదళ్ (సెక్యులర్)ను శిక్షించిన విధంగా శిక్షించి తీరుతారు. బిజూ జనతాదళ్, వైసీపీల విషయంలో వలే చెంపపెట్టుగా వ్యవహరిస్తారు. ఇటీవలి ఎన్నికలలో ఈ ప్రస్తావిత పార్టీలకు ఎదురైన అనుభవాల నుంచి తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యునైటెడ్)లు పాఠాలు నేర్చుకోవాలి.

ప్రతిపక్షాల ఎజెండా ఏమిటి? ఒక పార్లమెంటరీ ప్రతిపక్షంగా ప్రవర్తించేందుకు ప్రతిపక్షాలకు పది సంవత్సరాల అనంతరం ఒక అవకాశం లభించింది. పార్లమెంటు లోపలా, బయటా ప్రతిపక్షాలు తమ ఎజెండాకు కట్టుబడాలి. ప్రజలు ఆమోదించి, పలువురు ఇండియా కూటమి అభ్యర్థులను ఎన్నుకోవడానికి కారణమైన కొన్ని భావాలు: దేశ వ్యాప్తంగా సామాజిక– ఆర్థిక సర్వే కులాల వారీ జనగణన; 106వ రాజ్యాంగ సవరణను వెన్వెంటనే అమలుపరిచి, ప్రజలు ఎన్నుకునే చట్ట సభలలో మహిళలకు రిజర్వేషన్లు సమకూర్చడం; గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సహా ప్రతి ఉపాధి కార్యక్రమంలోనూ కనీస దినసరి వేతనాన్ని రూ.400గా నిర్ణయించి అమలుపరచడం; వ్యవసాయ రుణగ్రస్తతపై ఒక శాశ్వత కమిషన్‌ను నియమించి, దాని సిఫారసుల ప్రకారం వ్యవసాయ రుణాలను రద్దు చేయాలి; ప్రభుత్వంలోను, ప్రభుత్వ నియంత్రిత సంస్థలలోను 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి; అప్రెంటిసెస్ చట్టానికి, అవసరమైతే సవరణలు చేసి, వెన్వెంటనే అమలుపరవాలి. అప్రెంటిస్‌లను నియమించేలా లాభదాయకంగా నడుస్తున్న ప్రతి వ్యాపార, పారిశ్రామిక సంస్థపై ఒత్తిడి తేవాలి; అప్రెంటిస్‌లకు ఇచ్చే స్టైపెండ్‌ల భారాన్ని ప్రభుత్వమూ పంచుకోవాలి; అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలి; పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు నిర్ణయించేంతవరకు దాని అమలును నిలిపివేయాలి; సీబీఐ, ఈడీ, ఎనఐఏ, ఎస్‌ఎఫ్ఐఓ, ఎన్‌సీబీ మొదలైన దర్యాప్తు సంస్థలను ఒక సంయుక్త పార్లమెంటరీ సంఘం పర్యవేక్షణలో ఉంచాలి.

జూన్ 9న ఒక కొత్త ఆట ఆరంభమవనున్నది. కొత్త ఆటగాళ్లు అగ్రభాగంలో ఉన్నారు. ఆటగాళ్ల నిష్క్రమణలు, ప్రవేశాలను గమనిస్తూ ఉండండి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

భాషపై పట్టు కోల్పోతున్న యువత

ఒక వ్యక్తి ఏ భాషనైనా నేర్చుకోవడానికి పునాది మాతృభాషే. అలాంటి భాషను నేర్చుకునే దశలో పొరపాట్లు జరిగితే ఆ వ్యక్తి మరే ఇతర భాషలోనూ పరిపూర్ణత సాధించలేడు. ఒక భాషను నేర్చుకుని దానిపై పట్టు సాధించడం అంటే ఆ భాషను ఏకాగ్రతతో విని, అర్థం చేసుకోగలగడం, వ్యాకరణ, ఉచ్చారణ దోషరహితంగా మాట్లాడగలగడం, చదవగలగడం, రాయగలగడం. ఈ నైపుణ్యాలను శ్రద్ధగా నేర్చుకోగలిగితే ఏ భాషలోనైనా పట్టు సాధించవచ్చు. అయితే నేటి యువతకు ఈ నాలుగు నైపుణ్యాలపై తగినంత తర్ఫీదు, అవగాహన లేకపోవడం వల్ల వారు భాషపై పట్టు కోల్పోతున్నారు.

ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో అర్హతలు ఉన్న వారెవరైనా ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఉద్యోగాన్ని సంపాదించి హాయిగా జీవించవచ్చు. అయితే నేటి ప్రపంచంతో పోటీ పడాలంటే సుమారు 60కి పైగా దేశాల్లో 135 కోట్లకు పైగా ప్రజలు మాట్లాడుతున్న 'యూనివర్సల్ లాంగ్వేజ్' ఆంగ్ల భాషను ముందుగానే నేర్చుకోవలసిన అవసరం ఉంది. ఈ కారణం చేతే విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే ఆంగ్ల మాధ్యమంలో చదువుతూ, మాతృభాషను మొక్కుబడిగా చదువుతున్నారు. కానీ ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్నా, విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించకపోగా, మాతృభాషపై కూడా పట్టు కోల్పోతున్నారు. దీనికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా, విద్యార్థులు ఈ భాషలకు సంబంధించిన కోర్సులను నేర్చుకునే సమయంలో వాటిని పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం చదివే కోర్సులుగానే భావించడం ఒక కారణం. అలాగే, ప్రతి విద్యార్థికి తన మాతృభాషలో ఏకాగ్రతగా వినగలిగే, వ్యాకరణ–ఉచ్చారణ దోషరహితంగా మాట్లాడగలిగే, చదవగలిగే, రాయగలిగే నైపుణ్యాలను నేర్పి మాతృభాషపై పట్టు సాధించటానికి అవసరమైన పునాదిని వెయ్యలేకపోవడం మరో కారణం. మాతృభాషలో పటిష్టమైన పునాది ఉన్న ఏ విద్యార్థి అయినా ఇతర భాషలను స్పష్టంగా నేర్చుకోగలుగుతాడు. అలాగే, మనిషి అభివృద్ధికీ భాషకూ మధ్య ఉన్న సహసంబంధాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించలేకపోవడం ఇంకో కారణం.



నేటి యువతను పరిశీలించినప్పుడు వారు తెలుగులో మాట్లాడిన దానిని తెలుగు అక్షరాల రూపంలో రాయలేకపోతున్నారు. అలాగే, ఆంగ్ల భాషలో వ్యాకరణ దోషాలు లేకుండా ధారాళంగా మాట్లాడలేకపోతున్నారు. నేటి యువత వాట్సప్ మెసేజ్ కల్చర్‌ని చూస్తుంటే వారు తెలుగులో అనుకున్న భావాన్ని ఇంగ్లీష్ అక్షరాల రూపంలో రాస్తున్నారు. అంటే తెలుగు, ఇంగ్లీష్ రెండూ మిక్స్ చేసిన ఒక లాంగ్వేజ్‌ని వారు ఉపయోగిస్తున్నారు. దీనినే సరదాగా 'తెంగ్లీష్' అంటున్నారు. అందుకే, నేటి యువత ఆంగ్ల భాషతో పాటు మాతృభాషపై కూడా పట్టు కోల్పోతున్నారు. యువత ఈ 'తెంగ్లీష్' కల్చర్ నుంచి వెంటనే బయటపడాలి లేకపోతే వారికి మాతృభాషలో పొరపాట్లు, ఆంగ్లభాషతో అగచాట్లు తప్పవు.

భాషపై పట్టు సాధించని వ్యక్తి తనలోని సృజనాత్మక శక్తిని ప్రపంచానికి పరిచయం చేయలేడు. అందుకే ప్రాథమిక విద్య నుంచే మాతృభాషలో విద్యార్థులకు గట్టి పునాది వెయ్యాలి. అదే ఇతర భాషలను నేర్చుకోవడానికి ఆసక్తి కలిగిస్తుంది. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా వినడం, మాట్లాడడం, చదవడం, రాయడంపై చక్కటి తర్ఫీదునిస్తూ భాషపై ఆసక్తి కలిగించాలి. ఈ నాలుగు నైపుణ్యాలను అలవాటుగా మార్చుకుని, నిరంతర సాధన చేయడం ద్వారా విద్యార్థి ఏ భాషలోనైనా పట్టు సాధించగలడు.

ఆంగ్ల భాషను విద్యార్థులు సమర్థవంతంగా నేర్చుకోవాలంటే అందుకు అవసరమైన వాతావరణాన్ని విద్యాసంస్థలు సృష్టించాలి. మంచి వక్తలు మాట్లాడే స్ఫూర్తిదాయకమైన వీడియోలను విద్యార్థులు వీక్షిస్తూ, వారు ఉపయోగించే ఇంగ్లీషు భాషను వినే అవకాశాలను విద్యాసంస్థలు కల్పించాలి. తరచుగా ఆంగ్ల భాషలో వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలను నిర్వహించాలి. విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల ఆసక్తి కలగడానికి ఆ భాష ఔన్నత్యాన్ని తెలియపరిచే 'లాంగ్వేజ్ వర్క్‌షాప్స్'ని క్రమం తప్పకుండా నిర్వహించాలి. అదేవిధంగా, అసభ్య పదజాలంతో విద్యార్థులు పరస్పరం సంభాషించుకునే వాతావరణాన్ని విద్యాసంస్థల్లో ఎప్పుడూ ప్రోత్సహించకూడదు. ఇటువంటి వాతావరణం విద్యార్థుల భాషపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

ప్రాథమిక విద్య నుంచి మాతృభాషా మాధ్యమంలో చదవాలా లేదా ఆంగ్ల మాధ్యమంలో చదవాలా అనే మీమాంస అవసరం లేదు. మన ప్రవృత్తికి మాతృభాష ఎంత అవసరమో, మన వృత్తికి ఆంగ్ల భాష కూడా అంతే అవసరం. అందుకే, మాతృభాషను పునాదిగా చేసుకుని ఆంగ్లభాషను, అవసరమైన ఇతర ప్రామాణిక భాషలను నేర్చుకోవాలి.

– నసుబోలు రాజశేఖర్

వారికి.. ఇదే చివరి హెచ్చరిక!

వర్తమానంలో ఇంతకన్నా, గొప్ప తీర్పు ప్రజలు ఇచ్చే పరిస్థితులు లేవు. వారి శక్తి మేరకు నేతలకు కర్రు కాల్చి వాత పెట్టారు. దశాబ్దాలుగా కేవలం సంక్షేమ పథకాలతోనే ప్రజలను భ్రమలో ఉంచుదామనుకొనే నేతలు కళ్ళు తెరవాలి. ప్రజల సంపదను కొందరికి దోచిపెట్టి, భావోద్వేగాలతో వారిని పక్కదారి పట్టించవచ్చనుకున్న నేతలకు ఏది ప్రజాస్వామ్యమో... ప్రజలు ఏమి కోరుకుంటున్నారో తేల్చి చెప్పారు.



'ఈ దేశంలో కోపం వచ్చిన ప్రతి నాయకుడూ ఓ రాజకీయ పార్టీ పెడతాడు' భారత పూర్వ రాష్ట్రపతి స్వర్గీయ నీలం సంజీవరెడ్డి వ్యాఖ్య అది. అది రాజకీయాలలో బాగా పాపులర్ అయింది.

అలాగే, ఈ దేశంలో ఓడిపోయిన ప్రతి రాజకీయ నాయకుడూ ప్రజలను (ఓటర్లను) తిడుతుంటాడు. కానీ, ఏ కిరాయి వ్యూహకర్తలు, ఏ సోషల్ మీడియా సమాచార సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో, తిరుగులేని కాంగ్రెస్ పార్టీని ఎనిమిది ఉత్తరాది రాష్ట్రాలలో 1967 శాసనసభ ఎన్నికలలో ప్రజలు ఓడించారు. సంయుక్త విధాయకదళ్ పేరిట, ఆ ఎనిమిది ప్రభుత్వాలు మూడేళ్ళు తిరగకుండానే, ప్రజల తీర్పును వమ్ము చేసి కుప్పకూలిపోయాయి.

ఆ తర్వాత పదేళ్ళకు, 1977లో కేంద్రంలో అప్పటికి ముప్పై ఏళ్ళుగా ఏకచత్రాధిపత్యంతో ఏలిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడించారు. అయితే ఆ పార్టీకి గౌరవప్రదమైన ప్రతిపక్ష హోదానిచ్చారు. అందులో అగ్రభాగం, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్ర ప్రజలది. 1977 నవంబరు దివిసీమ ఉప్పెన సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన ఆనాటి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి రాజ్‌నారాయణ్ (రాయ్‌బరేలీలో ఇందిరాగాంధీని ఓడించిన నేత), 'ఆంధ్రప్రదేశ్ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు... అందుకే ఇంతటి ఘోరవిపత్తుకు గురైనారు' అని, అమానవీయ ప్రకటన చేశారు. అలాంటివన్నీ మితిమీరి 1980 మధ్యంతర ఎన్నికలలో జనతాపార్టీ ఘోర పరాజయం చవిచూసింది.

1967 వరకు తమిళనాడులో కొనసాగిన కాంగ్రెస్ ప్రభుత్వాలు, ద్రవిడ ఉద్యమం బలోపేతమై ఆనాటి నుంచి ఈనాటి వరకు, అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడలేదు. ఎం.జి రామచంద్రన్ మృతి తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికలలో పుష్కరకాలం విరామం తర్వాత కరుణానిధి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత రెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కరుణానిధి, జయలలిత ఒక్కొక్క అసెంబ్లీ స్థానం గెలుచుకున్న కీర్తి మూటగట్టుకున్నారు.

1983లో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీతో విభేదాలొచ్చి, సిక్కిం సంగ్రామ్ పరిషత్ స్థాపించిన నరబహదూర్ భండారీ 1984లో జరిగిన ఎన్నికలలో 32 స్థానాలకు గాను, 31 స్థానాలు గెల్చుకున్నారు. కాంగ్రెస్‌కు ఒక్క స్థానం దక్కింది. 1990లో భండారీ శిష్యుడు, పోలీసు శాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన, పవన్ కుమార్ చామ్లింగ్, గురువు భండారీపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. 32కి గాను 31 స్థానాలు గెల్చుకున్నారు. భండారీ ఒక్కరే గెలిచారు. దాంతో నరబహదూర్ భండారీ శకం ముగిసిపోయింది. ముఖ్యమంత్రిగా దేశ చరిత్రలో రికార్డు సృష్టించుకున్న చామ్లింగ్ పార్టీ 2019 ఎన్నికలలో ఓటమి చెందింది. ఇటీవల జరిగిన జమిలి ఎన్నికలలో, చామ్లింగ్ రెండు చోట్ల అసెంబ్లీకి పోటీచేసి, ఓడిపోయి, తన చరిత్రకు కళంకం తెచ్చుకున్నారు. 2019లో 10 స్థానాలు గెల్చుకున్న చామ్లింగ్ పార్టీ, 2024 ఎన్నికలో ఒకే స్థానంతో సరిపెట్టుకుంది.

1990 చివరి రోజులలో కేరళలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ అపూర్వ విజయాలు సాధించింది. దాంతో, ఎల్డీఎఫ్ ప్రభుత్వం అసెంబ్లీ ముందస్తు ఎన్నికలకు వెళ్ళింది. ఆలోగా రాజీవ్ గాంధీ హత్య జరిగింది. ఆ సానుభూతి పవనాలలో 1991 జూన్ నెలలో జరిగిన జమిలి ఎన్నికలలో కేరళలోని ఎల్డీఎఫ్ దారుణ పరాజయం మూటగట్టుకొంది. అలాగే 2019 లోక్‌సభ ఎన్నికలలో, ఇందిర కుటుంబం కంచుకోట అయిన అమేథిలాంటి స్థానంలో, రాహుల్ గాంధీని ఓడించిన స్మృతి ఇరానీ, 2024లో కాంగ్రెస్ యువనేత కిశోరీలాల్ శర్మ చేతిలో ఓడిపోయారు. దానికి స్మృతి ఇరానీ అతి ప్రవర్తన, అనాలోచిత ప్రకటనలే కారణం.

ప్రాంతీయ పార్టీలు స్థాపించి ఓ వెలుగు వెలిగి, ఆయా రాష్ట్రాల రాజకీయాలను ప్రభావితం చేసిన ఎస్.బంగారప్ప (కర్నాటక క్రాంతిదళ్) ప్రఫుల్లకుమార్ మహంత (అస్సాం గణపరిషత్) విజయ్‌కాంత్ (తమిళనాడు) వంటి నేతలు, అనతి కాలంలోనే ప్రజల ఆగ్రహానికి గురయ్యారు. ఇందిరాగాంధీని ఎదిరించి, చరిత్ర సృష్టించిన ఎన్టీ రామారావు కూడా కల్వకుర్తిలో (1989) ఓడిపోయారు.

'ఇందిరా గాంధీ, ఎన్టీ రామారావు లాంటి నేతలే ఓడిపోయారు... నువ్వెంత' అని, తెలుగునాట తరచూ ప్రత్యర్థి పార్టీ నేతలను విమర్శించే నాయకులు, ఊరికే ప్రకటనలు తప్ప... అందుకనుగుణమైన గుణపాఠాలు నేర్చుకున్న దాఖలాలు రాష్ట్రంలో లేవు. దేశంలోనూ లేవు. ఎప్పటికప్పుడు ఓడిపోయిన ప్రతి నేత శ్మశాన వైరాగ్యం ప్రదర్శించడం తప్ప, తాను తిరిగి అధికారంలో కొచ్చాక మార్పు శూన్యం. నాలుగు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఈ చరిత్ర పునరావృతమవుతోంది.

పదేళ్ళు అధికారానికి దూరమైన చంద్రబాబు నాయుడుకు 2014లో నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ప్రజలు సువర్ణావకాశం ఇచ్చారు. అయిదేళ్ళు తిరిగేసరికి, ఆ పార్టీని ఓడించి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే, ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించిన జగన్, ఐదేళ్ల తర్వాత వజ్రాలు పొదిగిన పళ్ళెంలో పెట్టి అధికారం (ఎన్డీయే కూటమి) చంద్రబాబుకు అప్పగించారు. ఘోర పరాజయంలో, తన గెలుపు రికార్డును తానే నాశనం చేసుకున్నారు. చైతన్యవంతులైన ప్రజలు ఇచ్చే తీర్పు వెలువడే వరకు, ఎవరి అంచనాకు ప్రజల మనోభావాలు అందలేదు. ఎన్నికలు అత్యంత ఖరీదుగా మారిపోయి, కేవలం ధనబలమే పరమావధిగా నియోజకవర్గాలకు సంబంధం లేని నేతలకు పార్టీలు బి–ఫారాలిచ్చాయి. వారిలో కొందరు ప్రజల ఆదరణకు నోచుకున్నారు. కొందరు డబ్బు వెచ్చించినా గెలుపు తీరాలకు చేరుకోలేకపోయారు.

ఇక, కేంద్రంలో మోదీ–షా రాజకీయ వైఖరులతో, ఈ ఎన్నికలలోనైనా ప్రజాస్వామ్యం కొంత మిగులుతుందా అని ఆందోళన చెందిన దేశభక్తులకు, మంచి ఉపశమనం లభించేలా, ప్రజలు తీర్పునిచ్చారు. ఒడిశాలో జమిలి ఎన్నికలు గనుక జరగక పోయివుంటే, బీజేపీ ఖచ్చితంగా అధికారానికి దూరమయ్యేది. తమిళనాడులో ఈ ఎన్నికల్లో ఎలాగైనా బోణీ కొట్టాలని విశ్వప్రయత్నాలు చేసిన బీజేపీకి నిరాశే మిగిలింది. అయితే ఒడిశాలోని నవీన్ పట్నాయక్ ప్రభుత్వంలో కీలక పాత్ర వహిస్తున్న ఒక తమిళ అధికారి పాండ్యన్ బీజేపీకి పరోక్షంగా ఉపయోగపడడం విశేషం. అసలే, భాషా, ప్రాంతీయాభిమానానికి మారుపేరైన ఒడిశావాసులు, మరో రాష్ట్రానికి చెందిన అధికారిగా తమ రాష్ట్రాధికారంలో చక్రం తిప్పడం భరించలేకపోయారు. పాండ్యన్‌కు అలవిమాలిన ప్రాధాన్యమిచ్చి నవీన్ పట్నాయక్ స్వయంకృతాపరాధానికి పాల్పడ్డారు.


అలాగే రామ్‌లల్లా ప్రతిష్ఠలో ప్రధాన అర్చకునిగా మారిపోయిన ప్రధాని మోదీ, హిందుత్వ ప్రచారానికి ప్రధాన సైన్యాధ్యక్షుడయిన ఆదిత్యనాథ్ యోగికి ప్రజలు తగిన పాఠాలు నేర్పారు. 'రామ్ కే సాత్ రోటీ, కపడా ఔర్ మకాన్ భీ జరూర్ హై' అని హెచ్చరించారు. ఇక, ఔట్ డేటెడ్ మాయావతిని పూర్తిగా రాజకీయ విశ్రాంతి తీసుకోమన్నారు.

వర్తమానంలో ఇంతకన్నా, గొప్ప తీర్పు ప్రజలు ఇచ్చే పరిస్థితులు లేవు. వారి శక్తి మేరకు నేతలకు కర్రు కాల్చి వాత పెట్టారు. దశాబ్దాలుగా కేవలం సంక్షేమ పథకాలతోనే ప్రజలను భ్రమలో ఉంచుదామనుకొనే నేతలు కళ్ళు తెరవాలి. అలాగే ప్రజల సంపదను కొందరికి దోచిపెట్టి, భావోద్వేగాలతో పక్కదారి పట్టించవచ్చనుకున్న నేతలకు ఏది ప్రజాస్వామ్యమో... ప్రజలు ఏమి కోరుకుంటున్నారో తేల్చి చెప్పారు. ఎప్పటికీ ప్రజలే ప్రభువులు. ప్రజలను కేవలం ఓటర్లుగా కాక మనుషులుగా చూసినప్పుడు, ఆదరించినప్పుడే నేతలు, పార్టీలు మంచి ఫలితాలు సాధిస్తారు.

2024 ఎన్నికల ఫలితాలు ప్రజల చివరి హెచ్చరికగా పార్టీలు భావించాలి. జిమ్మిక్కులతో కాక, అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పరిపాలన సాగించాలి. మూడు దశాబ్దాల క్రితం వరకు దేశంలో, రాష్ట్రంలో అన్ని ప్రభుత్వాలు అవకాశం వున్నంత మేర, అభివృద్ధి కార్యక్రమాలు చేశాయి. అందుకే భారతదేశం ఈనాడు కొంతైనా అభివృద్ధి సాధించింది. దాని ఫలితాలు కొన్నైనా ప్రజలు చవిచూడగలుగుతున్నారు. అలా కాదని, ఇంకా ప్రజలను భిక్షగాళ్ళుగా మార్చే ఆలోచనలతో పాలన సాగిద్దామంటే, భవిష్యత్‌లో ప్రజలు ఏ విధంగా స్పందిస్తారో ఊహించడం కష్టం. పార్టీలు, నేతలూ! తస్మాత్ జాగ్రత్త!

■ వి.వి. అప్పారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





గుడివాడలో టీడీపీ కార్యకర్తలను నిలువరిస్తున్న పోలీసులు



అలలపై అలా అలా..

కృష్ణానదీ తీరంలో 'కపుల్ అండ్ ఫ్యామిలీ క్యాండిల్ లైట్' డిన్నర్

* కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే అందుబాటులోకి..
* ఐదేళ్ల తర్వాత మళ్లీ పర్యాటక శోభ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానది అలలపై తేలియాడుతూ, వాటర్ జెట్టీపై కొవ్వొత్తుల వెలుగుల్లో డిన్నర్ చేయడం ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు. కొద్దిరోజుల్లో ఈ కపుల్ అండ్ ఫ్యామిలీ క్యాండిల్ లైట్ డిన్నర్ డైలీ ఈవెంట్‌ను నిర్వహించటానికి పర్యాటకాభివృద్ధి సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే హరిత బెర్మ్‌పార్క్ బోటింగ్ మినీ ఎంట్రీ పాయింట్ వద్ద ఏర్పాట్లు మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే, ఈ కార్యక్రమం ప్రారంభంకానుంది. మళ్లీ ఐదేళ్ల కిందటి పర్యాటక శోభను తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగానే ఈ ప్రణాళిక వేశారు. కృష్ణానదిలో మెయిన్ బోటింగ్ ఎంట్రీ పాయింట్‌కు కూతవేటు దూరంలో ఉన్న మినీ ఎంట్రీ పాయింట్ దగ్గర ఈ డైలీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. సాధారణంగా ఇలాంటి క్యాండిల్ లైట్ డిన్నర్లను సముద్రం లేదా నదీతీరంలోని ఇసుక మేటలపై నిర్వహిస్తారు. ప్రస్తుతం కృష్ణానది తీరం వెంబడి ఘాట్లలో ఈ డిన్నర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే హరిత బెర్మ్‌పార్క్ సమీపంలో వాటర్ జెట్టీపై పోల్స్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ పోల్స్ చుట్టూ తెల్లటి వస్త్రాలతో పరదాలను ఏర్పాటు చేస్తారు. లోపల రౌండ్ డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తారు. ఇక్కడ వెలుగులు ఇచ్చేందుకు పెద్దపెద్ద కొవ్వొత్తులు ఏర్పాటు చేస్తారు. జంటగా కానీ, కుటుంబ సమేతంగా కానీ డిన్నర్ చేయాలనుకునేవారు ముందే బుకింగ్ చేసుకోవాలి. దీనికి సంబంధించిన ఫోన్ నెంబర్‌ను తర్వాత ప్రకటిస్తారు.

రోజూ ఫుడ్ ఫెస్టివల్స్

కేంద్ర జలరవాణా సంస్థ నుంచి పర్యాటకాభివృద్ధి సంస్థకు నాలుగు వాటర్ ఫంట్స్ వచ్చాయి. ఈ ఫంట్స్‌లో రెండింటిని జాయింట్ చేసి రోజూ ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తారు. అన్‌లిమిటెడ్ ఫుడ్ పేరుతో వారంలో రోజూ ఒక స్పెషల్ ఫుడ్‌తో ఫెస్టివల్ నిర్వహించేందుకు మెనూ రూపకల్పన చేస్తున్నారు. సీ ఫుడ్, బిర్యానీలు, గోదావరి, రాయలసీమ రుచులను ప్రత్యేకంగా అందించనున్నారు.

కట్టలు తెంచుకున్న ఆగ్రహావేశాలు!


* వైసీపీ శిలాఫలకాల ధ్వంసం
* టీడీపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు.. నందిగామలో ఉద్రిక్తత

- 6లో..

టీడీపీ శ్రేణులు ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. వైసీపీ శ్రేణులు ఓడిపోయినా కవ్వింపు చర్యలకు దిగడంతో సహనం నశించి ముందుకు కదులుతున్నారు. అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వల్లభనేని వంశీతో పాటు చంద్రబాబు, లోకేశ్‌పై నిత్యం బూతులతో దాడి చేసిన కొడాలి నానికి బుద్ధి చెప్పాలనుకున్నారు. శుక్రవారం నగరంలోని వంశీ ఇంటిపై, గుడివాడలోని కొడాలి నాని ఇంటిపై దాడికి దిగారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినా, తాను ఓడిపోయినా రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న కొడాలి నాని మాట నిలబెట్టుకోవాలని ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో ఉన్న టీడీపీ శ్రేణులను నిలువరించాల్సిన పోలీసులు లాఠీచార్జి చేయడంతో నగరంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి/గుడివాడ

సహనం నశించి..



నగరంలో టీడీపీ కార్యకర్తపై పోలీసుల లాఠీచార్జి

గుడివాడలో కొడాలి నాని ఇంటిపై కోడిగుడ్లు విసిరి నిరసన

* వంశీ కవ్వింపులతో రెచ్చిపోయిన యార్లగడ్డ వర్గం
* టీడీపీ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న నాని
* మాట నిలబెట్టుకోవాలని తెలుగు యువత నినాదాలు
* రెండుచోట్లా పోలీసుల ఓవరాక్షన్
* నగరంలో టీడీపీ నాయకులపై లాఠీచార్జి
* పలువురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

తిరగబడిన తెలుగు తమ్ముళ్లు

నగరంలో వల్లభనేని వంశీ ఇంటిపై దాడి.. కార్లు ధ్వంసం

నగరంలో వంశీ ఇంటిపై దాడి

* టీడీపీ నాయకులపై పోలీసుల లాఠీచార్జి

నిత్యం కవ్వింపు చర్యలకు పాల్పడిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభిమానులు రెచ్చిపోయారు. శుక్రవారం నగరంలోని వంశీ ఇంటికి వచ్చిన టీడీపీ కార్యకర్తలు.. దమ్ముంటే వంశీ నేరుగా వచ్చి తమతో తలపడాలని, పిరికిపందలా తన అనుచరులతో కవ్వింపు చర్యలకు దిగడం సరికాదని నినాదాలు చేశారు. వంశీ కార్లను ధ్వంసం చేశారు. యార్లగడ్డ అభిమానులు భారీగా తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. టీడీపీ అభిమానులను చెల్లాచెదురు చేసేందుకు లాఠీలను ప్రయోగించారు. దీంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వంశీ, ఆయన అనుచరులు చేసిన అరాచకాన్ని అడ్డుకోలేని పోలీసులు ఇప్పుడు తమను నిలువరించడం ఏమిటంటూ టీడీపీ కార్యకర్తలు తిరగబడ్డారు. ఘర్షణ విషయం తెలుసుకున్న యార్లగడ్డ వెంకట్రావు హుటాహుటిన ఘటనాస్థలికి తరలివచ్చారు. గాయపడిన కార్యకర్తలను పరామర్శించి, ఆసుపత్రికి తరలించారు. పలువురు టీడీపీ కార్యకర్తలను మాచవరం పోలీసుస్టేషన్‌కు తరలించడంతో విడిపించి తీసుకొచ్చారు. 'నాడు వైసీపీ నాయకులకు కొమ్ముకాసి నేడు మాపై దాడులా?' అంటూ యార్లగడ్డ వెంకట్రావు పోలీసులను నిలదీశారు.

గుడివాడలో కొడాలి నాని ఇల్లు ముట్టడి

* రాజకీయ సన్యాసం మాట నిలబెట్టుకోవాలని డిమాండ్

తెలుగు యువత నాయకుడు పొట్లూరి దర్శిత్ ఆధ్వర్యంలో గుడివాడ రాజేంద్రనగర్‌లోని కొడాలి నాని ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చినా, తాను గుడివాడలో ఓడిపోయినా రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కొడాలి నాని బయటకు వచ్చి రాజకీయ సన్యాసంపై స్పందించాలని కోరారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం తెలుగు యువత కార్యకర్తలు పలువురు కొడాలి నాని ఇంటిపైకి కోడిగుడ్లు విసిరి, మాట నిలబెట్టుకోకపోతే ఇదే శాస్తి జరుగుతుందని స్పష్టం చేశారు. సీలింగ్ ఫ్యాన్‌ను నేలకేసి కొట్టి నిరసన తెలిపారు. జై చంద్రబాబు అంటూ నాని ఇంటి వద్ద బాణసంచా కాల్చారు. డీఎస్పీ శ్రీకాంత్ రంగంలోకి దిగి దర్శిత్, తెలుగు యువత నాయకులతో మాట్లాడటంతో నిరసన విరమించారు. అనంతరం పొట్లూరి దర్శిత్ విలేకరులతో మాట్లాడుతూ గుడివాడలో కొడాలి నానీకి కౌంట్‌డౌన్ మొదలైందని, ఇంట్లో ఉండి పిరికివాడిలా దాక్కున్నాడన్నారు. దమ్ముధైర్యం లేనివాడు సవాల్ విసరకూడదని, సవాల్ స్వీకరించి వచ్చామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాజకీయ సన్యాసం చేస్తానని నాని చేసిన చాలెంజ్‌ను వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. అధికారం లేకుంటే నాని బతుకు కుక్క బతుకేనని మండిపడ్డారు.

పోలీసుల తీరుపై ఆగ్రహావేశాలు

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దాడులకు తెగబడినా ప్రేక్షకుల్లా చూసిన పోలీసులు నేడు తమపై లాఠీలు ఝుళిపించడం ఏమిటని టీడీపీ కార్యకర్తలు ప్రశ్నించారు. వైసీపీ హయాంలో టీడీపీ నేత పట్టాభి ఇంటిపై రెండుసార్లు దాడి చేశారు. ఆయన్ను కర్రలతో కొట్టి గాయపరచడమే కాకుండా ఆయన ఇంట్లో బీభత్సం సృష్టించారు. ఆ సమయంలో పోలీసుల నుంచి కనీస స్పందన లేకుండాపోయిందని, ఫిర్యాదు చేసినా చిన్నచిన్న కేసులు పెట్టి వదిలేసిన పోలీసులు ఇప్పుడు తమపై మాత్రం ఓవరాక్షన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిలో నగరానికి చెందిన వైసీపీ కార్పొరేటర్లు, గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జోగరాజు పాల్గొన్నట్టు సాక్ష్యాధారాల సహా అప్పట్లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అప్పుడు కూడా పోలీసుల నుంచి కనీస స్పందన కరువైంది. టీడీపీ సీనియర్ నేత చెన్నుపాటి గాంధీపై దాడి చేసి కన్ను పోగొట్టిన ఘటనలో వల్లూరిపల్లి ఈశ్వర్ ప్రసాద్, గద్దె కల్యాణ్ తదితరులు ఉన్నట్టు సాక్ష్యాలతో సహా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై జనవరి 21న వంశీ అనుచరులు దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రంగబాబు నేటికీ కోలుకోలేదు. ఈ దాడికి సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తూతూమంత్రంగా విచారణ ముగించి చేతులు దులుపుకొన్నారు. వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసులు ఇప్పుడు శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న తమపై మాత్రం లాఠీలు ఝుళిపించడం ఏమిటనేది టీడీపీ నాయకుల ప్రశ్న.







గుడివాడలో ఫ్యాన్‌ను నేలకేసి కొడుతూ.. కొడాలి నాని ఇంటిపైకి కోడిగుడ్లు విసురుతున్న తెలుగు యువత శ్రేణులు.. వంశీ ఇంటి వద్ద పోలీసుల మోహరింపు

నియామకాలతో సరి..!



కేడీసీసీబీ కార్యాలయం

ఐదేళ్లుగా వైసీపీ గుప్పిట్లో కేడీసీసీబీ పాలకవర్గం

* జిల్లాలోని 421 పీఏసీఎస్‌లకు ఎన్నికల్లేవు
* త్రీమెన్ కమిటీలతోనే కాలయాపన
* కూటమి రాకతో ఎన్నికలు నిర్వహించే అవకాశం
* కేడీసీసీబీలో పాగా వేసేందుకు టీడీపీ సిద్ధం

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీబీ) పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించలేదు. జిల్లాలోని 421 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌లుగా వైసీపీకి చెందిన నాయకులనే నియమించారు. సహకార వ్యవస్థపై కనీస అవగాహనలేని వారిని నామినేట్ చేశారు. త్రీమెన్ కమిటీల పేరుతో ఒక చైర్‌పర్సన్, ఇద్దరు డైరెక్టర్లను నియమించడంతో సహకార వ్యవస్థ కుదేలయ్యే పరిస్థితి దాపురించింది. కూటమి అధికారంలోకి రావడంతో కేడీసీసీబీ ఎన్నికలు జరిపి, సహకార వ్యవస్థను గాడిలోపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గత ఐదేళ్లుగా కేడీసీసీబీ పాలకవర్గం ఎన్నికలు నిర్వహించలేదు. 2018, జనవరి 30వ తేదీ నాటికి కేడీసీసీబీ పాలకవర్గ పదవీకాలం పూర్తయింది. ఆరు నెలల పాటు ఈ పాలకవర్గాన్ని పొడిగించారు. ఆ తరువాత ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలనలో కేడీసీసీబీ నడిచింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో కేడీసీసీబీ ఎన్నికలు నిర్వహిస్తారని రైతులంతా ఆశించారు. కానీ, నామినేషన్ పద్ధతిన వైసీపీ ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు పాలకవర్గాలను నియమిస్తూ వచ్చింది. వైసీపీ అధికారంలోకొచ్చాక అప్పట్లో ఆ పార్టీలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావును కేడీసీసీబీ చైర్మన్‌గా నియమించింది. ఏడాదిపాటు ఆయనను ఆ పదవిలో ఉంచి అనంతరం వివిధ కారణాలతో తొలగించారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మళ్లీ ప్రత్యేక అధికారి పాలనలో కేడీసీసీబీ కొనసాగింది. రెండేళ్లపాటు జగ్గయ్యపేటకు చెందిన తన్నీరు నాగేశ్వరరావు చైర్మన్‌గా నామినేషన్ పద్ధతిన పనిచేశారు. ప్రస్తుతం పెనమలూరుకు చెందిన తాతినేని పద్మావతి కేడీసీసీబీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. కేడీసీసీబీ పాలకవర్గంలో డైరెక్టర్లను శాసనసభ్యులు సిఫార్సుల మేరకే నియమిస్తూ వచ్చారు. ఈ ఐదేళ్ల వ్యవధిలో ముగ్గురు చైర్మన్లు మారడం గమనార్హం. సహకార వ్యవస్థలో అత్యంత కీలకమైన కేడీసీసీబీ పాలకవర్గం ఎన్నికలు నిర్వహించకుండా వైసీపీ ప్రభుత్వం కాలం వెళ్లదీసింది. పూర్తికాలం పాటు చైర్మన్, పాలకవర్గం సభ్యులు పనిచేస్తే రైతులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకుండా చేయడం వైసీపీ ప్రభుత్వానికే చెల్లుబాటు అయ్యింది. రూ.10వేల కోట్లకుపైగా టర్నోవర్ కలిగిన కేడీసీసీబీ పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే.

పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగి ఆరేళ్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 421 పీఏసీఎస్‌లు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక పీఏసీఎస్‌లు ఇక్కడే ఉన్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహిస్తే పాలకవర్గంలో 12 మంది డైరెక్టర్లు ఉంటారు. వీరిలో నుంచి ఒకరిని పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. వీరితోపాటు మరో కో-ఆప్షన్ సభ్యుడిని ఎన్నుకుంటారు. ఈ 13 మందితో పీఏసీఎస్‌లలో పరిపాలనా వ్యవహారాలపై సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటారు. రైతులకు ఏయే పంటకాలంలో ఎంతమేర పంటరుణాలు, లాంగ్‌టర్మ్ రుణాలు ఇవ్వాలి? డిపాజిట్ల సేకరణ, అంశాలపై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉండేది. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లపాటు పీఏసీఎస్ ఎన్నికలు నిర్వహించకుండా సాచివేత ధోరణిని అవలంబించింది. 2019, జూలై 31వ తేదీన పీఏసీఎస్‌లకు వైసీపీ నాయకులను త్రీమెన్ కమిటీ పేరుతో పాలకవర్గాలను నియమించింది.

త్రీమెన్ కమిటీలు తీసుకున్నవే నిర్ణయాలు

పీఏసీఎస్‌లకు ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా ఆయా నియోజకవర్గాల్లోని శాసనసభ్యులు సిఫార్సు చేసిన వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే త్రీమెన్ కమిటీలో సభ్యులుగా చోటు దక్కింది. త్రీమెన్ కమిటీలలోని సభ్యులు తీసుకున్న నిర్ణయాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా అభ్యంతరం చెప్పేవారే లేకుండా పోయారు. దీంతో సహకార సంఘాల్లో పాలన గాడి తప్పిందనే చెప్పాలి. గత రెండు, మూడు సంవత్సరాలుగా పీఏసీఎస్‌లలో పీఏసీఎస్ చైర్మన్లు, సిబ్బంది ధాన్యం కొనుగోలులో కమీషన్లు దండుకుని రైతులను తమదైన శైలిలో దోచేశారు. ఇదేమని ప్రశ్నించిన రైతులను ఇబ్బందుల పాలుచేశారు. గూడూరు మండలం ముక్కొల్లు పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించినా అక్కడ పనిచేసే ఉద్యోగి ఒకరు సుమారు రూ.25 లక్షలకుపైగా పక్కదారి పట్టించారు. రుణం చెల్లించినట్లుగా లెక్క చూపకపోవడంతో రైతులు సహకారశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా విచారణ జరగకుండా వైసీపీ నాయకులు తెరవెనుక చక్రం తిప్పారు.

పరారీలో గడ్డం గ్యాంగ్



నానితో గడ్డం గ్యాంగ్(ఫైల్ ఫోటో)



ప్లాట్లకు వెళ్లే దారిలో అక్రమంగా ఏర్పాటు చేసిన గేటు

షెడ్ల తొలగింపు

* ప్లాట్‌లకు విముక్తి
* ఆనందంలో యజమానులు

ఇటీవల జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయంతో గడ్డం గ్యాంగ్ గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి. కౌంటింగ్‌కు రెండు రోజుల ముందే గడ్డం గ్యాంగ్ పెట్టేబేడా సర్దుకుంది. కొడాలి నాని ఘోర ఓటమితో గడ్డం గ్యాంగ్ కనుమరుగైంది. వారు అక్రమించిన షెడ్లను ఖాళీ చేశారు. ఈ షెడ్ల మీదుగా తమ ప్లాట్లకు వెళ్లేవారు ఇప్పుడు ఆనందంగా వెళుతున్నారు.

గుడివాడ : కరోనా సమయంలో మాజీమంత్రి కొడాలి నాని అండతో గడ్డం గ్యాంగ్ చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. దొరికిన చోటల్లా కబ్జాలు చేసి గుడివాడలో భయానక వాతావరణం సృష్టించారు. మండలంలోని వలివర్తిపాడులోని రీసర్వే నెంబరు 180లోని చైతన్యనగర్ హౌసింగ్ సొసైటీలో 66 మంది ప్లాట్లను గడ్డం గ్యాంగ్ ద్వారా నాని కబ్జా చేశారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల కౌంటింగ్ వరకు ఆక్రమిత ప్రాంతంలో నాలుగు పక్కల షెడ్లను ఏర్పాటు చేసుకుని, చుట్టూ గేట్లు పెట్టి కాపలా కాసేవారు. సదరు ప్లాట్లలో పగలు, రాత్రి తేడా లేకుండా షిఫ్టులవారీగా మందు, విందులతో గడ్డం గ్యాంగ్ రచ్చరచ్చ చేసేవారు. ఎవరైనా ప్లాట్లవైపు వస్తే దాడులు చేసేవారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ నేతృత్వంలో గడ్డం గ్యాంగ్‌తో పాటు రౌడీమూక రెచ్చిపోయింది. తన ప్లాట్‌ను చూసుకునేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడి చేసింది. తాము కష్టపడి కొనుక్కున్న ప్లాట్లను కనీసం చూడటానికి కూడా వెళ్లకుండా అరాచకం సృష్టించారని యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

* **పోలీసుల ప్రేక్షకపాత్ర**

గడ్డం గ్యాంగ్ అరాచకాలు సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేసినా గుడివాడ పోలీసులు పట్టించుకోలేదు. ఎన్ని అరాచకాలు, కబ్జాలు, లూటీలు జరిగినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. ఎవరైనా ఫిర్యాదు చేయడానికి వస్తే వారితో ఎందుకు సర్దుకుపోవాలని ఉచిత సలహాలు సైతం ఇచ్చారు. ప్లాట్ల ఆక్రమణ, దాడి విషయంలో తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా దర్యాప్తు ఇంచు కూడా ముందుకు సాగలేదు. కనీసం దాడికి పాల్పడిన వ్యక్తులెవరో కూడా విచారణ చేపట్టలేదు. ఎక్కడి వేసిన గొంగడి అక్కడే మాదిరిగా కేసు నిలిచిపోయింది. ప్లాట్ల యజమానులకు మద్దతుగా టీడీపీ నాయకులు పోరాడారు.

* **టీడీపీ విజయంతో పరార్**

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి, గుడివాడలో టీడీపీ అభ్యర్థి గెలవడంతో గడ్డం గ్యాంగ్ పరారైంది. నాని ఘోర ఓటమితో గడ్డం గ్యాంగ్‌లో భయం మొదలైంది. గుట్టుచప్పుడు కాకుండా షెడ్లను తొలగించారు. సామాన్లు సర్దేశారు. కౌంటింగ్ రోజు నానీతో పాటు ఇద్దరు గడ్డం గ్యాంగ్ సభ్యులు పరారయ్యారు. ఎక్కడ ఉన్నది తెలియలేదు.

ప్లాట్లను స్వాధీనం చేసుకుంటాం

ఇన్నాళ్లూ తమ ప్లాట్లు ఆక్రమణకు గురయ్యాయని, టీడీపీ రాకతో ఆనందంగా ఉందని చైతన్య హౌసింగ్ సొసైటీ సభ్యులు తెలుపుతున్నారు. కష్టించి కొనుక్కున్న స్థలాలను ఆక్రమించారని అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రెవెన్యూ, పోలీసులైతే వారితో ఎందుకు సర్దుకుపోవాలని ఉచిత సలహాలిచ్చారని వారు గుర్తు చేసుకున్నారు.



ఈవీఎం, వీవీ ప్యాట్లను గోదాములో భద్రపరిచి సీలు వేయిస్తున్న ఢిల్లీరావు

ఈవీఎం, వీవీ ప్యాట్లకు పటిష్ట భద్రత

»» ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక, జూన్ 7 : సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో ఉపయోగించిన ఈవీఎం, వీవీప్యాట్లను కట్టుదిట్టమైన భద్రతతో గోదాములో భద్రపరిచినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వెల్లడించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయినందున గొల్లపూడిలోని గోదాములో ఈవీఎం, వీవీ ప్యాట్లను భద్రపరిచి సీల్ వేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎన్నికల సామగ్రిని భద్రపరిచే కలెక్టరేట్‌లోని గోదామును పరిశీలించి దానికి సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచినట్టు తెలిపారు. ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎం, వీవీప్యాట్లను పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గొల్లపూడిలోని గోదాములో భద్రపరిచినట్టు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించిన స్టాట్యుటరీ కవర్స్, ఫారాలు, రిజిస్టర్లు వంటి ఇతర ఎన్నికల సామగ్రిని జిల్లా కలెక్టరేట్‌లోని ప్రత్యేక గోదాములో భద్రపరిచినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల కోడ్ : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేసినట్టు కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం తెలిపారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్చి 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి అమల్లోకి వచ్చిన ప్రవర్తనా నియమావళి జూన్ 4వ తేదీన లెక్కింపు ముగిసిన 48 గంటల వరకు అమల్లో ఉందన్నారు. ఎన్నికలలో వెలువడిన ఫలితాలను బట్టి జిల్లాలో విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నూతనంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయటంతో.. ఎన్నికల ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగియటంతో శుక్రవారం సాయంత్రం నుంచి కోడ్‌ను నిలుపుదల చేసినట్టు తెలిపారు.



ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నూతన నాయకులతో కలెక్టర్ ఢిల్లీరావు

కొత్త ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా..

కృష్ణలంక, జూన్ 7 : నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించి జిల్లాకు మరింత వన్నె తెచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖలో ఖాళీ అయిన పదవులకు కో-ఆప్షన్ పద్ధతిలో ఎన్నిక కాబడిన నగరశాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, సహాధ్యక్షుడు బి.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, కోశాధికారి డీఎస్ఎన్ శ్రీనివాస్‌లు సంఘ నాయకులతో కలిసి శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల నిర్వహించిన సాధారణ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల సహకారం ఎంతో వుందన్నారు. కొత్త ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు ఉద్యోగులు బాధ్యతాయుతమైన సేవలను అందించేందుకు కృషి చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో జిల్లా మాజీ కార్యదర్శి ఎండీ ఇక్బాల్ తదితరులున్నారు.



ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని సత్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ, అధికారులు

అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంతం

»» అధికారుల అభినందన సభలో కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో సార్వత్రిక ఎన్నికలను అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. అధికారులు, సిబ్బంది అభినందన సభ జెడ్పీ కన్వెన్షన్‌హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సహకారంతో జిల్లాలో ఎక్కడా హింసాత్మక ఘటనలు జరగకుండా ఎన్నికలను నిర్వహించామన్నారు. ఎన్నికల విధుల్లో నోడల్ అధికారులు తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో నిబద్ధతతో నిర్వహించారన్నారు. కృష్ణాజిల్లా నుంచి ఎన్నికల సంఘానికి వెళ్లిన నివేదికలు ఇతర జిల్లాల్లోనూ పాటించాలని ఎన్నికలసంఘం సూచన చేయడం గర్వకారణమన్నారు. పోలింగ్ రోజు అక్కడక్కడా స్వల్ప ఘటనలు చోటుచేసుకున్నా ఎస్పీ పరిస్థితులను చక్కదిద్దారని అన్నారు. జిల్లా మీడియా కూడా సమాచారాన్ని ఎప్పటికపుడు ప్రజలకు చేరవేసి ఎన్నికలు సక్రమంగా జరగడానికి తోడ్పాటును అందించిందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి, కలెక్టర్ సహకారం, సూచనలు అందించారన్నారు. అధికారులు, సిబ్బంది అలుపెరుగకుండా పనిచేశారన్నారు. జేసీ గీతాంజలి శర్మ, అధికారులు ఇచ్చిన సూచనలతో ఎన్నికలను సజావుగా నిర్వహించగలిగామని తెలిపారు. ఎస్పీ అద్నాన్‌నయీం అస్మిని కలెక్టర్, జేసీ ఘనంగా సత్కరించారు. కలెక్టర్, జేసీలను అధికారులు సత్కరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్త సీఎస్ నీరబ్‌తో ఉమ్మడి కృష్ణాకు అనుబంధం

»» నీరబ్‌ను కలిసిన కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్ కుమార్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్ర చీఫ్ సెక్రటరీలుగా పనిచేస్తున్న వారిలో ఆదిత్యనాద్ దాస్ తర్వాత ఉమ్మడి కృష్ణాజిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన నీరబ్‌కుమార్ ప్రసాద్ తాజాగా సీఎస్ అయ్యారు. నీరబ్ కుమార్ ప్రసాద్ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1993-95 మధ్య జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన కాలంలో ప్రజల్లో మంచి సౌమ్యుడుగా ఆయన పేరు తెచ్చుకున్నారు. నీరబ్ కుమార్ ప్రసాద్ తర్వాత 1995-1996 మధ్యకాలంలో ఆదిత్యనాద్ దాస్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆదిత్యనాద్ దాస్ ముందుగానే సీఎస్‌గా పనిచేశారు. సీఎస్‌గా నియమితులైన నీరబ్‌కుమార్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌లు సీఎస్ నీరబ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కలిసిన జాస్తి వీరాంజనేయులు



వన్‌టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా పదవీ బాధ్యతలు చేపట్టిన నీరబ్ కుమార్ ప్రసాద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా అఖిలభారత పంచాయితీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో కలిసారు. ఈ సందర్భంగా వీరాజంనేయులు నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



నందిగామలో పలు సెంటర్లలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకాలు

కట్టలు తెంచుకున్న ఆగ్రహావేశాలు!

»» వైసీపీ శిలాఫలకాల ధ్వంసం

»» టీడీపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు.. నందిగామలో ఉద్రిక్తత



స్టేషన్ నుంచి నేతలను బయటకు తీసుకువస్తున్న కార్యకర్తలు

నందిగామ, జూన్ 7 : నందిగామలో పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య వివాదం చెలరేగింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో అధికారం చేపట్టడంతో ఐదేళ్ల ఆవేదనను పార్టీశ్రేణులు ఆగ్రహం రూపంలో వ్యక్తపరుస్తున్నారు. రెండు రోజులుగా పట్టణంలో వైఎస్ఆర్ పేరుతో ఉన్న బోర్డులను తొలగిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని పలు సెంటర్లలో వైఎస్ఆర్ బోర్డులతో పాటు మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ పేర్లతో ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు. రైతుపేటలో శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్యే పేరు తొలగిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, టీడీపీ నాయకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. పట్టణ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ సహా పలువురు టీడీపీ కార్యకర్తలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తంగిరాల సౌమ్య సీఐ హనీష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పోలీసులు స్పందించకపోవడంతో ఆగ్రహించిన టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున స్టేషన్‌ను చుట్టుముట్టారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకొనేందుకు విఫలయత్నం చేశారు. ఆగ్రహంతో పట్టుబడిన టీడీపీ నాయకులను బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. ఈఘటన పట్టణంలో సంచలనంగా మారింది.

పోలీసుల తీరుపై సౌమ్య ఆగ్రహం

నందిగామలో శిలాఫలకాల ధ్వంసం చేసినప్పుడు వైసీపీ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, జాతీయ నాయకుల విగ్రహాలను అవమానించినపుడు నోరు మెదపని పోలీసులు ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఇదిలా ఉంటే జరిగిన ఘటనపై స్పెషల్ ఏసీపీ రాయ్, సీఐ హనీష్‌లు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే అరెస్టు చేశామని, స్టేషన్ నుంచి అదుపులో ఉన్న వ్యక్తులను బలవంతంగా తీసుకువెళ్లడం సరికాదని సీఐ హనీష్ చెబుతున్నారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాధ్యతగా పనిచేస్తాం..

»» చంద్రబాబుతో కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జూన్ 7 : బాధ్యతగా పనిచేస్తామని, జాతీయ స్థాయిలో ఏపీ రాష్ట్ర కీర్తిప్రతిష్టలను పెంచుతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఎన్డీఏ సమావేశానికి హాజరైన టీడీపీ ఎంపీలతో చంద్రబాబునాయుడు మాట్లాడారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎంపీలందరు సమష్టి కృషితో కలిసికట్టుగా పనిచేస్తామన్నారు.

మాతృభాషలో పాఠశాల విద్య కొనసాగాలి

»» మండలికి తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు వినతి



అవనిగడ్డ, జూన్ 7 : విద్యాహక్కు చట్టం ప్రకారం మాతృభాషలోనే పాఠశాల విద్య కొనసాగేలా కృషిచేయాలని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసీనాథం నాయుడు ఎమ్మెల్యేగా ఎన్నికైన బుద్ధప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం బుద్ధప్రసాద్‌ను కలిసి తులసీనాథం నాయుడు చిత్తూరు జిల్లా పలమనేరును నుంచి సతీసమేతంగా విచ్చేసి బుద్ధప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

ముస్తాబాద-గన్నవరం మధ్య

పలు రైళ్ల డైవర్షన్

రైల్వేస్టేషన్, జూన్ 7 : ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్‌లోని ముస్తాబాద, గన్నవరం మధ్య పలు రైళ్లను డైవర్షన్ చేసినట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 18, 20 తేదీల్లో సికింద్రాబాద్-షాలీమార్, ఎస్ఎంవీటీ బెంగుళూరు-గౌహతి రైళ్లను విజయవాడ, గుడివాడ, నిడదవోలు మీదుగా మళ్లిస్తారు. ఇదే రూట్‌లో ఈ నెల 7, 8, 10, 11, 14, 15, 17, 18, 21, 22, 24, 25, 28, 29 తేదీలలో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్-భువనేశ్వర్ రైలును మళ్లిస్తారు. 10, 11, 17, 18, 24, 25 తేదీలలో సోమవారం, మంగళవారం నడిచే ఎర్నాకుళం - పాట్నాల మధ్య నడిచే రైలును, బుధ, గురు, శుక్రవారాల్లో నడిచే ఎస్ఎంవీటీ బెంగుళూరు-గౌహతి రైలును ఈ నెల 7, 14, 21, 28 తేదీలలో, శనివారం నడిచే భావనగర్-కాకినాడ పోర్ట్ రైలును ఈ నెల 8, 15, 22, 29 తేదీలలో, లింగంపల్లి-విశాఖపట్నం మధ్య ప్రతిరోజూ నడిచే రైలును 8, 9, 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30 తేదీల్లో మళ్లిస్తారు. ప్రస్తుతం ఈ రైళ్లన్ని విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు మీదుగా నడుస్తున్నాయి. దారీ మళ్లించడంతో వీటిని విజయవాడ-గుడివాడ-నిడదవోలు మీదుగా మళ్లిస్తారు. లింగంపల్లి-విశాఖపట్నం రైలు నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెంలలో రైలుకు స్టాపింగ్ ఉందని తెలిపారు.

ఉద్యోగులను ఆదుకోవాలి

»» టీడీ జనార్దన్‌ను కలిసిన పీఏసీఎస్ ఉద్యోగ సంఘ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 7 : సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీవో నెం. 36ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఏపీ పీఏసీఎస్ ఉద్యోగ సంఘ నేతలు ఆప్కాబ్ మాజీ చైర్మన్ తొండెపు దశరథ జనార్ధ



న్‌ను కోరారు. టీడీపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా మంగళగిరిలో ఆప్కాబ్ మాజీ చైర్మన్‌ను శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన టీడీ జనార్ధన్ ప్రభుత్వం, మంత్రిత్వ శాఖలు ఏర్పడిన తరువాత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ రవికుమార్, ఏపీ పీఏసీఎస్ ఉద్యోగ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం, జిల్లా కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు, రాజా, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అధినేతను కలిసిన నెట్టెం, తాతయ్య



జగ్గయ్యపేట, జూన్ 7 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు వేర్వేరుగా ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో పార్టీకి ఘన విజయం అందించినందుకు నెట్టెంను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను నెట్టెం రఘురాం, రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సమితి అధ్యక్షురాలు ఆచంట సునీతలు వేర్వేరుగా కలిసి అభినందించారు.



కొల్లు రవీంద్రను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘ నేతలు, క్రాఫ్ట్ టీచర్లు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

»» కొల్లు రవీంద్రకు ఉద్యోగ సంఘాల వినతి

మచిలీపట్నం టౌన్, జూన్ 7 : సీపీఎస్ రద్దుచేసి పాత పద్ధతిలో పెన్షన్ ఇవ్వాలని ఎమ్మెల్యేగా గెలిచిన కొల్లు రవీంద్రకు శుక్రవారం సీపీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు సత్యనారాయణ, శోభన్‌బాబు తదితరులు వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం, క్రాఫ్ట్ ఉద్యోగుల సంఘం నేతలు విజయశ్రీ, నాగమణి తదితరులు రవీంద్రను సత్కరించారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నాగమణి కోరారు. కాగా రవీంద్రను మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో పాటు పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ నాయకులు నగేష్, పాత్రికేయులు అభినందించారు. హెల్పింగ్ స్పాట్ సంస్థ ఫౌండర్ వెంట్రప్రగడ భార్గవ్, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు రవీంద్రను కలిశారు.

దీక్ష విరమించిన టీడీపీ కార్యకర్త



కార్యకర్త దీక్షను విరమింపజేస్తున్న శావల దేవదత్

తిరువూరు, జూన్ 7 : 2019లో టీడీపీ ఓటమి చెందడంతో తీవ్రమనస్తాపానికి గురై.. చంద్రబాబు సీఎం అయ్యేవరకు పాదరక్షలు ధరించనని ఓ కార్యకర్త దీక్ష బూనాడు. ఈ ఎన్నికల్లో కూటమి ఘనవిజయంతో కార్యకర్త దీక్షను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి శావల దేవదత్ శుక్రవారం విరమింప జేశారు. ఎ.కొండూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గాడిచర్ల మారేష్, చీరాల సెంటర్‌లోని రైతు బజార్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. 2019లో టీడీపీ ఓటమి చెందడంతో తీవ్రమనస్తాపానికి గురైయ్యాడు. తిరుమలలో శ్రీవారి సమక్షంలో తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేవరకు పాదరక్షలు ధరించనని దీక్ష బూనాడు. ఐదేళ్లుగా పాదరక్షలు లేకుండా తిరిగాడు. టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో శావల దేవదత్ రైతుబజార్‌కు వెళ్లి మారేష్ దంపతులను సత్కరించి పాదరక్షలు అందించి దీక్ష విరమింప జేశారు.

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్

అక్రమాలపై విచారణ చేపట్టాలి

»» ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ డిమాండ్

వన్‌టౌన్, జూన్ 7 : ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడలోని ట్రైబల్ ప్రజాసమాఖ్య కార్యక్రమంలో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్పలు మాట్లాడారు. రాష్ట్రంలోని కొన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రైవేట్ యూనివర్శిటీలుగా మార్చి కోట్లాది రూపాయలను హేమచంద్రారెడ్డి అక్రమ మార్గంలో తీసుకోవడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్షలు రాస్తే పరీక్ష ఫలితాలను విడుదల చేయ



మాట్లాడుతున్న ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్

కుండా విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్లి కళాశాలలో చేరే విధంగా పక్క ప్రణాళిక తీసుకున్నారని విమర్శించారు. ప్రైవేట్ కళాశాలల నుంచి లక్షలాది రూపాయలు కమీషన్‌లుగా తీసుకుని నాక్(ఎన్ఏసీ) పర్యటనల పేరుతో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు స్టార్ హోటల్‌లో బస చేస్తూ ఉన్నత విద్యామండలి నిధులను పెద్ద స్థాయిలో ఖర్చుచేశారన్నారు. ఉన్నత విద్యామండలిలో వారు వైసీపీ కార్యకర్తలను, ఉద్యోగులను నియమించుకోవడం సిగ్గుచేటన్నారు. గత ఐదేళ్ళ కాలంలో యూనివర్శిటీ ఉపకులపతులుగా వరకట్న వేధింపులు, గృహహింస కేసులు, అవినీతి ఆరోపణలున్న వారిని తమకు అనుకులంగా నియమించుకున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్ళ కాలంలో దాదాపుగా 150 కోట్ల మేర అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, ఇతర అధికారుల మీద చట్టపరమైన విచారణ చేపట్టి క్రిమినల్ కేసులను నమోదు చేసి ఉన్నతవిద్యామండలిని కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రామ్‌రాజ్, వెంకటేష్, దివాకర్, ఈశ్వరయ్య, రఘునాథ్ నాయక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇది చారిత్రక విజయం

»» మండలికి బుద్దా వెంకన్న శుభాకాంక్షలు

అవనిగడ్డ, జూన్ 7 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి సాధించిన విజయం చారిత్రకమైనదని మాజీ



ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిలు అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించిన బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి ఆమడ దూరంలోకి వెళ్లిందని, నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలని ప్రజలు ఆయనకు రికార్డు మెజార్టీ ఇచ్చారని అన్నారు. బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

జగన్‌కు సరైన బుద్ధి చెప్పారు

»» దేవినేని ఉమా

గొల్లపూడి, జూన్ 7 : వైనాట్ 175 అన్న జగన్మోహన్ రెడ్డికి ప్రజలు బ్రహ్మాండమైన తీర్పుతో బుద్ధి చెప్పారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరమికొట్టారన్నారు. 151లో మధ్యలో ఉన్న 5 తీసేసి 11 సీట్లకే వైసీపీని పరిమితం చేశారంటే ప్రజల్లో జగన్మోహన్ రెడ్డిపై ఎంత కసి ఉందో అర్థమవుతుందన్నారు. పవన్ కల్యాణ్ కష్టకాలంలో సపోర్టుగా నిలవడం అందరి సహకారంతో కూటమి బ్రహ్మాండమైన మెజార్టీ సాధించి గెలిచిందన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు.

చిన్నారి పెద్ద మనస్సు

»» సహ విద్యార్థి వైద్యానికి రూ.1.16లక్షల సేకరణ



విద్యార్థి తండ్రితో కలపాల జస్విక

గన్నవరం, జూన్ 7 : ఆ చిన్నారి వయస్సు పదేళ్లు.. గన్నవరం సెయింట్ జాన్స్‌లో మూడో తరగతి చదువుతోంది. తనతోటి విద్యార్థి ఈశ్వర్ సాయితేజేష్ అనారోగ్యంతో విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే వైద్యానికి లక్షల్లో విద్యార్థి తల్లిదండ్రులు ఖర్చు చేశారు. ఇంకా రూ.12లక్షల వరకు అవసరమని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి కలపాల జస్విక తన తండ్రి సహకారంతో బంధువులు, తెలిసిన వారు, పరిచయస్తులను సాయం కోరింది. ఒక్కరోజులోనే చిన్నారి రూ.1.16 లక్షలు సేకరించి ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న ఈశ్వర్ సాయి తేజేష్ తల్లిదండ్రులను శుక్రవారం కలిసి నగదును అందజేసింది. మంచి మనస్సుతో స్నేహితుడికి సాయం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపింది. ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలని ఉపాధ్యాయులు చెప్పిన మాటలు తన మనసులో నాటుకుపోయాయని జస్విక తెలిపింది. జస్వికను ఉపాధ్యాయులు, పెద్దలు అభినందించారు.

జాతీయ ఉపకార వేతనాల పరీక్షా ఫలితాలు విడుదల

వన్‌టౌన్, జూన్ 7 : జాతీయ ఉపకార వేతనాల పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబరు 3వ తేదీన ఈ పరీక్షలు జరిగాయన్నారు. ఫలితాలను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను త్వరలో సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు పంపుతామన్నారు. విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో పొదుపు ఖాతాను ప్రారంభించి తండ్రి లేదా తల్లితో జాయింట్ అక్కౌంట్ ఓపెన్ చేసుకుని విద్యార్థి ఆధార్ నెంబర్‌ను ఖాతాకు అనుసంధానం చేయాలన్నారు. ఎంపికైన విద్యార్థులు జాతీయ విద్యా మంత్రిత్వశాఖ నుంచి స్కాలర్‌షిప్ పోర్టల్ ప్రారంభం అవుతుందన్నారు. ఆ సమయంలో విద్యార్థులు తమ పేరు, తండ్రి పేరు, పుట్టినతేదీ, మెరిట్ లిస్ట్, మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లలో ఏ ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా చూసుకోవాలని కోరారు.



మహిళకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న జయరాం

స్వచ్ఛంద సంస్థలకు సాయమందించేందుకు కృషి

»» ఎన్నారై కోమటి జయరాం

మైలవరం, జూన్ 7 : మహిళలు, యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు పలురంగాల్లో ఉచితంగా శిక్షణఇస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషిచేస్తామని ఎన్నారై కోమటి జయరాం అన్నారు. మోస్ట్ ట్రస్టు, మదర్‌థెరిసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంప్యూటరింగ్, టైలరింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, హాండ్ రైటింగ్, చెస్ శిక్షణ ముగించుకున్న వారికి శుక్రవారం ధ్రువీకరణ పత్రాలను ఆయన అందించి సంస్థ నిర్వహకులను అభినందించారు. కార్యక్రమంలో కోయ సుధ, అప్పసాని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని చక్కదిద్దాలి

»» ఏపీటీఎఫ్

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన విద్యారంగాన్ని కొత్త ప్రభుత్వం చక్కదిద్దాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కోరింది. శుక్రవారం విజయవాడలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వివిధ ప్రతిపాదనలతో 10 తీర్మానాలను ఆమోదించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ.. 'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. వెంటనే కొత్త డీఎస్సీప్రకటించాలి. పీఆర్‌సీని నియమించాలి' అని కోరారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగవరప్రసాదరావు, ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.55

అల్గారిథమ్స్‌పై అవగాహన అవసరం



వన్‌టౌన్: కంప్యూటర్లలో పట్టు సాధించాలంటే అల్గారిథమ్స్‌పై అవగాహన అవసరమని కృష్ణా విశ్వవిద్యాలయం కంప్యూటర్ల విభాగం అచార్యుడు డాక్టర్ ఎం.బాబురెడ్డి అన్నారు. కేబీఎన్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో పటిష్ఠ అల్గారిథమ్స్ డిజైన్‌పై శుక్రవారం అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న ఆయన అల్గారిథమ్స్ కంప్యూటర్ పరిజ్ఞానంలో ముఖ్యమని తెలిపారు.ఈ అంశంపై విద్యార్థులు లోతైన విశ్లేషణ చేయగలిగి పట్టు సాధించాలన్నారు. మార్పులకు అనుగుణంగా వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, విభాగాధిపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయోత్సవ సంబరాలు



గద్దె రామ్మోహన్‌కు కేక్ తినిపిస్తున్న బొప్పన భవకుమార్

పటమట, జూన్ 7 : తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్ హ్యాట్రిక్ విజయాన్ని పురస్కరించుకుని 14వ డివిజన్ టీడీపీ నాయకులు నర్రా కిషోర్, గరికపాటి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పటమట సెంటర్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సంబరాల్లో టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్ కేక్ కట్ చేసి గద్దె రామ్మోహన్‌కు తినిపించారు. టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి ఆనందంతో నృత్యాలు చేశారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి భారీ గజమాలను వేసి నివాళులర్పించారు. పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● తూర్పు ఎమ్మెల్యేగా మూడోసారి హ్యాట్రిక్ సాధించిన గద్దె రామ్మోహన్‌ను శుక్రవారం అశోక్‌నగర్ లోని ఆయన నివాసంలో టీడీపీ నేతలు కళ్లే నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ గుండారపు హరిబాబు, చందన సురేష్‌లు కలసి అభినందనలు తెలియజేశారు. గద్దె సారథ్యంలో తూర్పు సర్వముఖాభివృద్ధి సాధిస్తుందని ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

సీనియర్ పురుషుల టీ 20లో గుంటూరు బోణీ



విజయవాడ స్పోర్ట్స్, జూన్ 7 : మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఏసీఏ సెంట్రల్ జోన్ పురుషుల సీనియర్ టి -20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో గుంటూరు ప్రకాశంపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయంతో బోణి చేసింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 16 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాట్‌పట్టిన ప్రకాశం 166/3 పరుగులను చేశారు. బ్యాటర్స్ సీహెచ్.క్రాంతికుమార్ అర్ధసెంచరీ(58)తో కదం తొక్కగా, మరో బ్యాటర్ లేఖజ్‌రెడ్డి 45 పరుగులను చేశాడు. అనంతరం గుంటూరు 168/4తో జయకేతనం ఎగుర వేసింది. ఎస్కే.రషీద్ 86 పరుగులతో సత్తా చాటాడు.

దుర్గమ్మకు భక్తజన నీరాజనం



వన్‌టౌన్, జూన్ 7: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేసవి సెలవులు ముగియనుండడంతో వివిధ ప్రాంతాలకు యాత్రికుల రద్దీ పెరిగింది. ఈ క్రమంలోనే దుర్గమ్మను వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకుని మొక్కుల తీర్చుకున్నారు. ఆర్జిత సేవలైన నవావరణార్చన, ఖడ్గమాలార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, లక్షకుంకుమార్చన తదితర పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు అన్నప్రసాద స్వీకరణ చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచే అన్నవితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 5వేల మందికి పైగానే భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బియ్యం, బిస్కెట్లు అందజేత

భవానీపురం, జూన్ 7 : భవానీపురం ఐరన్‌యార్డులోని జీవ కారుణ్య సంస్థకు లయన్స్ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో హజరత్తయ్య గుప్తా, ఐ. నాగేశ్వరరావులు కేంద్రం నిర్వాహకులు డాక్టర్ వెంకటేశ్వరరావుకు రెండు పెద్ద బియ్యం బస్తాలు, కుక్కలకు బిస్కెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కె. రామలింగేశ్వరరావు, కోశాధికారి కె.రామకృష్ణ, కొత్తమాసు రామ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

దేవినేని అవినాష్ ఇంటి వద్ద పోలీసు బందోబస్తు

మొగల్రాజపురం, జూన్ 7: తూర్పు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన దేవినేని అవినాష్ ఇంటి వద్ద పోలీసులు ముందు జాగ్రత్తగా భారీగా మొహరించారు. శుక్రవారం ఉదయం గుడివాడలో కొడాలి నాని ఇంటిపై దాడి, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో గన్నవరం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన వల్లభనేని వంశీ ఇంటిపై దాడి నేపథ్యంలో గుణదలలో అవినాష్ ఇంటి వద్ద పోలీసులు ఫెన్సింగ్ వేసి భారీగా మోహరించారు.

ముదిరాజ్ వర్గానికి నామినేటెడ్ పోస్టులివ్వాలి



కేసరి నారాయణకు సత్కారం

విద్యాధరపురం, జూన్ 7: ముదిరాజ్ సామాజిక వర్గానికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చి ప్రాధాన్యత కల్పించాలని అఖిల భారత కోలి ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు కేసరి మహేంద్ర ముదిరాజ్ అన్నారు. శుక్రవారం భవానీపురం హెచ్‌బీకాలనీలోని సంఘ కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు, చట్టసభలలో నామినేటెడ్ పదవులిచ్చి గుర్తించాలని అడుగుతున్నామన్నారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్ మాట్లాడుతూ బీసీడీ నుంచి బీసీఏ గ్రూప్‌కు ముదిరాజ్‌లను మార్చాలని కులవృత్తి కల్పించాలని కోరారు. ముదిరాజ్ మహాసభ కృష్ణాజిల్లా అధ్యక్షుడు తుమ్మా శ్రీనివాసరావు, మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్రన నారాయణ, కార్యదర్శి సాంబశివరావు ముదిరాజ్, రాజు ముదిరాజ్, పరసా శ్రీనివాసరావు, చిన్నారి ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, తోకల రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై
ఖాళీ బిందెలతో మహిళల నిరసన



పటమట, జూన్ 7 : మంచినీటి సమస్యపై శుక్రవారం పటమట సర్కిల్-3 కార్యాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మొగల్రాజపురంలోని 7వ డివిజన్ సున్నపుబట్టీల సెంటర్, దాసరి రమణ నగర్, ఇందిరానగర్, చర్చిరోడ్డు ప్రాంతాల్లో గత రెండు నెలలుగా మంచినీటి సరఫరా లేక ప్రజలు నానా తంటాలు పడుతున్నారని, అధికారులు సమస్య పరిష్కరించక పోవడంతో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యుడు అప్పరబోతు రాము మాట్లాడుతూ కొత్త మోటార్ తీసుకువచ్చి పది రోజులు అయ్యిందని దానిని బిగించడానికి టైం లేదని అధికారులు చెప్పటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి పూసర్ల లక్ష్మణ, మహిళా సమైక్య నాయకురాలు బి. శాంత, పూసర్ల పాప, కాంతమ్మ, సింహాచలం, కుమారి, విజయకుమారి, కోటేశ్వరమ్మ, భవానీ పాల్గొన్నారు.

భవానీపురం శివాలయం సెంటర్‌లో
వైఎస్ విగ్రహాన్ని తొలగించాలని ఆందోళన



విద్యాధరపురం, జూన్ 7: భవానీపురం శివాలయం సెంటర్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం ఆందోళన జరిగింది. సెంటర్ మధ్యలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని తొలగించడానికి కూటమి నాయకులు, కార్యకర్తలు క్రేన్ సహాయంతో వెళ్లారు. విషయం తెలుసుకున్న వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, భవానీపురం సీఐ ప్రసాద్, మరికొందరు అధికారులు విగ్రహం వద్దకు వెళ్లి ఆందోళన చేస్తున్న వారికి సర్ది చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. అయితే ఓ కార్యకర్త క్రేన్ సహాయంతో పైకెక్కి వైఎస్ విగ్రహం మెడలో టీడీపీ కండువా వేసి పార్టీ జెండాను గాలిలో ఊపుతూ టీడీపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశాడు.

వెలంపల్లి ఫౌండేషన్ నేమ్ బోర్డుకు నలుపురంగు



వన్‌టౌన్, జూన్ 7: దుర్గాఘాట్‌లో పిత్రు కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా పశ్చిమ మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తన సొంత ట్రస్ట్ వెలంపల్లి ఫౌండేషన్ నిధులు వెచ్చించి గతంలో షెడ్డు ఏర్పాటు చేశారు. తాజాగా వెలంపల్లి సెంట్రల్ నుంచి ఓటమి పాలయ్యారు. గతంలో వెలంపలి చంద్రబాబును, లోకేష్‌ను, పవన్‌కల్యాణ్‌ను ఇష్టానుసారంగా విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డుపై ఉన్న వెలంపల్లి ఫౌండేషన్ నేమ్ బోర్డుకు నలుపు రంగు పూశారు.

వైఎస్ విగ్రహం విరగ్గొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
పోలీసుల అదుపులో 8మంది

భవానీపురం 42వ డివిజన్ పరిధిలో ఉన్న పార్కులో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం తలభాగాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టారు. వారు హడావుడిగా పరారవుతు ఒక కారును అక్కడే వదిలేసి వెళిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న భవానీపురం పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకుని పైస్థాయి అధికారులకు సమాచారమిచ్చారు. పోలీస్ అధికారులు ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తుగా వైఎస్ విగ్రహానికి మళ్లీ తెలుపు రంగు వస్త్రం చుట్టినట్లు తెలిసింది. పోలీసులు ఈ సంఘటనకు పాల్పడిన సుమారు 8 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్నవారిపై పలు కేసులు ఉన్నట్లు సమాచారం.

యువత- అభివృద్ధిపై సమావేశం



సమావేశంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కృష్ణవేణి, శోభారాణి

వన్‌టౌన్, జూన్ 7: దిశ దశ లేని యువత నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యల వైపునకు మళ్లుతున్నట్లు ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు పద్మాకమలాకర్ అన్నారు. శుక్రవారం విజయవాడలో యువత- అభివృద్ధి అంశంపై సమావేశం నిర్వహించారు. సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ఆర్ హరికుమార్, డాక్టర్ వీజే క్యార్లిన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు షహినా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. వీరభద్రం, సీనియర్ అడ్వొకేట్ జి. కృష్ణవేణి, బిజినెస్ ఉమెన్ శోభారాణి, అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సభ్యులు సైక్రియాట్రిస్ట్ జి మహేంద్ర కుమార్, సీహెచ్ గోపాలకృష్ణ, బిల్డర్ జేటీ విద్యాసాగర్, జోన్ ఛైర్మన్ బి. వినయ్ పాల్గొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన కూటమికి శుభకాంక్షలు తెలిపారు.

వ్యాన్ డ్రైవర్ ఆత్మహత్య

వన్‌టౌన్, జూన్ 7: మనస్పర్థలతో వ్యాన్ డ్రైవర్ కలకట్ల వెంకటేశ్వరరావు (32) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం తెనాలికి చెందిన కలకట్ల వెంకటేశ్వరరావుకు నాలుగేళ్ల క్రితం విజయవాడ రాణిగారితోటకు చెందిన పాల్వాయి దీవెనతో వివాహమైంది. ఇతను రాజీవ్‌గాంధీ పార్కులోని ఓ షాపులో కూరగాయల వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య బీసెంట్ రోడ్డులోని ఓ వస్త్రదుకాణంలో పనిచేస్తుంది. వీరికి సంతానం లేకపోవడంతో అప్పుడప్పుడు గొడవలవుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు వెంకటేశ్వరరావు తాను ఉంటున్న రేకుల షెడ్డులో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు. భార్య వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు సమాచారం తెలిపింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి కే.పద్మ ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పిల్లలు పుట్టడంలేదని బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు.

చంద్రబాబుకు పీటీడీ బీసీ ఎంప్లాయీస్ సంఘం అభినందనలు

వన్‌టౌన్, జూన్ 7: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న నారా చంద్రబాబునాయుడుకు రాష్ట్ర ప్రజారవాణా సంస్థ బీసీ ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం సంఘం అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న చంద్రబాబునాయుడు దృష్టికి ఆర్టీసీ వీలినం అనంతరం ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీసుకువెళతామని తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



సత్యనారాయణపురం జూన్ 7: సత్యనారాయణపురం చిత్తరంజన్‌శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శారదాకాలేజీ ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్ మాట్లాడుతూ పుస్తక పఠనం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయంలో రూ.50 డిపాజిట్ కడితే ఒక కథల పుస్తకం ఇంటికి తీసుకు వెళ్లి చదువుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విశ్రాంత లెక్చరర్ బి.సావిత్రి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ టి. సుబ్బన్న, కె. కనకదుర్గాదేవి, సోషల్ వర్కర్ అన్నపూర్ణ, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై పొంగుతున్న మల, మూత్రాలు

● మూడు రోజులుగా దుర్వాసనతో భాగయ్య బజార్‌వాసుల వెతలు



పటమట, జూన్ 7 : భాగయ్య బజార్‌లో మల, మూత్రాలు మ్యాన్‌హోల్స్ నుంచి రోడ్ల మీదకు పొంగిపొర్లడంతో దుర్వాసనతో స్థానికులు నరకయాతన పడుతున్నారు. బందరు రోడ్డు బెంజిసర్కిల్ నుంచి పటమటవైపు సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనుల చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి విజయ్ సేల్స్ డిజిటల్ షాప్ వద్దకు చేరుకున్నాయి. ప్రొక్లెయినర్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల కోసం లోతుగా తవ్వడంతో వర్షపునీరు చేరి డ్రెయినేజీ సరిగా పారుదల లేక భాగయ్య బజారులోని పలు ఇళ్లల్లో సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి మల,మూత్రాలు ఇళ్లల్లోకి ఎగదన్నటంతో ప్రజలు మూడు రోజుల నుంచి దుర్గంధంతో పలుబాధలు పడుతున్నారు. మల, మూత్రాలు మ్యాన్‌హోల్స్ నుంచి రోడ్ల మీద సైతం పొంగిపొర్లుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా భాగయ్యబజార్ వాసులు కోరుతున్నారు.



ఇళ్లలో పొంగిపొర్లుతున్న మల,మూత్రాలు

సుజనా చౌదరికి మంత్రి పదవి రావాలని పూజలు



కేక్ తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

విద్యాధరపురం, జూన్ 7: పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరికి మంత్రి పదవి రావాలని బీజేపీ నాయకులు శుక్రవారం దుర్గమ్మను వేడుకున్నారు. దుర్గగుడి కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఈ మేరకు నాయకులు మొక్కుకున్నారు. ఇదే సందర్భంలో బీజేపీ నాయకుడు బుద్దా దివాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, పైలా సోమినాయుడు, భోగవల్లి శ్రీధర్, దాడి అప్పారావు, పైలా సురేష్‌బాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

హృద్యంగా భక్తమార్కండేయ హరికథాగానం

వన్‌టౌన్. జూన్ 7: దుర్గగుడి ధర్మపథం వేదికపై శుక్రవారం హరికథకుడు కట్టా జేజి నారాయణ భక్తమార్కండేయను గానం చేశారు. భక్తమార్కండేయ వృత్తాంతాన్ని హృద్యంగా వినిపించారు. మృదంగంపై పొడుగు ప్రభాకర్ సహకరించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

పాయకాపురం, జూన్ 7 : విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా ముందుకు రావాలని ప్రముఖులు పెనుమత్స అప్పలరాజు అన్నారు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ ఇంగ్లీషు మీడియం స్కూలులో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం పెనుమత్స అప్పలరాజు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్కూలు ప్రిన్సిపల్ మాధవి లతా ఆధ్వర్యంలో కరాటే శిక్షకులు బల్లం కిషోర్ శిక్షణ ఇచ్చారు. కరాటే ఎగ్జామినర్ ముత్యాల కన్నా, బాపిరాజు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

భారతీనగర్, జూన్ 7: నాల్గవ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సమక్షంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు వినతి పత్రం అందజేశారు. డివిజన్‌కు సంబంధించి వరలక్ష్మినగర్ కాలనీ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు, శ్రీనగర్ కాలనీలోని వివేకానంద రోడ్డు, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని వేములపల్లి పరమేశ్వరరావు రోడ్డు , భారతీనగర్ కాలనీ 6వ రోడ్డులను సిమెంట్ రోడ్డుగా నిర్మించాలని వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

లయోలలో అంతర్జాతీయ సదస్సు



భారతీనగర్, జూన్ 7: ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్, టిలితా యూనిస్ యునాతి(టియుయు) సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు శుక్రవారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి అమెరికాకు చెందిన ఫాదర్ జేసెన్, అల్‌ప్రెండ్రా, షియన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ, డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి విద్యార్థులకు పలు విషయాలను తెలియజేశారు. ఎంబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ నాగలక్ష్మి, అధ్యాపకులు విజయకుమార్, లలిత మాధవి, రజిత బేగం, ఇకళావతి పాల్గొన్నారు.

దిక్సూచి
DIKSUCHI

సిడాక్‌లో పీజీ డిప్లొమాలు

పుణెలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సిడాక్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా(పీజీ డిప్లొమా) ఆగస్టు సెషన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి 24 వారాల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్‌లు. సంస్థ నిర్దేశించిన మేరకు కోర్సులను ఆన్‌లైన్/ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ సెషన్స్, ల్యాబ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటిని సి-డాక్, ఐసీటీ సంస్థలకు చెందిన నిపుణులు నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుంది. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది. హైదరాబాద్ సెంటర్లో మహిళలకు మాత్రమే హాస్టల్ అందుబాటులో ఉంది.

కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (పీజీ-డీఏసీ)
- పీజీ డిప్లొమా ఇన్ బిగ్ డేటా అనలిటిక్స్(పీజీ-డీబీడీఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ (పీజీ-డీఈఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ(పీజీ-డీఐటీఐఎస్ఎస్)
- పీజీ డిప్లొమా ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (పీజీ-డీఏఐ)
- పీజీ డిప్లొమా ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(పీజీ-డీఐఓటీ)
- పీజీ డిప్లొమా ఇన్ వీఎల్ఎస్ఐ డిజైన్(పీజీ-డీవీఎల్ఎస్ఐ)
- పీజీ డిప్లొమా ఇన్ మొబైల్ కంప్యూటింగ్(పీజీ-డీఎంసీ)
- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్(పీజీ-డీఏఎస్ఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ రోబోటిక్స్ అండ్ అలైడ్ టెక్నాలజీస్(పీజీ-డీఆర్ఏటీ)
- పీజీ డిప్లొమా ఇన్ హెచ్‌పీసీ సిస్టం అడ్మినిస్ట్రేషన్(పీజీ-డీహెచ్‌పీసీఎస్ఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఫిన్‌టెక్ అండ్ బ్లాక్ చెయిన్ డెవలప్‌మెంట్(పీజీ-డీఎఫ్‌బీడీ)
- పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్స్(పీజీ-డీసీఎస్ఎఫ్)
- పీజీ డిప్లొమా ఇన్ అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్(పీజీ-డీయూఏఎస్‌పీ)

ట్రెయినింగ్ సెంటర్లు: హైదరాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, ఇండోర్, గువహటి, జైపూర్, కరాడ్, కొచ్చి, కోల్‌కతా, ముంబై, నవీ ముంబై, నాగ్‌పూర్, నాసిక్, న్యూఢిల్లీ, నోయిడా, పట్నా, పుణె, సిల్చార్, తిరువనంతపురం.



సీట్ల వివరాలు: హైదరాబాద్ సెంటర్లో మొత్తం 540 సీట్లు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ 140, బిగ్ డేటా అనలిటిక్స్‌లో 60, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ 120, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ 40, వీఎల్ఎస్ఐ డిజైన్ 40, అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ 80 సీట్లు, అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్ 60 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులను ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు.

- ఇతర సెంటర్లలోని కోర్సులు, సీట్ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

హైదరాబాద్ సెంటర్ కోర్సుల అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఐటీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/టెలి కమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ/ఎంఎస్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సుకు ఎంసీఏ ఉత్తీర్ణులు; అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ కోర్సులకు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)/పీజీ (ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు; ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ కోర్సుకు పీజీ(మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులు; అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్‌కు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/పీజీ డిగ్రీ(ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) / డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)తోపాటు పీజీ(మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ కోర్సుకు మాత్రం 50 శాతం మార్కులు చాలు.

సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ వివరాలు: ఇందులో ఎ, బి, సి అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌కు పరీక్ష సమయం గంట. ప్రతి సెక్షన్‌లో 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో ఉంటాయి. 'ఎ' సెక్షన్‌లో ఇంగ్లీష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, కంప్యూటర్ ఫండమెంటల్స్-ప్రోగ్రామింగ్ అంశాల నుంచి; 'బి' సెక్షన్‌లో సీ-ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, ఆబ్జెక్ట్ ఓరియంటెడ్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్కింగ్, బిగ్ డేటా & ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశాల నుంచి; 'సి' సెక్షన్‌లో కంప్యూటర్ ఆర్కిటెక్చర్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, మైక్రో ప్రాసెసర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సులకు అన్ని సెక్షన్ల పేపర్లు; మిగిలిన కోర్సులకు 'ఎ', 'బి' సెక్షన్ల పేపర్లు రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ పేపర్లకు రూ.1550; 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ + 'సి' సెక్షన్ పేపర్లకు రూ.1750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** జూలై 2 నుంచి 6 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూలై 6, 7
- **పీజీ డిప్లొమా కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.cdac.in

బాసర ఆర్‌జీయూకేటీలో ఇంటిగ్రేటెడ్ బీటెక్

నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ విద్యార్థుల కోసం 85 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పోటీపడవచ్చు. ఇతర రాష్ట్రాల విద్యార్థుల కోసం గ్లోబల్ కేటగిరీ కింద అదనంగా అయిదు శాతం సూపర్ న్యూమరీ సీట్లు; విదేశీ విద్యార్థుల కోసం రెండు శాతం సూపర్ న్యూమరీ సీట్లు నిర్దేశించారు. పదోతరగతిలో సాధించిన మెరిట్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ), రిజర్వేషన్ నిబంధనలు, కౌన్సెలింగ్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలు సహా నాన్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం వెయిటేజీ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి రెండేళ్లు ప్రీ యూనివర్సిటీ కోర్సు ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులు ఉంటాయి. తరవాత నాలుగేళ్లపాటు బీటెక్ కోర్సు ఉంటుంది. ఇందులో కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి. మైనర్ సబ్జెక్టు కింద బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

అర్హత: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్/ఏపీఓఎస్ఎస్/సీబీ ఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. విద్యార్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 18 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను 21 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450; ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1500; గ్లోబల్ కేటగిరీలో మిగిలిన సీట్లకు పోటీ పడే విద్యార్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు
- **చివరి తేదీ:** జూన్ 22
- **వెబ్‌సైట్:** www.rgukt.ac.in

గ్రామీణ బ్యాంకుల్లో ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్స్

వివిధ రీజనల్ రూరల్ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో కింద పేర్కొన్న గ్రూప్-ఎ-ఆఫీసర్ (స్కేల్-1, 2, 3), గ్రూప్ బి-ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది.

గ్రామీణ బ్యాంకులు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విదర్భ కొంకణ్ గ్రామీణ బ్యాంక్.

Institute of Banking Personnel Selection

ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్): **5,585**, ఆఫీసర్ స్కేల్-1: **3499**, ఆఫీసర్ స్కేల్-2(అగ్రికల్చర్ ఆఫీసర్): **70**, ఆఫీసర్ స్కేల్-2(లా): **30**, ఆఫీసర్ స్కేల్-2(సీఏ): **60**, ఆఫీసర్ స్కేల్-2(ఐటీ): **94**, ఆఫీసర్ స్కేల్-2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్): **496**, ఆఫీసర్ స్కేల్-2(మార్కెటింగ్ ఆఫీసర్): **11**, ఆఫీసర్ స్కేల్-2(ట్రెజరీ మేనేజర్): **21**, ఆఫీసర్ స్కేల్-3: **129**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; మిగతా వారందరికీ రూ.850.

పరీక్ష కేంద్రాలు: అనంతపురం, గుంటూరు/విజయవాడ, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూన్ 27 **వెబ్‌సైట్:** www.ibps.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/e5Os0fLలో చదవండి.






టాలీవుడ్ అగ్ర నిర్మాత సి. అశ్వనీదత్ శుక్రవారం విజయవాడలో తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం ఘన విజయం అందుకున్న సందర్భంగా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు. టాలీవుడ్ యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ శుక్రవారం తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. నిఖిల్ మామయ్య, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు నిఖిల్ నటరాజ ప్రతిమను బహూకరించారు.



హిందూపురం ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి గెలుపొందిన నందమూరి బాలకృష్ణను టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు కలసి అభినందనలు తెలిపారు. దర్శకుడు గోపీచంద్ మలినేని, బాబీ, అనిల్ రావిపూడి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ తదితరులు బాలకృష్ణను కలసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



తమ్ముడూ... నిన్ను చూసి గర్విస్తున్నా



తమిళ హీరో, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్ జనసేనాని పవన్ కల్యాణ్‌ను అభినందనల్లో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయాన్ని అందుకున్న సందర్భంగా 'నిన్ను చూసి గర్వపడుతున్నాను తమ్ముడూ అంటూ' పవన్‌పై ప్రశంసలు కురిపించారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పవన్ విజయంపై స్పందించారు. పవన్ కల్యాణ్ మున్ముందు తన రాజకీయ జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఈ ప్రయాణంలో విజయం సాధించాలి, ప్రజల ఆశలు, ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చాలి అని ఆకాంక్షించారు.

మళ్లీ వస్తున్న ఉపేంద్ర 'ఏ'



కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'ఏ' కు ప్రత్యేక స్థానం ఉంది. 26 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఓ కల్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. ఎన్నో రికార్డులు నెలకొల్పింది. త్వరలో ఈచిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఉప్పి క్రియేషన్స్, చందు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై 'ఏ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత లింగం యాదవ్ తెలిపారు. ఈ చిత్రంలో చాందినీ కథానాయికగా నటించారు.

ఇకపై ట్రోల్ చేయకండి

నటుడు ఉపేంద్ర ఆగ్రహం

'నన్ను మేధావి అంటూ ఇకపై ఎవరూ ట్రోల్ చేయకండి' అని ఉపేంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి, అన్నింటా విజయం సాధించింది. దీంతో పవన్ కల్యాణ్‌తో ఉపేంద్రను పోలుస్తూ సోషల్ మీడియాలో పలువురు ట్రోల్ చేస్తున్నారు. ఉపేంద్ర 'ఉత్తమ ప్రజాకీయ పార్టీ'ని ఏర్పాటు చేసి పోటీ చేసినా ఒక్కచోటా గెలవలేకపోయారు. దీంతో ఆయనపై ట్రోల్స్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఉపేంద్ర స్పందించారు. తన గెలుపోటముల గురించి సుదీర్ఘంగా ఆలోచిస్తున్నానని, తాను గెలవాలనుకున్నప్పుడు ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరి విజయం సాధిస్తానని పేర్కొన్నారు. తన రాజకీయ పార్టీ 'ప్రజాకీయ' సిద్ధాంతాలు ప్రజలకు అర్థం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

యుద్ధానికి సిద్ధం!



ప్రభాస్ హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ట్రైలర్ ఈ నెల 10న విడుదల కానుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాలో అశ్వత్థామగా నటిస్తున్న అమితాబ్ బచ్చన్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో నెమావార్‌లోని నర్మదా ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన ఓ మ్యాసివ్ ప్రొజెక్షన్ ద్వారా అమితాబ్ పాత్రను పరిచయం చేశారు. ఇప్పటికీ అశ్వత్థామ నర్మదా మైదానంలో నడుస్తాడనే నమ్మకం ఉండడంతో నర్మాదా ఘాట్‌లో అమితాబ్ లుక్‌ను విడుదల చేయం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధభూమి మధ్యలో నిలబడి ఓ అస్త్రాన్ని పట్టుకుని యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు అమితాబ్ కనిపించారు. ఆయన నుదిటిపై ఉన్న రత్నం మెరుస్తోంది. ఆయన వెనుక ఓ భారీ వాహనం ఉంది, అలాగే ఆయన ముందు కొంతమంది వ్యక్తులు నేలపై పడి ఉన్నారు. ఈ నెల 27న విడుదల కానున్న 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ ముఖ్య పాత్రలు పోషించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/5tAR3Wo
లో చదవండి.

'కిక్కు'.. దించుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలోని నున్న పోలీసులకు సమాచారం అదించారు. వారు స్పందించకపోవడంతో సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం ప్రసాదంపాడు ప్రాంతంలో ఉన్న ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ముందు నుంచి శివకృష్ణ స్నేహితుడితో కలిసి వాహనంలో వెళుతున్నారు. అక్కడ ఆగిఉన్న ఏపీ 39 ఎన్‌క్యూ 6666 నంబరు గల కారులో కొన్ని ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర పత్రాలను ఎక్కిస్తుండటం గమనించారు. తన స్నేహితుడితో కలిసి కొంత దూరం వాహనాన్ని వెంబడించారు. ఆ తర్వాత... ఫైళ్లు తీసుకెళ్లిన వ్యక్తి వాసుదేవ రెడ్డి అని తెలుసుకుని, నున్న పోలీసులకు తెలియజేశారు. వారు పట్టించుకోక పోవడంతో మంగళగిరి సీఐడీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు ఎఫ్ఐఆర్(17/2024) నమోదు చేశారు. ఐపీసీ 427, 397, రెడ్ విత్ 120(బి) కింద కేసు పెట్టారు. దర్యాప్తునకు ముగ్గురు సీఐల నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దించారు.

హైదరాబాద్‌లో సోదాలు...

హైదరాబాద్ నార్సింగిలోని పోలోమీ గేటెడ్ టౌన్‌షిప్‌లో ఉంటున్న వాసుదేవరెడ్డి నివాసానికి సీఐడీ బృందం వెళ్లింది. 12 మంది సభ్యుల బృందం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు జరిపింది. ముఖ్యమైన డాక్యుమెంట్లు, ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. వాసుదేవ రెడ్డిని ప్రశ్నించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. మద్యంషాపుల్లో డిమాండ్ ఉన్న కొన్ని మద్యం కంపెనీలకు ఆర్డర్లు ఎందుకు ఆపేశారు.. పేరుకూడా వినని కొన్ని కంపెనీల మద్యాన్ని భారీ ధరలకు ఎవరి ఆదేశాల మేరకు విక్రయించారని ఆరా తీశారు.

డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి...

తెలంగాణకు చెందిన వాసుదేవ రెడ్డి రైల్వేలో ఐఆర్‌టీఎస్ అధికారి. అనంతపురం జిల్లా గుంతకల్లులో పనిచేస్తూ వైసీపీ నేతలతో సంబంధాలు పెంచుకున్నారు. జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డితో సాన్నిహిత్యం బాగా పెరిగింది. 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆయనకు జగన్ బేవరేజెస్ కార్పొరేషన్ అప్పగించారు. ఎన్నికల సమయంలో వాసుదేవరెడ్డి వైసీపీ నేతలకు పూర్తిస్థాయిలో మద్యం అందుబాటులో ఉంచారు. డిపోల నుంచే ట్రక్కుల్లో రవాణా చేయించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. దీంతో ఆయనను ఈసీ పదవి నుంచి తప్పించింది. వాసుదేవరెడ్డి మామ మారెళ్ల పుల్లారెడ్డి. ఆయన... వైసీపీ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయ భానుకు వియ్యంకుడు. ఆయన స్వగ్రామమైన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వాసుదేవ రెడ్డి అక్రమార్జనలో కొంత భాగం ఇక్కడ భూములపై పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. 2022 సెప్టెంబరులో వాసుదేవరెడ్డి భారీగా భూములు కొన్నట్లు సమాచారం. సుమారు 40 ఎకరాల భూమిని తన మామ నుంచి గిఫ్ట్ డీడ్ రూపంలో పొందారు. ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో సుమారు 25 ఎకరాల భూమిని పుల్లారెడ్డి కొనుగోలు చేశారు. సీఐడీ దీనిపైనా దృష్టి సారించే అవకాశముంది.

మద్యం స్కాం రూ.5వేల కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం మద్యం అమ్మకాల్లో భారీ కుంభకోణానికి పాల్పడింది. ప్రజల కోసం ప్రభుత్వ మద్యం షాపులు అని చెప్పి.. వాటి ద్వారా రూ.5వేల కోట్లు దోచేసింది. అది కాడా లిక్కర్ కంపెనీల నుంచి కాదు. కమీషన్లు ఇవ్వడం కోసం అంటూ అటు కంపెనీలకు రేట్లు పెంచి, ఆ పెంచిన మొత్తాన్ని ఇటు వైసీపీ నేతలు తమ ఖాతాల్లో వేసుకున్నారు. అంటే ప్రజాధనాన్ని ఆ చేత్తో కంపెనీలకు ఇచ్చి.. ఈ చేత్తో జగన్ తన జేబులో వేసుకున్నారని అంచనా. అలా పోగేసిన రూ.5వేల కోట్లు హైదరాబాద్‌లో దాచిపెట్టి, తాజా ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి. మిగిలిన మొత్తం బెంగళూరుకు తరలించారని తెలుస్తోంది. బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి ఇంట్లో శుక్రవారం జరిగిన సోదాల్లో దీనిపై మరింత కీలక సమాచారం బయటపడినట్టు సమాచారం. తెలుగుదేశం ప్రభుత్వంలో మద్యం షాపులు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో ఉండేవి. ఏ బ్రాండ్లు అమ్మాలనేది అప్పట్లో వారిష్టం. జగన్ దీనిని మార్చేశారు. ప్రభుత్వ మద్యం షాపుల విధానం ప్రారంభించారు. షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలో సర్కారు పెద్దలే నిర్ణయించారు. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని కంపెనీలకు ప్రతిపాదించారు. అలా ఇచ్చిన కంపెనీల మద్యమే కొన్నారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను అనధికారికంగా 'స్వాధీనం' చేసుకుని.. రకరకాల పేర్లతో సొంత బ్రాండ్లను ప్రవేశ పెట్టారు. వాటినే మద్యం దుకాణాల్లో విక్రయించారు. అంటే.. ఒకవైపు కమీషన్లు, మరోవైపు సొంతంగా మద్యం తయారు చేసి, బేవరేజెస్ కార్పొరేషన్‌తో కొనుగోలు చేయించి, ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించడం! ఇలా అన్ని రకాలుగా ఆదాయమే! ఈ ఐదేళ్లలో 14.38కోట్ల కేసుల లిక్కర్, 5.83కోట్ల కేసుల బీరు రాష్ట్రంలో అమ్ముడైంది. ఇందులో లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, మళ్లీ తిరిగి వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలును హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కేసుల చొప్పున కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300 కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి సీజ్ కావడంతో బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్ర బిందువు. తర్వాత అనేక మంది అందులోకి వచ్చారు.

ఎవరి పాత్ర ఏంటి?

ఈ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో అనేక మంది పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చే బాధ్యతను చివరివరకూ ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డికి అప్పగించారు. ఆయన చెప్పిన కంపెనీలకు మాత్రమే ఆర్డర్లు వెళ్లాయి. మాకెందుకు ఇవ్వరని ప్రశ్నించిన కంపెనీలకూ కొన్నిసార్లు ఆర్డర్లు ఇచ్చారు. కానీ ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, ఎవరూ కొనట్లేదని తిప్పి పంపారు. ఇక ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలి అనేది ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్ చూసుకున్నారు. దీనికి సంబంధించిన చార్టు 'తాడేపల్లి' పెద్దల నుంచి అందేది. కంపెనీలకు బకాయిల విడుదల అంశాన్ని రిటైర్డ్ కార్పొరేషన్ అధికారి వేణుగోపాల్ చూశారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ విడుదల చేశారు. 90 రోజులుగా స్టాకు అమ్ముడుపోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా గ్రౌండింగ్ చార్జీలను రిటైర్డ్ కార్పొరేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి తీసుకున్నారు. తొలుత ఎడాపెడా గ్రౌండింగ్ చార్జీలు విధించేవారు. తర్వాత వాటి అసలు లెక్కలు అంచనావేసి అందులో అసలు చార్జి పోను మిగిలింది తిరిగి కంపెనీలకు ఇచ్చేందుకు 20శాతం కమీషన్ వసూలుచేశారు. అటు కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా రూ.5వేల కోట్లకు పైగానే ప్రజాధనాన్ని దోపిడీ చేశారు. మార్కెట్ ఆధారంగా మద్యం కంపెనీలు కొత్త కొత్త పేర్లతో బ్రాండ్లు విడుదల చేస్తుంటాయి. తయారీ, సరఫరా ఇతరత్రా కారణాల దృష్ట్యా ప్రతి కంపెనీ ఎక్కువ పేర్లతో బ్రాండ్లు అమ్ముతుంది. అంటే ఒకే బ్రాండ్‌కు చివర్లో డీలక్స్, ప్రీమియం, స్ట్రాంగ్, లైట్ ఇలా వేర్వేరు పేర్లతో బ్రాండ్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటుంది. ఇలా ఏదైనా కొత్త రిజిస్ట్రేషన్ చేసుకుంటే దానికి ఎక్సైజ్ శాఖ లేబుల్ ఇవ్వాలి. దానికి కార్పొరేషన్‌లో రూ.50లక్షలు చొప్పున వసూలు చేశారు. ప్రతి ఏటా రెన్యువల్‌కు ఒక్కో లేబుల్‌కు రూ.5లక్షలు తీసుకున్నారు.

కర్బూజాతో లస్సీ... తాండ్ర

'మధుర దధీని మద్యే శర్కరాం సన్నియోజ్య శుభ విదలిత ఖండం ప్రక్షిపేత్ ఖర్బూజేయమ్!

కరవిలులితమానైర్వాసితం చాతిగం ధైర్ఘిగమిషు జఠరాగ్నిం స్థాపయత్యేవ నూనమ్!

'ఖర' అంటే గరుకుగా ఉండేదని. 'కొందరి మాట కరకు. మనసు వెన్న' అంటామే... అలాంటిదే ఈ కర్బూజా పండు కూడా. పైన తోలు మాత్రమే గరుకు. లోపలంతా తియ్యని, మెత్తని గుజ్జు. ఒకప్పుడు ఇది వేసవి ఫలం. ఇప్పుడు అన్ని వేళలా మార్కెట్లో దొరుకుతోంది. అన్ని పోషకాలూ ఉన్న చలవనిచ్చే పండు ఇది. మనది ఉష్ణ మండలం కాబట్టి, దీన్ని తినేందుకు అన్ని కాలాలు, అన్ని ఋతువులూ అనుకూలమైనవే. వేడినీ, ఎండనీ తట్టుకునే శక్తి శరీరానికి ఇస్తుంది. ఆలస్యంగా అరిగి, వెంటనే షుగర్ రక్తంలో పెరగకుండా చేస్తుంది.



చర్మానికి మంచిది...

సమాన గుణ ధర్మాలున్న ద్రవ్యాలు సమాన గుణ ధర్మాలపైన పని చేస్తాయని ఓ సూత్రం ఉంది. మెదడు ఆకారంలో ఉండే వాల్నట్స్ మెదడుని సుసంపన్నం చేసినట్టే, గరుకైన తోలు కలిగిన కర్బూజా గరుకుబారిన చర్మాన్ని మృదువు పరుస్తుంది ఎగ్జిమా, సొరియాసిస్, కాలిన పుండ్లు, గాయాలకు ఇది మంచి ఔషధం. చంటి పిల్లలకు పెట్టదగినది. గుండెను, మూత్రాశయ వ్యవస్థను బల పరుస్తుంది. బీపీ, కీళ్లవాతాన్ని తగ్గిస్తుంది. మూత్రం అధికంగా అయ్యేలా చేసి శరీరానికి నీరు పట్టడాన్ని తగ్గిస్తుంది. కేన్సర్‌వల్ల, దాని చికిత్సలవల్ల కలిగే ఉపద్రవాలను తగ్గించి శరీరానికి ఉపశమనాన్నిస్తుంది. శక్తినిస్తుంది.

స్థూలకాయానికి ఔషధం...

ఆధునిక వైద్య శాస్త్రం కర్బూజా పండు లోపలి గుజ్జు గురించి చెప్పింది. దీన్ని తింటే విష దోషాలు హరిస్తాయి, కొవ్వు, వాపులు, నొప్పులు తగ్గుతాయని, థైరాయిడ్ అదుపులోకి వస్తుందని పేర్కొంది. కడుపులో నులిపురుగులు బయటకు పోతాయని, జీవ కణాలు నశించిపోకుండా సంరక్షిస్తుందని తెలిపింది. నెలసరి సమయంలో, మెనోపాజ్ వలన అధిక రక్త స్రావం అవుతున్నప్పుడు స్త్రీలు కర్బూజాని తప్పనిసరిగా తీసుకోవాలనేది చెప్పదగిన సూచన. ఇది ముఖ్యంగా ఎ, సి విటమిన్లు కలిగి ఉంటుంది. తొమ్మిది శాతం మాత్రమే కార్బోహైడ్రేట్లున్నాయి. అందుకని షుగరు రోగులు తీసుకోవచ్చు. దీంట్లో బీటా కెరోటిన్స్.. కేరెట్‌తో సమానంగా ఉంటాయి. షుగరు, స్థూలకాయం ఉన్నవారు తినదగిన పండ్లలో కర్బూజా మొదటిదని చెప్పవచ్చు.

కర్బూజా లస్సీ ఇలా...

తియ్యని గడ్డ పెరుగును శుభ్రమైన తెల్లని వస్త్రంలో వేసి నీటిని వడగట్టేయండి. కర్బూజా లోపల దూదిలా ఉండే భాగాన్ని, గింజల్ని తొలగించి, గట్టిగా ఉండే గుజ్జుని చిన్నచిన్న ముక్కలుగా తరగండి. ఈ ముక్కల మీద పంచదార చల్లి, వడగట్టిన పెరుగును కూడా వేసి గరిటెతో కలపండి. దీనిమీద లెమన్ గ్రాస్ లాంటి పరిమళాలను కలిపితే రుచి, కమ్మదనం అధికంగా ఉంటాయి. పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. ఇది జీర్ణశక్తిని బలసంపన్నం చేస్తుందన్నాడు క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో. దీన్ని జీర్ణశక్తి పైన పని చేయించటం కోసం కొద్దిగా మిరియాల పొడి, చిటికెడంత పచ్చకర్పూరం, అర చెంచాడు అల్లం ముద్ద కూడా చేర్చటం ఉత్తమం. కఫాన్ని, వేడినీ, వాతాన్నీ తగ్గించటంలో ఈ కర్బూజా లస్సీ తిరుగులేనిది. మూత్రం బాగా అయ్యేలా చేసి వేడిని అదుపు చేస్తుంది.

తాండ్ర ఇలా...

సఖండం ఖర్బూజం ఖండం చంద్రార్ధకవి మండితమ్!

పక్వామ్ర రస సంయుక్త మత్యారాధితవాన్!!

మిరియాల పొడి, పచ్చకర్పూరం, అల్లం ముద్ద కూడా కలిపిన ఈ 'కర్బూజా రసాల' అనే లస్సీలో తగినంత మామిడి పండు రసాన్ని కూడా చేర్చి, అన్నిటినీ బాగా మిక్సీ పట్టి, గుజ్జుగా చేయాలి. దీన్ని ఒక పళ్లెంలో పలుచగా ఆరబోసి, మంచి ఎండలో పెట్టి, గట్టిపడేవరకూ ఎండించండి. అద్భుతమైన, రుచికరమైన, విలువైన ఖర్బూజతాండ్ర తయారౌతుంది. ఓవెన్లు, హీటర్లు అందుబాటులో ఉన్నవాళ్లు వాటి సాయంతో కూడా దీన్ని తాండ్రగా చేసుకోవచ్చు. పిల్లలు బడికి తీసుకెళ్లేందుకు అనువైన, బలకరమైన స్వీటు ఇది!

'సర్వ రసాలేషు ఉత్తమోత్తమమ్' అన్నాడు ఈ మామిడి రసం కలిసిన రసాలను క్షేమశర్మ.

● గంగరాజు అరుణాదేవి

గింజల్లోనూ అవే గుణాలు...

కర్బూజా ముక్కల్ని సలాడ్స్‌లో కలిపి తినవచ్చు. దీని గింజల్ని ఎండించి దంచిన పొడిని కూరల్లోనూ చారు, పప్పుచారుల్లోనూ చిక్కబరిచేందుకు కలుపుతారు. సోయాబీన్ లాగానే దీని గింజల్ని వాడుతుంటారు. దీని గుజ్జుకున్న గుణాలన్నీ ఈ గింజలకున్నాయి. అదనంగా మాంసకృత్తులు వగైరా కూడా లభిస్తాయి. అందుకని కర్బూజా పండుని తరిగేప్పుడే గింజల్ని వేరు చేసి, కడిగి ఆరబెట్టుకుంటే తరువాత మిక్సీ పట్టుకుని వాడుకోవచ్చు.



ఎండలు తగ్గిపోయాయి. వాతావరణం కాస్త చల్లబడింది. ఇలాంటప్పుడు నాన్‌వెజ్ వంటకాలతో దోస్తీ చేస్తే ఆ మజానే వేరు. నాటుకోడి పులుసు, అంకాపూర్ కోడి, కోడి మునగకాయ కూర, కోడి మామిడికాయ కూర వంటల్ని ఈ వీకెండ్‌లో వండుకోండిలా...

వంటిల్లు

కోడికూర రుచికరంగా!

నాటుకోడి పులుసు

కావాల్సిన పదార్థాలు

నాటుకోడి- 1 కేజీ, పసుపు- అర టీస్పూన్, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), కారంపొడి- 2 టీస్పూన్లు, ధనియాల పొడి- 2 టీస్పూన్లు, గరం మసాలా పొడి- అర టీస్పూన్, అల్లం-వెల్లుల్లి పేస్ట్- 2 టీ స్పూన్లు, కొబ్బరి పొడి- 3 టేబుల్ స్పూన్లు, చింతపండు పులుసు- అర కప్పు, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

ముందుగా నాటుకోడిని మంట మీద కాల్చి కొంచెం పసుపు రాసి కడిగి ముక్కలు చేసి పెట్టుకోవాలి. మూకుడులో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి ఎర్రగా అయ్యేంత వరకు వేయించాలి. ఇందులో పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి రెండు నిముషాలపాటు కలిపిన తర్వాత కోడి ముక్కలు, కారం పొడి, ధనియాల పొడి, తగినంత ఉప్పు వేసి మూడు నిముషాల పాటు కలపాలి. ఆ తర్వాత మూకుడుపై మూత పెట్టి కుక్ చేయాలి. ముక్కలు వేగిన తర్వాత కొబ్బరి పొడి వేసి కలపాలి. ఇందులో కప్పు నీళ్లు పోసి కలిపి చిన్న మంట మీద ఉడికించాలి. ముక్కలు బాగా ఉడికిన తర్వాత గరం మసాలా, చింతపండు పులుసు వేసి మరో ఐదు నిముషాల పాటు ఉడికించాలి. నూనె పైకి తేలిన తర్వాత మూకుడు దింపేయాలి. అన్నం, చపాతీ, రాగి సంగటితో నాటికోడి పులుసును తింటే రుచిగా ఉంటుంది.

అంకాపూర్ కోడి



కావాల్సిన పదార్థాలు

నాటుకోడి- 1 కేజీ, పసుపు- అర టీస్పూన్, ధనియాల పొడి- 3 టీస్పూన్లు, ఉల్లిపాయలు- 3 (సన్నగా తరగాలి), అల్లం, వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, కారం పొడి- 2 టీస్పూన్లు, కొబ్బరి పొడి- 2 టేబుల్ స్పూన్లు, లవంగాల పొడి- అర టీస్పూన్, షాజీర- 1 టేబుల్ స్పూన్, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

నాటుకోడిని మంట మీద బాగా కాల్చి పసుపు రాసి కడిగి ముక్కలు చేసుకోవాలి. ఈ ముక్కల్లో కొన్ని ఉల్లిపాయలు, సగం పసుపు, సగం ధనియాల పొడి, సగం అల్లం వెల్లుల్లి పేస్ట్ కొద్దిగా నీళ్లు చల్లి కలిపి మూతపెట్టి అరగంట పాటు ఉంచాలి. ఆ తర్వాత వెడల్పాటి గిన్నె లేదా కడాయిలో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి ఎర్రగా అయ్యేంత వరకూ వేయించాలి. ఇందులో అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి కొద్దిగా వేగిన తర్వాత కోడి ముక్కలు వేసి వేయించాలి. చివరగా కారంపొడి, పసుపు, ధనియాల పొడి, కొబ్బరి పొడి, తగినంత ఉప్పు వేసి కలిపి అవసరమైనన్ని నీళ్లు పోసి ఉడికించాలి. కోడి ముక్కలు బాగా ఉడికిన తర్వాత లవంగాల పొడి, షాజీర వేసి కలిపి దింపేయాలి.

కోడి మునగకాయ కూర



కావాల్సిన పదార్థాలు

కోడి- 1 కేజీ, మునగకాయలు- 10, టమాటాలు- 3 (సన్నగా తరగాలి), ఉల్లిపాయలు-2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 3, కరివేపాకు- 2 రెబ్బలు, పసుపు- అర టీస్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, కారం పొడి- ఒకటిన్నర టీస్పూన్, ధనియాల పొడి- 2 టీస్పూన్లు, గరం మసాలా పొడి- అర టీస్పూన్, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

కోడి ముక్కలు శుభ్రంగా కడిగి జల్లెట్లో వేయాలి. మునగకాయలు రెండు లేదా మూడు అంగుళాలంత ముక్కలుగా తరిగి పైన నార తీయాలి. మూకుడులో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి మెత్తబడే వరకు వేయించాలి. పసుపు, అల్లం వెల్లులి పేస్ట్, కరివేపాకు వేసి కొద్దిగా వేగిన తర్వాత కారంపొడి, ధనియాల పొడి వేసి కలపాలి. ఆ తర్వాత కోడిముక్కలు , తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు ఉడికిన తర్వాత తరిగిన టమోటా ముక్కలు, మునగకాయలు కూడా వేయాలి. ఉడికిన తర్వాత గరం మసాలా పొడి వేసి దింపేయాలి.

కోడి మామిడికాయ కూర

కావాల్సిన పదార్థాలు

కోడి- 1 కేజీ, మామిడికాయలు- 2 చిన్నవి, ఉల్లిపాయలు- 3, పచ్చిమిర్చి- 4, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, పెరుగు- అర కప్పు, కొబ్బరి పొడి- 3 టీస్పూన్లు, గసాలు- 3 టీస్పూన్లు, పసుపు- అర టీస్పూన్, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్, గరం మసాలా పొడి- అర టీస్పూన్, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

మామిడికాయలను తురమాలి లేదా చిన్న ముక్కలుగా తరగాలి. ఆ తర్వాత కోడి ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన ఉంచుకోవాలి. గసాలు వేయించి కొబ్బరితో కలిపి పొడి చేసి పెరుగు కలిపి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి. నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్,



కారం పొడి, ధనియాల పొడి వేసి కలపాలి. ఆ తర్వాత కోడి ముక్కలు, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు బాగా వేగిన తర్వాత మామిడికాయ తురుము వేసి రెండు నిముషాల పాటు వేయించాలి. కొబ్బరి, గసాల ముద్ద, కప్పు నీళ్లు పోసి కలపాలి. ఆ తర్వాత మూతపెట్టి ఉడికించాలి. కోడి ముక్కలు బాగా ఉడికి నూనె తేలుతున్నప్పుడు కొత్తిమీర, గరం మసాలా పొడి వేసి కలిపిన తర్వాత దింపేయాలి.

**నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/5P96QOwలో చదవండి.**



అది వ్యసనం కాదు వ్యాధి

తాగుబోతుల కంటే, వాళ్లతో కలిసి జీవించే వాళ్లే ఎక్కువగా దెబ్బ తింటూ ఉంటారు. కానీ మందు మత్తులో కూరుకుపోయిన వ్యసనపరులకు ఈ స్పృహ ఉండదు. ఇలాంటివాళ్ల కళ్లు తెరిపిస్తూ, వారికి బాసటగా నిలుస్తోంది 'ఆల్కహాల్ ఎనానిమస్' సంస్థ. దీని అనుబంధ సంస్థ, అల్ అనాన్ మద్దతుతో, గాడిన పడిన తమ కుటుంబాల గురించి కొందరు మహిళలు నవ్యతో పంచుకున్న అనుభవాలివి.

రీహ్యాబ్ సెంటర్లు, కౌన్సెలింగ్ సెంటర్లు, పసరు మందులు.. ఇలా వ్యసనపరుల చేత మద్యాన్ని మాన్పించే మార్గాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రయత్నాలన్నీ ఫలితాన్నివ్వక, కొత్త మార్గాల కోసం అన్వేషించేవారికి చేయూతగా నిలుస్తోంది 'ఆల్కహాల్ అనానిమస్' సంస్థ. మద్యం వ్యసనం నుంచి బయటపడడంలో కుటుంబ తోడ్పాటు కీలకమని బలంగా నమ్మే ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మంది, దేశవ్యాప్తంగా 50 వేల మంది కోలుకుంటున్నారు. ఈ సంస్థ, ఎలాంటి రుసుములు, ఫీజులతో పని లేకుండా, మందులు, కౌన్సెలింగ్‌ల అవసరం లేకుండా, మీటింగ్‌లకు హాజరయ్యే కుటుంబాల అనుభవాలు, టూల్స్ సహాయంతో వ్యసనపరుల్లో మార్పును తీసుకొస్తోంది.

అల్ అనాన్ వేళలు ఇవే!

అల్ అనాన్ మీటింగ్స్ వారమంతా జరుగుతాయి. ప్రతి సోమవారం, శుక్రవారం బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో రాత్రి 7 నుంచి 8 గంటల వరకూ, బంజారాహిల్స్‌లోని సెయింట్ అల్ఫోన్స్ స్కూల్‌లో ప్రతి ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ, నారాయణగూడ వైఎమ్‌సిఏలో ప్రతి గురువారం సాయంత్రం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకూ, ఈ మీటింగ్స్ జరుగుతాయి. ప్రతి శుక్రవారం సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకూ ఆన్‌లైన్ మీటింగ్ కూడా జరుగుతుంది. అల్ అనాన్ టోల్ ఫ్రీ నంబర్: 9666466118, 9666466119

అల్ అనాన్
అల్(ఆల్కహాల్) అనాన్(అనానిమస్)



16 ఏళ్లుగా సోబర్‌గా...

మా వారు బింజ్ డ్రింకర్. అదే పనిగా తాగకపోయినా, తాగడం మొదలుపెడితే రోజుల తరబడి తాగేవారు. అలాగే రోజులు, నెలల తరబడి ఇంటినే మర్చిపోతూ ఉండేవారు. కాల్ చేస్తే ఫోన్ తీయరు. తానెక్కడున్నారో తెలియనివ్వరు. దాంతో ఆయన ఆచూకీ తెలియక, ఉన్నారో, పోయారో అర్థం కాక, దినపత్రికల్లో సంస్మరణ ప్రకటనలను పరిశీలించేదాన్ని. ఆల్కహాలిక్‌కు భార్యగా నేనెంత ఒత్తిడికి లోనై ఉంటానో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆ అలవాటు ఉన్నంత మాత్రాన ఆయనేమీ చెడ్డవారు కారు. మా మధ్య ఎలాంటి గొడవలూ ఉండేవి కావు. మద్యం మత్తులో ఆయన నాతో దురుసుగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. నేను కూడా వ్యసనం వంకతో ఆయన్ని తూలనాడిందీ లేదు. కానీ ఎంత ప్రయత్నించినా ఆయన మద్యం ఊబిలో నుంచి బయటకు రాలేకపోతున్నారనే విషయాన్ని గ్రహించాను. ఆ దురలవాటు నుంచి బయట పడడమెలాగో తనకు అర్థం కావడం లేదనీ, నాకు ముఖం చూపించలేకే నెలల తరబడి ఇంటికి దూరంగా ఉండిపోతున్నాననీ ఆయన ఒక సందర్భంలో బయటపడ్డారు. అప్పటికే రీహ్యాబ్ సెంటర్ల లాంటి ప్రత్యామ్నాయాలను ప్రయత్నించి ఉన్నాం. కానీ ఫలితం కనిపించక, ఆ ఊబి నుంచి ఎలా బయటపడాలో తెలియక బాధపడుతున్న సమయంలో, ఆల్కహాల్ ఎనానిమస్ అనుబంధ సంస్థ, 'అల్ అనాన్' గురించి తెలిసింది.

అక్కడ కౌన్సెలింగ్, చికిత్సలూ లాంటివి లేకపోవడం ఊరట కలిగించింది. మాలాంటి కుటుంబాలు ఒక చోట చేరి, తమ తమ అనుభవాలను పంచుకునే వేదిక అది. ఆ అనుభవాలు, స్లోగన్లు, టూల్స్ మా వారిలో మార్పుకు సహాయపడ్డాయి. మా ప్రయత్నం ఫలించి, ఆయన మద్యం మానేశారు. గత 16 ఏళ్లుగా ఆయన మద్యం జోలికి వెళ్లలేదు. అయితే అల్ అనాన్‌కు దంపతులిద్దరూ ఎందుకు హాజరు కావాలనే ప్రశ్న ఎంతో మందిలో తలెత్తడాన్ని నేను గమనించాను. నిజానికి మద్యం అలవాటును ఒక వ్యసనంగా కాకుండా దాన్నొక జబ్బుగానే చూడాలి. జబ్బుతో బాధపడే వ్యక్తికి మనమెలా చేదోడువాదోడుగా ఉంటూ నయం చేసుకుంటామో, మద్యం వ్యసనపరులకు కూడా జీవిత భాగస్వామి తోడుగా నిలవాలి. భార్యలు, భర్తలను చీదరించుకుని, అవమానించి, చులకన చేసి, గొడవపడితే బంధం మరింత బలహీనపడుతుంది. ఆ ప్రభావం పిల్లల మీద కూడా పడుతుంది. కాబట్టి భర్త, ఆ అలవాటు మూల కారణాన్ని స్వయంగా గ్రహించేలా చేయాలి. మద్యం మానే ప్రయత్నంలో తమ వంతు సహాయసహకారాలను అందించాలి. 'నన్ను ఒంటరిగా వదిలేశావంటే, బయటకు వెళ్లిపోయి తాగేస్తాను' అని మా వారు అనడంతో, ఉద్యోగానికి సెలవు పెట్టేసి, తలుపుకు తాళం వేసి ఆయనతోనే రోజుల తరబడి ఉండిపోయిన సందర్భాలున్నాయి. ఆ వ్యసనాన్ని ఒక రోగం దృష్టితో చూడగలిగాను కాబట్టే, దాన్ని వదిలించుకోవడంలో ఆయనకు తోడ్పడగలిగాను. అలవాటు ఆయనది, కాబట్టి సమస్య కూడా ఆయనదే, ఇలాంటి మీటింగులకు వెళ్లవలసిన అవసరం నాకేముంది? అని భావించకుండా భార్యలు కూడా భర్తలతో పాటు హాజరయినప్పుడే ఫలితం దక్కుతుంది.

పవిత్ర, హైదరాబాద్.

గోప్యతే ప్రధానం

మద్యం వ్యసనం పట్ల ఇప్పటికీ సమాజానిది చిన్న చూపే! భర్తకు ఈ అలవాటు ఉందని చెప్పినప్పుడు చులకనగా చూడడంతో పాటు, భర్త వ్యసనపరుడిగా మారడానికి భార్యలో ఉన్న తప్పుల కోసం వెతికే వాళ్లకు ఈ సమాజంలో కొదవ ఉండదు. ఇలాంటి ధోరణి వల్లే ఈ వ్యసనం పట్ల గోప్యత పాటించక తప్పడం లేదు. ఈ ఇబ్బందిని తొలగించాలనే ముఖ్యోద్దేశంతోనే అల్ అనాన్ సపోర్ట్ గ్రూప్, గోప్యతనే ప్రధాన అంశంగా ఎంచుకుంది. ఈ సంస్థను ఆశ్రయించేవారి పేర్లు, వివరాలు, విషయాలు గోప్యంగా ఉంటాయి. హాజరయ్యే వాళ్లందరూ ఈ సూత్రాన్ని కచ్చితంగా పాటిస్తారు. ఎల్ ఎనాన్‌కు వ్యసనపరుల కుటుంబసభ్యులు లేదా భార్యలూ హాజరైతే, ఆల్కహాలిక్స్ ఆల్కహాలిక్ ఎనానిమస్‌కు హాజరవవలసి ఉంటుంది. అల్ అనాన్‌లో 12 సూత్రాల ఆధారంగా ఆల్కహాలిక్స్‌తో ప్రవర్తించే విధానం గురించి, వాళ్లలో మార్పుకు తోడ్పడే స్వభావాల గురించి సాటి స్పాన్సర్ల ద్వారా తెలుసుకోగలుగుతాం. ముందు నుంచీ సభ్యులుగా ఉన్నవాళ్లు స్పాన్సర్లుగా మారి, కొత్త వాళ్లకు మార్గనిర్దేశం చేస్తారు. 1:1 నిష్పత్తిలో సాగే ఈ స్పాన్సర్‌షిప్‌లో, ఆల్కహాలిక్స్‌తో మసలుకోవడంలో మనం చేసిన, చేస్తున్న తప్పులు అవగతమవడంతో పాటు, వాళ్లతో ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తించకూడదో నేర్చుకుంటాం. మరో పక్క ఆల్కహాల్ ఎనానిమస్‌కు హాజరయ్యే ఆల్కహాలిక్స్ కూడా అక్కడ నేర్చుకున్న వాటిని ఇళ్ల దగ్గర ఆచరణలో పెట్టడం మొదలుపెడతారు. అలా దంపతులిద్దరూ పరస్పరం సహకరించుకుంటూ సమిష్టిగా ఆ దురలవాటు మీద విజయం సాధించగలుగుతారు.

ఇక నా విషయానికొస్తే, మా వారికి పెళ్లికి ముందే మద్యం అలవాటు ఉంది. సోషల్ డ్రింకింగ్ సర్వసాధారణమే అనే ఉద్దేశంతో పెళ్లికి ఒప్పుకున్నాను. అది అలవాటు కాదు వ్యసనమనే విషయం పెళ్లైన రెండు నెలలకు తెలిసింది. రోజూ రాత్రివేళకే పరిమితమైన మద్యం కాస్తా పగటివేళకు కూడా వ్యాపించింది. రీహ్యాబ్‌లో వేయడం, 'అయ్యో దాని వల్ల ఆయన ఉద్యోగం పోతే, నా బ్రతుకేం కాను?' అని భయపడడం నాకు మామూలైపోయింది. అలా ఒక రీహ్యాబ్‌లో మావారికి అల్ అనాన్‌మస్ గురించి తెలిసింది. బయటకు వచ్చాక, ఇద్దరం హాజరు కావాలని నిర్ణయించుకున్నాం. అలా ఏడేళ్ల పాటు ఆల్కహాలిక్‌గా ఉన్న మా వారు పూర్తిగా మద్యం మానేయగలిగారు. ఆయన మద్యం మానేసి ఇప్పటికి ఎనిమిదేళ్లు.

సుష్మ, హైదరాబాద్.
(గోప్యత కోసం పేర్లను మార్చడం జరిగింది)

● గోగుమళ్ల కవిత

మేకప్



వానల్లో చెక్కుచెదరకుండా...

వర్షాకాలంలో మేకప్‌ను కాపాడుకోవడం కాస్త కష్టమే! తేమతో కూడిన వాతావరణం, అకస్మాత్తుగా కురిసే కుండపోత వానలు మేకప్‌ను డిస్టర్బ్ చేసేస్తూ ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో కొన్ని మెలకువలు పాటించాలి.

క్రీమ్ బేస్‌డ్ అయితే...

మేపక్‌లో ఉపయోగించే ఉత్పత్తులు క్రీమ్ బేస్‌డ్ అయితే, వాటిని వీలైనంత పరిమితంగా వాడుకోవాలి. వాటిని బాగా బ్లెండ్ చేయడంతో పాటు, చెదిరిపోకుండా ఉండడం కోసం పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఇలా మేకప్ వేసుకోగలిగితే 'ఎయిర్ బ్రష్' లుక్ సొంతమవుతుంది.

సెట్టింగ్ పౌడర్‌తో...

మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ పౌడర్ వాడుకోవాలి. మేకప్ పూర్తయిన తర్వాత పెద్ద బ్రష్ తీసుకుని ముఖం, మెడ మీద పరుచుకునేలా సెట్టింగ్ పౌడర్‌ను అద్దుకోవాలి.

బోల్డ్ లిప్‌స్టిక్

మీ దగ్గర లెక్కలేనన్ని లిప్‌స్టిక్‌లు ఉండి ఉండొచ్చు. కానీ వానాకాలంలో బోల్డ్ కలర్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. ఎరుపు, మెరూన్, బ్రౌన్ రంగులు వానాకాలంలో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

మస్కారా ఇలా...

వాటర్ ప్రూఫ్ మస్కారా వానాకాలానికి అనువైనది. అదనపు భద్రత కోసం మస్కారా అప్లై చేసిన తర్వాత, లైట్‌గా పౌడర్ డస్టింగ్ చేసుకుని, రెండో కోట్ వేస్తే కనురెప్పలు చిక్కగా కనిపిస్తాయి.

సింపుల్‌గా....

వానాకాలం వీలైనంత తక్కువ మేకప్ వేసుకోవాలి. ఫౌండేషన్ తక్కువగా వాడుకోవాలి. ఈ కాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది కాబట్టి పలుచని మేకప్ ఎక్కువ సమయం పాటు చెదిరిపోకుండా ఉంటుంది. ఒకవేళ వానకు తడిచి, చెదిరిపోయినా, ముఖం కళావిహీనంగా మారిపోకుండా ఉంటుంది.

నేటి మ్యాచ్‌లు

న్యూజిలాండ్ x అఫ్ఘానిస్థాన్ (ఉ.5. గం.)
శ్రీలంక x బంగ్లాదేశ్ (ఉ.6. గం.)
నెదర్లాండ్స్ x దక్షిణాఫ్రికా (రాత్రి 8 గం.)
ఆస్ట్రేలియా x ఇంగ్లండ్ (రాత్రి 10.30 గం.)

షూటింగ్ వరల్డ్‌కప్‌లో

సిఫ్ట్‌కు కాంస్యం




మ్యూనిచ్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా కాంస్యం సాధించింది. శుక్రవారం జరిగిన ఈ పోటీల్లోని మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పీలో సిఫ్ట్ 452.9 పాయింట్లు స్కోరు చేసి తృతీయ స్థానంలో నిలిచింది. ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో సరబ్‌జోత్ స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే. దీంతో ఈ టోర్నీలో మొత్తంగా భారత్ రెండే పతకాలను సాధించింది.

లక్ష్యసేన్ కూడా అవుట్

జకర్తా: ఇండోనేసియా ఓపెన్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 22-24, 18-21తో వరల్డ్ నెంబర్ 5 ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు.

'టాప్'లో స్కాట్లాండ్

నమీబియాపై గెలుపు
మైకేల్ ఆల్‌రౌండ్ షో
టీ20 వరల్డ్ కప్



మైకేల్ లీస్క్

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
స్కాట్లాండ్	2	1	0	1	3	0.736
ఆస్ట్రేలియా	1	1	0	0	2	1.950
నమీబియా	2	1	1	0	2	-0.309
ఇంగ్లండ్	1	0	0	1	1	0.000
ఒమన్	2	0	2	0	0	-0.975

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

బ్రిడ్జిటౌన్: మైకేల్ లీస్క్ (35; 1/16) ఆల్‌రౌండ్‌షోతో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. ప్రస్తుతం మూడు పాయింట్లతో ఉన్న ఈ జట్టు గ్రూప్ 'బి'లో టాప్‌నకు చేరింది. ఇంతకుముందు ఇంగ్లండ్‌తో జరిగిన తొలి మ్యాచ్ వర్షంతో రద్దు కావడంతో చెరో పాయింట్‌ను కేటాయించారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. 55 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన వేళ.. కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (52) అర్ధసెంచరీతో ఆదుకోగా, గ్రీన్ (28), డేవిన్ (20) ఫర్వాలేదనిపించారు. పేసర్ బ్రాడ్ వీల్‌కు మూడు, బ్రాడ్లీ కర్రీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో స్కాట్లాండ్ 18.3 ఓవర్లలో 5 వికెట్లకు 157 పరుగులు చేసి నెగ్గింది. ఎరాస్మస్‌కు రెండు వికెట్లు దక్కాయి. నమీబియా బౌలర్లు ఆరంభంలో కట్టడి చేయడంతో బ్యాటర్లు రన్స్ కోసం ఇబ్బందిపడ్డారు. అయితే కెప్టెన్ బెరింగ్టన్ (47 నాటౌట్)కు లీస్క్ జత కలవడంతో జట్టు కోలుకుంది. ముఖ్యంగా లీస్క్ నాలుగు సిక్సర్లతో చెలరేగి 18వ ఓవర్‌లో అవుటయ్యాడు. అప్పటికి ఐదో వికెట్‌కు 74 పరుగులు జత చేరడంతో జట్టు విజయం ఖాయమైంది.

సంక్షిప్త స్కోర్లు: నమీబియా: 20 ఓవర్లలో 155/9 (ఎరాస్మస్ 52, గ్రీన్ 28, డేవిన్ 20; వీల్ 3/33, కర్రీ 2/16); **స్కాట్లాండ్:** 18.3 ఓవర్లలో 157/5 (బెరింగ్టన్ 47 నాటౌట్, లీస్క్ 35, జోన్స్ 26; ఎరాస్మస్ 2/29).

కీలక పోరులో ప్రజ్ఞానంద పరాజయం

స్టావాంజర్: నార్వే చెస్ టోర్నమెంట్‌లో తప్పక గెలవాల్సిన కీలక పోరులో తమిళ జీఎం ప్రజ్ఞానంద ఓటమి పాలై టైటిల్‌కు దూరమయ్యాడు. అయితే, ఈ ఓటమి తర్వాత కూడా ప్రజ్ఞానంద 13 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. తొమ్మిదో రౌండ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా).. ప్రజ్ఞానందపై గెలిచాడు. ఫిరౌజ్జా అలిరెజా (ఫ్రాన్స్)ను ఓడించిన వరల్డ్ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్ 16 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. హికారు నకమురా (అమెరికా) 14.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. మహిళల విభాగంలో టింగ్జి లీ (చైనా) చేతిలో వైశాలి, వరల్డ్ చాంపియన్ వెన్‌జున్ జు (చైనా) చేతిలో కోనేరు హంపి ఓడారు. ప్రస్తుతం వైశాలి 11.5 పాయింట్లతో 4వ స్థానంలో, హంపి 9 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచారు.

అల్కారజ్ అదరహో



ఫ్రెంచ్ ఓపెన్

మహిళల సింగిల్స్ ఫైనల్ నేడు | సా. 6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

స్వియటెక్ x పావొలిని



ఫైనల్లో స్పెయిన్ స్టార్
సెమీస్‌లో సిన్నర్ ఓటమి

పారిస్: ఒకరు నెం.2 సీడ్..మరొకరు నెం.3..ఒకరు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్..మరొకరు వింబుల్డన్ విజేత.. దాంతో మ్యాచ్ అనుకున్న విధంగానే రంజుగా సాగింది..ఇద్దరూ తగ్గేదేలే అనేలా ఆడడంతో ఈ ఐదు సెట్ల పోరు ఉత్కంఠ రేపింది..అయితే అంతిమంగా మూడో సీడ్‌దే పైచేయి అయింది..ఇదీ ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్ జరిగిన తీరు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్) 2-6, 6-3, 3-6, 6-4, 6-3తో రెండో సీడ్ జానిక్ సిన్నర్ (ఇటలీ)ని చిత్తు చేశాడు. 4 గంటలకుపైగా జరిగిన ఈ హోరాహోరీ పోరులో వింబుల్డన్ చాంపియన్ అల్కారజ్ 8 ఏస్‌లు సంధిస్తే..ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సిన్నర్ 7 కొట్టాడు. సిన్నర్ 8, అల్కారజ్ 7 డబుల్ ఫాల్ట్స్ చేశారు. కార్లోస్ 65 విన్నర్లతో ఆధిపత్యం చెలాయిస్తే..జానిక్ 39కే పరిమితమయ్యాడు. అల్కారజ్‌కు రొలాండ్ గారో్స్‌లో ఇది తొలి ఫైనల్. 21ఏళ్ల కార్లోస్..మూడు కోర్టులపై టైటిల్ ఫైట్‌కు చేరిన పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 2022లో యూఎస్ ఓపెన్ (హార్డ్ కోర్ట్), నిరుడు వింబుల్డన్ (గ్రాస్ కోర్ట్) టైటిళ్లు అందుకున్నాడు.


కెనడా ఆటగాళ్ల ఆనందం

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
అమెరికా	2	2	0	0	4	0.626
భారత్	1	1	0	0	2	3.065
కెనడా	2	1	1	0	2	-0.274
పాకిస్థాన్	1	0	1	0	0	0.000
ఐర్లాండ్	2	0	2	0	0	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

కెనడా సంచలనం

● ఐర్లాండ్‌పై విజయం

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో రోజు కూడా సంచలన ఫలితం. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కెనడా జట్టు తమకన్నా పటిష్ఠమైన ఐర్లాండ్‌ను 12 పరుగులతో ఓడించింది. తద్వారా ఈ మెగా టోర్నీలో తొలి విజయాన్నందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 137 పరుగులు చేసింది. టాపార్డర్ పూర్తిగా విఫలం కాగా మిడిలార్డర్‌లో నికోలస్ కిర్టన్ (49), శ్రేయాస్ మొవ్వ (37) కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకున్నారు. అలాగే ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించడంతో జట్టు ఓ మాదిరి స్కోరందుకుంది. మెక్‌కార్తి, యంగ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో ఐర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులు చేసి ఓడింది. ఆఖర్లో అడెయిర్ (34), డాక్‌రెల్ (30 నాటౌట్) పోరాటం ఫలితాన్నివ్వలేదు. కెనడా బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బౌలింగ్ వేయడంతో షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డారు. అలాగే ఆరో ఓవర్ నుంచి వరుసగా సాగిన వికెట్ల పతనంతో ఐర్లాండ్ మరిక కోలుకోలేకపోయింది. ఓపెనర్లు స్టిర్లింగ్ (9), బల్బిర్నీ (17), టెక్టర్ (7), టక్కర్ (10), కాంఫర్ (4), డెలాని (3) ఇలా అందరూ చకచకా పెవిలియన్ చేరడంతో 59/6 స్కోరుతో కష్టాల్లో పడింది. అయితే డెత్ ఓవర్లలో డాక్‌రెల్, అడెయిర్ భారీ షాట్లతో బౌండరీలు రాబట్టి విజయంపై ఆశలు రేపారు. దీంతో ఆఖరి ఓవర్‌లో సమీకరణం 17 పరుగులకు మారగా పేసర్ గార్డన్ నాలుగు పరుగులే ఇచ్చి అడెయిర్ వికెట్ తీయడంతో కెనడా సంబరాలు చేసుకుంది.

సంక్షిప్త స్కోర్లు
కెనడా: 20 ఓవర్లలో 137/7 (కిర్టన్ 49, శ్రేయాస్ 37; మెక్‌కార్తి 2/24, యంగ్ 2/32)
ఐర్లాండ్: 20 ఓవర్లలో 125/7 (అడెయిర్ 34, డాక్‌రెల్ 30 నాటౌట్; గార్డన్ 2/16, హేలిగర్ 2/18).



మాజీ చాంపియన్ పాకిస్థాన్‌ను చిత్తు చేయడం ద్వారా ఈసారి టీ20 వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా జట్టు పెను సంచలనం సృష్టించింది. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఆ జట్టు టాప్ బ్యాటర్లు, బౌలర్లతో కూడిన పాకిస్థాన్‌కు షాకివ్వడంతో యూఎస్‌ఏపై అందరి దృష్టి నిలిచింది. ఇక ఆ జట్టు స్టార్ క్రికెటర్లంతా భారత మూలాలున్న వారే. దీంతో టోర్నీలో ఆడుతోంది 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' జట్టు కాదు.. 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా' అంటూ సోషల్ మీడియాలో అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా జట్టులోని మనోళ్లపై ఓ లుక్కేద్దాం..

అమెరికా స్టార్లు మనోళ్లే!

మోనంక్ పటేల్

అహ్మదాబాద్‌లో పుట్టిన మోనంక్ పటేల్ గుజరాత్ తరఫున వివిధ వయస్సు గ్రూపుల క్రికెట్ ఆడాడు. మెరుగైన అవకాశాల కోసం అమెరికాకు వెళ్లిన అతడు..ఆ జట్టుకు ఎంపిక కావడమేకాదు కెప్టెన్‌గానూ నియమితుడయ్యాడు. వికెట్ కీపర్, బ్యాటర్ మోనంక్ పటేల్ పాక్‌తో పోరులో హాఫ్ సెంచరీ చేసి జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు.

సౌరవ్ నేత్రావల్కర్



పాకిస్థాన్‌తో సూపర్ ఓవర్లో నరాలు తెగే ఉత్కంఠను అదిమిపట్టి అద్భుత బౌలింగ్ చేసిన లెఫ్టామ్ పేసర్ సౌరవ్ నేత్రావల్కర్ .. 2010 అండర్-19 వరల్డ్ కప్‌లో కేఎల్ రాహుల్, ఉనాద్కట్, హర్షల్ పటేల్, సందీప్ శర్మతో కలిసి భారత్‌కు ఆడాడు. రంజీల్లో ముంబైకి ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం అమెరికాలో ఎమ్మెస్ చేసి ఒరాకిల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూనే క్రికెట్ కెరీర్ కొనసాగించి ఆ దేశ జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు.

హర్మీత్ సింగ్



ఇతడు యువ భారత్‌కు ఆడిన క్రికెటరే. లెఫ్టామ్ స్పిన్నర్ అయిన హర్మీత్.. 2010, 12 అండర్-19 ప్రపంచ కప్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ప్రతిభావంతుడైన బౌలరే అయినా.. క్రమశిక్షణా రాహిత్యంతో అవకాశాలను చేజార్చుకున్నాడు. అనంతరం అమెరికాకు వలస వెళ్లి క్రికెట్ కెరీర్‌ను కొనసాగించాడు.

నోస్తుష్ కెంజిగే



ఆల్‌రౌండర్ కెంజిగే అమెరికాలో పుట్టాడు. వ్యవసాయ పరిశోధకుడైన అతడి తండ్రి భారత్ తిరిగి రావడంతో కెంజిగే క్రికెట్ కెరీర్‌కు భారత్‌లో అడుగులు పడ్డాయి. కర్నాటకలో ఫస్ట్ డివిజన్ క్రికెట్ పోటీలు ఆడాడు. బయో మెడికల్ ఇంజనీరింగ్ కోర్స్ చదివేందుకు అమెరికా వెళ్లిన కెంజిగే.. ఉద్యోగం చేస్తూనే క్రికెట్ ఆడుతూ జాతీయ జట్టులో స్థానం పొందాడు.

మిలింద్ కుమార్



ఢిల్లీ, సిక్కిం జట్ల తరఫున రంజీలు ఆడిన మిలింద్.. క్రికెటర్‌గా అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు కొవిడ్‌కు ముందు అమెరికా వెళ్లి విజయవంతమయ్యాడు.

నితీష్ కుమార్



టాపార్డర్ బ్యాటర్ నితీష్ కుమార్ కెనడా జాతీయ జట్టు మాజీ కెప్టెన్. 2010 అండర్-19 ప్రపంచ కప్‌లో కెనడాకు ఆడిన అతడు..2011 వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆ జట్టు తరఫున పాల్గొన్నాడు. ఆపై అమెరికా వెళ్లి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

జస్దీప్ సింగ్



న్యూయార్క్‌లో పుట్టి గ్రామీణ పంజాబ్‌లో పెరిగిన జస్దీప్..తల్లిదండ్రులు తిరిగి అమెరికా వెళ్లడంతో అక్కడే క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నాడు. కుడి చేతి వాటం పేసర్ అయిన జస్దీప్ 2015లో అమెరికా జట్టుకు ఎంపికయ్యాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఎనిమిదోసారీ అదే రేటు

యథాతథ స్థితికే ఆర్‌బీఐ మొగ్గు.. 6.50 శాతం వద్దే రెపో రేటు

వడ్డీ రేట్ల తగ్గింపునకు ఎంపీసీలో పెరుగుతున్న మద్దతు



అందరి ఊహలకు అనుగుణంగానే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో రేటును యథాతథంగా కొనసాగించింది. ఫలితంగా అది 6.50 శాతం వద్ద నిలకడగా ఉంది. రెపో రేటులో యథాతథ స్థితిని కొనసాగించడం వరుసగా ఇది ఎనిమిదో సారి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటు విషయంలో ఇదే ధోరణి అనుసరిస్తూ వస్తోంది. అయితే రేటు తగ్గింపునకు ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ)లో క్రమంగా బలం పెరుగుతున్న సంకేతాలు మాత్రం కనిపించాయి.

ముంబై: బ్యాంకింగ్ రంగంలో వడ్డీ రేట్ల ధోరణులకు దిక్సూచిగా పరిగణించే రెపో రేటును యథాతథంగా కొనసాగించాలన్న రిజర్వ్ బ్యాంక్ నిర్ణయంతో మరో రెండు నెలల పాటు గృహ, వాహన, రిటైల్ రుణాలపై వడ్డీ భారం ఇప్పుడున్నట్టుగానే కొనసాగనుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు సమావేశమైన ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) 4:2 మెజారిటీతో రెపో రేటులో యథాతథ స్థితి కొనసాగింపు నిర్ణయం తీసుకుంది. మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఊహాతీతంగా బలమైన 8.2 శాతం వృద్ధి రేటు నమోదు కావడం, ఏప్రిల్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ కట్టడి పరిధి కన్నా పై స్థాయిలో 4.83 శాతంగా ఉండడం రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఎంపీసీ ఈ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎంపీసీ నిర్ణయాలను దాస్ ప్రకటించారు.

వృద్ధి రేటు అంచనా 7.2 శాతం

2024-25 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనాలను ఆర్‌బీఐ 7.2 శాతానికి పెంచింది. ఆసియాలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్ గత ఏడాది అందరి ఊహలను మించి బలమైన వృద్ధి రేటును సాధించినందు వల్ల ఈ ఏడాది వృద్ధి అంచనాలను తాము గతంలో ప్రకటించిన 7 శాతం నుంచి 7.2 శాతానికి పెంచామని దాస్ వెల్లడించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం, డిమాండ్ పెరిగినట్టు ఆయన చెప్పారు. దీనికి తోడు పట్టణ ప్రాంతాల్లో కూడా విచక్షణాత్మక వ్యయాలు పెరిగాయని, పెరిగిన వినియోగ డిమాండ్‌కు దీటుగా దేశంలో తయారీ రంగం కార్యకలాపాలు కూడా పెరగనున్నాయని ఆయన అన్నారు.

బల్క్ డిపాజిట్ల పరిమాణం రూ.3 కోట్లకు పెంపు

బ్యాంకుల ఆస్తుల నిర్వహణను బలోపేతం చేయడం లక్ష్యంగా బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల గరిష్ఠ పరిమాణాన్ని ఆర్‌బీఐ రూ.3 కోట్లకు పెంచింది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.2 కోట్లుగానే ఉంది. సాధారణ ఎఫ్‌డీలతో పోల్చితే ఇలాంటి డిపాజిట్లపై వడ్డీ రేటు స్వల్పంగా అధికంగా ఉంటుంది. ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు సంబంధించి బల్క్ డిపాజిట్ నిర్వచనాన్ని "రూ.3 కోట్లు, ఆ పైబడిన సింగిల్ రూపీ టర్మ్ డిపాజిట్"గా మార్చినట్టు దాస్ వెల్లడించారు. దీనివల్ల బ్యాంకులు బల్క్, రిటైల్ డిపాజిట్లను వర్గీకరించడం తేలిక అవుతుందన్నారు.

"ద్రవ్యోల్బణ కట్టడికే ద్రవ్య విధానంలో ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. దాన్ని 4 శాతానికి కుదించాలన్న లక్ష్యానికి మేం కట్టుబడి ఉన్నాం. ధరల్లో నిలకడతో కూడిన స్థిరత్వం ఏర్పడినట్టయితే అధిక వృద్ధికి బలమైన పునాది దానికదే ఏర్పడుతుంది. ద్రవ్యోల్బణం ఆశించిన రీతిలోనే తగ్గుతోంది. కాని 4 శాతానికి కట్టడి చేయడం అనేది చాలా కష్టమైన పని అనడంలో సందేహం లేదు. కాని దాన్ని సాధించేందుకు మేం కృషి చేస్తాం"
- శక్తికాంత దాస్, గవర్నర్, ఆర్‌బీఐ

అన్‌సెక్యూర్డ్ రుణాలపై వ్యూహాలకు పదును

దీర్ఘకాలంగా నిలకడగా ఉండిపోయిన రుణాలు, డిపాజిట్ల వృద్ధిలో వ్యత్యాసం పూడ్చుకునేందుకు బ్యాంకులు తమ వ్యూహాల్లో అవసరమైన మార్పులు చేసుకోవచ్చని దాస్ చెప్పారు. అవసరమైతే సెక్యూరిటీ లేని రుణాల్లో వృద్ధిని కట్టడి చేయవచ్చని సూచించారు. అన్‌సెక్యూర్డ్ రిటైల్ రుణాల్లో మితిమీరిన వృద్ధి, బ్యాంక్ రుణాలపై ఎన్‌బీఎఫ్‌సీల అధిక ఆధారనీయత పట్ల గత నవంబరులో ఆర్‌బీఐ ఆందోళన ప్రకటించిన నేపథ్యంలో ఈ సూచనకు ప్రాధాన్యత ఉంది. ఇలాంటి రుణాల పరిమాణం కొంత తగ్గినట్టు తాజా గణాంకాలు తెలుపుతున్నాయన్నారు.

ఇతర ముఖ్యాంశాలు

- విదేశీ వాణిజ్యంలో మారుతున్న ధోరణులకు అనుగుణంగా విదేశీ ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) 1999 కింద వస్తుసేవల ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన మార్గదర్శకాలు హేతుబద్ధం చేయనున్నారు. దీనివల్ల వ్యాపార నిర్వహణ మరింత సరళమై బ్యాంకుల అధీకృత డీలర్లకు మరింత నిర్వహణాపరమైన వెసులుబాటు ఏర్పడుతుంది. వీటికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో వెలువడనున్నాయి.
- విదేశీ మారక నిల్వలు మే 31వ తేదీతో ముగిసిన వారంలో 483.7 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 65,151 కోట్ల డాలర్లకు చేరాయి. ఇది చారిత్రక గరిష్ఠ స్థాయి. అయితే బంగారం నిల్వలు 21.2 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 5650.1 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.
- బ్రిటన్ నుంచి 100 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలను వెనక్కి తీసుకురావడంపై అనవసర ఆందోళన అవసరం లేదు. దేశీయంగా తగినంత నిల్వ సామర్థ్యం ఉన్నందు వల్లనే బంగారం తిరిగి తెచ్చాం. అంతకు మించి ఆలోచించవద్దు. దేశంలో బంగారం నిల్వలు 2024 ఆర్థిక సంవత్సరంలో 27.46 మెట్రిక్ టన్నులు పెరిగి 822 మెట్రిక్ టన్నులకు చేరింది. అందులో అధిక శాతం విదేశాల్లోనే నిల్వ ఉంది.

నలుగురు ఇటు.. ఇద్దరు అటు

ఎంపీసీలో రేట్ల తగ్గింపునకు మద్దతు పెరిగింది. గత సమావేశాల్లో సభ్యుల్లో ఒకరు మాత్రమే రేట్ల తగ్గింపునకు మద్దతు ప్రకటించగా ఈసారి ఆ సంఖ్య రెండుకి పెరిగింది. వెలుపలి సభ్యులైన అషిమా గోయెల్, జయంత్ వర్మ రేట్ల తగ్గింపునకు అనుకూలంగా ఓటు వేశారు. రెపో రేటు కనీసం 0.25 శాతం తగ్గించాలని వారిద్దరూ వాదించారు. కాగా దాస్‌తో పాటు శశాంక్ భిడే, రాజీవ్ రంజన్, మైకేల్ దేవవ్రత పాత్రా యథాతథ స్థితిని బలపరిచారు. కీలక రేట్ల విషయంలో ఆర్‌బీఐ ఎప్పుడూ "అమెరికన్ ఫెడరల్‌నే అనుసరిస్తుంది" అనే అభిప్రాయం పలువురిలో ఉందని, కాని దేశంలో నెలకొన్న విభిన్న పరిస్థితుల ఆధారంగానే ఎంపీసీ నిర్ణయం ఉంటుందని తాను ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా స్పష్టం చేస్తున్నానని దాస్ తెలిపారు.

యూపీఐ లైట్ మరింత సరళం

తక్కువ విలువ గల డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో ఆన్ డివైస్ వ్యాలెట్ యూపీఐ లైట్‌లో కస్టమర్లు ఈ-మాండేట్ ద్వారా ఆటోమేటిగ్గా నిధులు తిరిగి నింపే వెసులుబాటు కల్పించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ప్రస్తుతం యూపీఐ లైట్‌లో రోజువారీ గరిష్ఠ పరిమితి రూ.2,000 కాగా సింగిల్ పేమెంట్ గరిష్ఠ పరిమితి రూ.500గా ఉంది. తాజా నిర్ణయం ప్రకారం యూపీఐ లైట్ వ్యాలెట్ వినియోగదారులు తమ ఖాతాలో నిధులు నిర్దేశిత పరిమితి కన్నా తగ్గిపోతే వెనువెంటనే నిధులు నింపేలా తమ బ్యాంకుకు అనుమతి ఇవ్వవచ్చు. తరచుగా చేసే చెల్లింపులకు ఈ-మాండేట్ విధానం నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) వంటి ఉపకరణాల్లో ఎలాంటి నిర్దేశిత గడువు ఏదీ లేకుండా అవసరమైనప్పుడల్లా నిధులు నింపే వెసులుబాటు కలుగుతుంది. చెల్లింపులు సరళతరం అవుతాయి. అలాగే డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన వాస్తవిక సమాచారం అందచేయడం కోసం డిజిటల్ పేమెంట్స్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ఒకటి ఏర్పాటు చేయాలని కూడా ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

బిజినెస్

మార్కెట్‌కు ఆర్‌బీఐ బూస్ట్

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- 1,618 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- మళ్లీ 23,000 ఎగువ స్థాయికి నిఫ్టీ
- 3 రోజుల్లో రూ.28.65 లక్షల కోట్ల వృద్ధి

ముంబై: వరుసగా మూడో రోజూ భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జీడీపీ వృద్ధి అంచనాను 7 శాతం నుంచి 7.2 శాతానికి పెంచడం ఇన్వెస్టర్ల ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచింది. దాంతో మార్కెట్లో కొనుగోళ్లు జోరందుకున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,720.8 పాయింట్లు (2.29%) ఎగబాకి 76,795.31 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 1,618.85 పాయింట్ల (2.16%) లాభంతో 76,693.36 వద్ద స్థిరపడింది. కాగా, నిఫ్టీ కూడా 498.8 పాయింట్ల (2.18%) వరకు పెరిగి 23,320.20 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆల్‌టైం ఇంట్రాడే రికార్డుకు సూచీ మరో 18.5 పాయింట్ల దూరంలో ఉంది. చివరికి సూచీ 468.75 పాయింట్ల (2.05%) లాభంతో 23,290.15 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఐటీతో పాటు వడ్డీ రేట్ల ప్రభావిత రంగాలైన బ్యాంకింగ్, రియల్టీ, ఆటో షేర్లలో భారీగా కొనుగోళ్లు జరగడం ఇందుకు దోహదపడింది.

దీంతో షేర్‌హోల్డర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మూడు రోజుల్లో రూ.28.65 లక్షల కోట్లు వృద్ధి చెంది రూ.423.49 లక్షల కోట్లకు చేరుకుంది. గడిచిన 3 ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 6.42 శాతం పుంజుకుంది. 2021 ఫిబ్రవరి తర్వాత సూచీకిదే అతిపెద్ద మూడు రోజుల లాభం. కాగా, ఈ వారం మొత్తంలో సెన్సెక్స్ 2,732.05 పాయింట్లు (3.69%), నిఫ్టీ 759.45 పాయింట్లు (3.37%) బలపడ్డాయి.


రూ.6,000 కోట్లకు హెరిటేజ్ మార్కెట్ క్యాప్

హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ షేరు గత ఐదు రోజులుగా పరుగు తీస్తోంది. షేరు ధర 5 రోజుల్లో 55 శాతం పెరిగింది. శుక్రవారం 10 శాతం వృద్ధితో సరికొత్త ఏడాది గరిష్ఠ స్థాయి రూ.661.75 వద్దకు చేరుకుంది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,140.78 కోట్లకు పెరిగింది. ఐదు రోజుల్లో మార్కెట్ క్యాప్ రూ.2,400 కోట్లకు పైగా పుంజుకుంది.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడును అసోచామ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్, యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ కే రవి కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కీలక రంగాల్లో కలిసి పనిచేయటంతో పాటు అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు అసోచామ్ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడికి రవి కుమార్ హామీ ఇచ్చారు. చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, సామాజిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని ఆశిస్తున్నట్టు రవి తెలిపారు.

టాటా ఆల్ట్రోజ్ రేసర్



టాటా మోటార్స్.. మార్కెట్లోకి ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ రేసర్‌ను విడుదల చేసింది. సరికొత్త స్పోర్టీ లుక్, 1.2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్, 6 స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్, 6 ఎయిర్‌బ్యాగ్స్ ఈ కారు ప్రత్యేకతలు. ఆర్1, ఆర్2, ఆర్3 వేరియంట్లలో అందుబాటులో ఉండనుంది. ఈ కారు ధరలు వరుసగా రూ.9.49 లక్షలు, రూ.10.49 లక్షలు, రూ.10.99 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

సీడీఎస్ లావాదేవీలకు సెబీ గ్రీన్ సిగ్నల్

దేశంలో రుణ పత్రాల మార్కెట్ అభివృద్ధికి సెబీ మరో చర్య తీసుకోబోతోంది. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలను క్రెడిట్ డిఫాల్ట్ స్వాప్స్ (సీడీఎస్) అమ్మకం, కొనుగోళ్లకు అనుమతించాలని భావిస్తోంది. దీనికి సంబంధించి ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై ఎంఎఫ్‌లు, మదుపరులు జూలైలోగా తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,750 ▲	67,600 ▲	1,00,500 ▲
ముంబై	71,913 ▼	65,872 ▼	90,535 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	455
వరంగల్	442	గోదావరి	450
చిత్తూరు	513	విశాఖపట్నం	455
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	152
విశాఖపట్నం	135		

రామోజీరావుకు వెంటిలేటర్‌పై చికిత్స

» బీపీ పెరిగి తీవ్ర అస్వస్థత

» నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రిలో చికిత్స



హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉండటం, బీపీ నియంత్రణలో లేకపోవడంతో ఆయన్ను హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఆయన గుండెకు స్టెంట్ వేశారు. రక్తపోటు నియంత్రణలోకి వచ్చినప్పటికీ ఇతర సమస్యలు తలెత్తడంలో ఆయన్ను వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రామోజీరావు వయసు 88 సంవత్సరాలు. వయసు రీత్యా పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వైద్యులు చెబుతున్నా రు. నాలుగురోజుల క్రితం ఆయన మామూలుగానే ఉన్నట్లు సమాచారం.

సీఎంవోలో ప్రక్షాళన

» పూనం, రేవు, భరత్ గుప్తాలకు బదిలీ

అమరావతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం కొలువు తీరుతున్న వేళ.. పాలనా ప్రక్షాళన ముమ్మరమైంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఈ ప్రక్రియ వేగవంతమైంది. జగన్ హయాంలో సీఎంవోలో పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారులు పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తాలను బదిలీ చేశారు. వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. కొత్త సీఎస్‌గా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే ఆయన ఈ ఆదేశాలు జారీచేశారు. జగన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూనం మాలకొండయ్య పనిచేశారు. అప్పట్లో సీఎం సెక్రటరీగా రేవు ముత్యాలరాజు, సీఎం అడిషనల్ సెక్రటరీగా నారాయణ భరత్ గుప్తా ఉన్నారు. మరోవైపు, జగన్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో నియమించిన వారిని సాగనంపే ప్రక్రియ మొదలైంది. చైర్మన్లు, డైరెక్టర్లు, బోర్డు మెంబర్ల నుంచి రాజీనామాలు తీసుకోనున్నారు. ఈ మేరకు ప్రత్యేక కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలందాయి. కాగా, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సెలవును కొత్త సీఎస్ నీరబ్‌కుమార్ ఆమోదించారు. ఈ నెల 27వరకు ఆయన లీవులో ఉంటారు. ఆ తర్వాత తిరిగి వచ్చి జీఏడీలో రిపోర్టు చేస్తారు.

వర్మ కారుపై రాళ్ల దాడి

» టీడీపీ నుంచి కొత్తగా జనసేనలో చేరిన వారి పనేనన్న వర్మ



గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన రాళ్ల, ఇటుక దాడిలో ధ్వంసమైన వర్మ కారు అద్దాలు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్, జూన్ 7: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కారుపై శుక్రవారం రాత్రి రాళ్ల దాడి జరిగింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన ఈ దాడిలో వర్మ సురక్షితంగా బయటపడగా ముగ్గురికి గాయాలయ్యాయి. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విజయం సాధించిన నేపథ్యంలో కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపేందుకు వర్మ పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి గొల్లప్రోలు మండలం వన్నెపూడి వెళ్లి సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యంతో మాట్లాడారు. తిరిగి వచ్చి కారు ఎక్కుతుండగా ఒక్కసారిగా కొందరు రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. కాగా, టీడీపీ నుంచి జనసేనలోకి కొత్తగా చేరిన 20 నుంచి 25మంది తనను చంపించేందుకు కుట్ర పన్ని దాడి చేయించారని వర్మ సంచలన ఆరోపణలు చేశారు. వీరంతా కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ గ్రూప్ అని తెలిపారు. ఈ దాడితో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు, 2009నుంచి ఉన్న జనసేన నేతలు, జనసైనికులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఎవరైతే వైసీపీ వారని చెప్పి టీడీపీ వారిని చేర్చుకున్నారో వారు చేసిన పనేనని తెలిపారు.

వైసీపీ కవ్వింపులపై సంయమనం పాటించాలి: బాబు

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల అనంతరం అక్కడక్కడా జరుగుతున్న వైసీపీ కవ్వింపులు, దాడులపై టీడీపీ అధినేత చంద్రబాబు ఆరా తీశారు. కొన్ని చోట్ల వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తలు, ఘర్షణల విషయంపై ఆయన పార్టీ నేతలతో సమాచారం తెప్పించుకున్నారు. వైసీపీ కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీడీపీ కేడర్‌కు చంద్రబాబు ఒక ప్రకటనలో సూచించారు. వైసీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా పార్టీ కేడర్ పూర్తి సంయమనం పాటించాలన్నారు.

జగన్ మాటలు ఆత్మస్తుతి.. పరనింద: వర్ల

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జగన్ మాటలు ఎన్నికల తర్వాత ఆత్మస్తుతి, పరనిందలా ఉన్నాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ తన ఓటమిని ఇతరులపై రుద్దుతున్నారు. జగన్ బటన్ నొక్కితే ఓటేయాలా? ఎన్నికల్లో ఇంత ఘోరంగా ఓడిపోయినా ఓటమిపై ఆత్మవిమర్శ చేసుకోకుండా పరనింద వేయడం సిగ్గు చేటు. వైసీపీ ఘోర ఓటమికి జగనే కారణం' అని వర్ల అన్నారు.

లోకేశ్‌ను కలిసిన పలువురు నేతలు

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, బీజేపీ నేతలు, సినీ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. సినీ నిర్మాత బండ్ల గణేశ్, హీరో నిఖిల్... లోకేశ్‌ని కలసి అభినందనలు తెలిపారు. ఉండవల్లి నివాసంలో 2వేల మంది కార్యకర్తలను కలసిన లోకేశ్ వారితో ఫోటోలు దిగారు.

గవర్నర్‌ను కలిసి.. కాపాడమని కోరడమేంటి?: సోమిరెడ్డి

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): 'మొన్నటి వరకు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బ్యాచ్... గవర్నర్‌ను కలవడమేంటి, కాపాడమని కోరటమేంటి?' అంటూ టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అరాచకాలు జగన్‌కు కనిపించడం లేదా? దాడులను ప్రోత్సహించడం టీడీపీ చరిత్రలో లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జగన్ మాటల తీరు చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. రాష్ట్రం నాశనమై పోతోందని, టీడీపీ వాళ్లు దాడులు చేస్తున్నారని ఆరోపణలు చేయడం హాస్యాస్పదం. గవర్నర్ వద్దకు మేము వెళ్లాల్సిన సమయంలో వైసీపీ నేతలను పంపడం జగన్ రివర్స్ విధానంలో భాగమేమో?' అని సోమిరెడ్డి అన్నారు.

నాబార్డు నిధులను మళ్లించారు: కాంట్రాక్టర్ల సంఘం

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధులు మళ్లింపుపై ఏసీబీ, విజిలెన్స్ డీజీలకు వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్ ఫిర్యాదు చేసింది. నిధులు మళ్లించిన ఆర్థిక శాఖ అధికారులు రావత్, సత్యనారాయణ, గ్రామీణ నీటిసరఫరా ఇంజనీరింగ్ చీఫ్ ఆర్‌వీ కృష్ణారెడ్డిపై విచారణ జరపాలని సంఘం నేతలు కోరారు.

సీఐడీ నుంచి సంజయ్ అవుట్

(మొదటి పేజీ తరువాయి)

కొత్త సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్.. శుక్రవారం పలువురు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును టార్గెట్ చేసి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టుచేసి.. హైదరాబాద్, ఢిల్లీల్లో విలేకరుల సమావేశాలు పెట్టి మరీ ఆయనపై దుష్ప్రచారం సాగించిన సీఐడీ ఏడీజీ ఎన్.సంజయ్‌ను సాగనంపారు. ఇప్పటికే సెలవు కోసం ఆయన పెట్టుకున్న వినతిని రద్దు చేశారు. తాజాగా సీఐడీ నుంచీ తప్పించారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సిట్ చీఫ్‌గా ఉండి.. కనీసం నోటీసు ఇవ్వకుండా అర్ధరాత్రి చంద్రబాబును అరెస్టు చేసిన విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డిపైనా వేటు పడింది. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా సీఎస్ ఆదేశించారు. సీఐడీ, విజిలెన్స్ అదనపు బాధ్యతలను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు అప్పగించారు. మరోవైపు.. ఫైబర్‌నెట్ ఎండీగా ఎం.మధుసూదన్‌రెడ్డిని, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీగా ఉన్న వీజీ వెంకటరెడ్డిని కూడా బదిలీ చేసిన సీఎస్.. జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజుకు ఆ బాధ్యతలు అప్పగించారు.

జగన్ హాహాకారాలు!

నాడు తన వాళ్లు దౌర్జన్యాలు చేస్తే 'బీపీ'!.. నేడు బాధితులు ఎదురుతిరిగితే దాడులా?

'అది దాడి కాదు. వారి భావప్రకటనా స్వేచ్ఛ. రాజ్యాంగంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంది. చెప్పులు విసరడం కూడా ఒకరకమైన భావప్రకటనా స్వేచ్ఛే.'

అమరావతి రాజధాని గ్రామాల పర్యటనలో చంద్రబాబుపై కర్రలు, చెప్పులు విసిరిన ఘటనపై నాటి డీజీపీ గౌతమ్ సవాంగ్

'నన్ను తిట్టే బూతులు వినలేక, తట్టుకోలేక నా అభిమానులు, నన్ను ప్రేమించే వారు టీవీ చూసేటప్పుడు వాటిని వినలేక ఎవరికో బీపీ వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా రియాక్షన్ చూపించారు.'

టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకదాడికి పాల్పడిన తరువాత సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్ మాటలు

» హింస, హత్యాకాండలకు ఐదేళ్లపాటు దన్ను

» టీడీపీ కార్యాలయంపై వైసీపీ దాడిచేస్తే

» లోకేశ్‌పై హత్యాయత్నం కేసు

» ఇప్పుడు మాత్రం రచ్చచేసే యత్నాలు

» పార్టీ శ్రేణులు జారిపోకుండా చౌకబారు ఎత్తులు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పట్టపగలు ప్రత్యర్థులపై పగబట్టి.. వెంటాడి.. వేటాడి వైసీపీ వర్గీయులు హత్యాకాండ.. దౌర్జన్యకాండ చేస్తే.. 'బ్లడ్ ప్రెషర్' పెరిగి అలా చేశారంటూ ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెనకేసుకొచ్చారు. తాజా ఎన్నికల ఫలితాల తర్వాత అనవసరంగా కవ్వింపులకు దిగుతున్న వైసీపీ కార్యకర్తలపై బాధితులు ఎదురుతిరుగుతుంటే మాత్రం.. పచ్చమూకలు హింసాకాండకు పాల్పడుతున్నాయని ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ కార్యకర్తలు ఏకంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపైనే దాడిచేసి అక్కడ కనిపించిన వారందరినీ కర్రలు, మారణాయుధాలతో చితకబాదితే.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌పైనే హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించారు. ఐదేళ్లు ఇలాగే అరాచకం సృష్టించి.. ఎవరు నోరు మెదిపినా దాడులు చేస్తూ.. తప్పుడు కేసులు పెట్టి నోటీసులతో పనిలేకుండా.. అర్ధరాత్రి గోడలు దూకి.. బెడ్రూంలలో ఉన్నా టీడీపీ నేతలను అరెస్టు చేసి తీసుకెళ్లిన సంగతి ఆయన మరచిపోయారు. గతంలో బాధితులు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా కేసులు నమోదు కాలేదు. పైగా కేసులు పెట్టడానికి వెళ్లినవారిపై పోలీసుల సమక్షంలోనే దాడులకు దిగిన ఉదంతాలు కోకొల్లలు. ఇప్పుడు అధికారం కోల్పోయిన రెండ్రోజులకే తన కార్యకర్తలపై దాడులు చేస్తున్నారంటూ జగన్ హడావుడి చేస్తున్నారు. 'ఐదేళ్లుగా పటిష్ఠంగా ఉన్న శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి' అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అంతే.. నీలి, కూలి చానళ్లు ప్రత్యేక కథనాలు వండివార్చేయడం మొదలెట్టాయి. గత నెల 13వ తేదీన పోలింగ్ రోజు మాచర్లలో నాటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను బద్దలు కొడితే.. ఇవి కళ్లూ చెవులు, నోరు కూడా మూసేసుకున్నాయి. ఇప్పుడు జగన్‌కు అనుకూలంగా ఓ సెఫాలజిస్టు ఇచ్చిన సర్వేను నమ్మి ఒక యువకుడు బెట్టింగులు కాసి.. ఫలితాలు తారుమారు కావడంతో దెబ్బతిని ఆత్మహత్య చేసుకుంటే.. టీడీపీ సోషల్ మీడియా



వేధింపుల వల్లే చనిపోయాడని.. రాష్ట్రం రావణ కాష్టమైపోయిందని నానా గొడవ చేశాయి. అసలు సంగతి బయటపడ్డాక నోరుమెదపడం లేదు.

వీటిపై నాడు స్పందించలేదేం?

దళిత వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్‌ను కరోనా సమయంలో మాస్కులు అడిగిన పాపానికి సస్పెండ్ చేశారు. నడిరోడ్డుపై లాఠీలతో కొట్టించారు. మానసిక రోగిగా చిత్రీకరించి మెంటల్ ఆస్పత్రిలో పడేశారు. హైకోర్టు జోక్యంతో ఆయన విడుదలయ్యారు. లేకపోతే అక్కడే చంపేసేవాళ్లు. చివరికి మానసిక వేదనకు గురై గుండెపోటుతో ఆయన చనిపోయారు. అయినా జగన్ స్పందించలేదు.

- తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో ఇసుక లారీలను అడ్డుకున్నందుకు.. దళిత యువకుడికి శిరోముండనం చేశారు. రాష్ట్రపతి వరకు వెళ్లినా ఇంతవరకు నిందితులపై చర్యల్లేవు. సీఎస్ నుంచి ఎస్పై దాకా అందరూ కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నించారు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా.. దాడులు చేశారు. కిడ్నాపులు చేశారు. నామినేషన్ పత్రాలను చించేశారు. బలవంతంగా ఉపసంహరణ సంతకాలు చేయించారు. కొన్ని చోట్ల ఫోర్జరీ సంతకాలు కూడా చేసి పోటీలో లేకుండా చేశారు. తనకే ప్రజాదరణ ఉందని చాటుకునేందుకు నాడు జగన్ చేయని అక్రమాల్లేవు. మాచర్లలో ఇలాగే టీడీపీ అభ్యర్థులపై దాడులు జరిగితే పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ బృందాన్ని పిన్నెల్లి అనుచరుడు తురకా కిశోర్ చంపడానికి ప్రయత్నిస్తే కేసు కూడా లేదు. పైగా మున్సిపల్ చైర్మన్‌ను చేశారు. చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలోనూ ఇలాగే బెదిరించి హింసాకాండ సృష్టించి ఏకగ్రీవాలు చేసుకున్నారు.
- జగన్‌కు అత్యంత సన్నిహితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు.. తన దళిత డ్రైవర్‌ను చంపేసి మృతదేహాన్ని ఇంటికి డోర్ డెలివరీ చేస్తే కఠినంగా శిక్షించాల్సింది పోయి.. అతడికి బెయిల్ లభించేందుకు చేయాల్సిందంతా చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం చాంబర్లోకి అనంతబాబుకు ఏకంగా గ్రీన్ చానల్ కల్పించారు.
- ప్రభుత్వానికి, జగన్‌కు వ్యతిరేకంగా ఎవరైనా సోషల్ మీడియాలో స్పందిస్తే చాలు.. సీఐడీ పోలీసులు, వైసీపీ నేతలు వారి ఇళ్లకు వెళ్లి దాడులు చేయడం.. వృద్ధులైనా, మహిళలైనా పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లడం వంటి అకృత్యాలకు పాల్పడ్డారు.
- సాక్షాత్తూ అసెంబ్లీ వేదికగా చంద్రబాబు భార్య భువనేశ్వరిపై నాటి మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సభలోనే ఉన్న జగన్ ముసిముసి నవ్వులు నవ్వుతూ మరింత రెచ్చగొట్టారు. సభ్యులను మందలించాల్సిన నాటి సభాపతి తమ్మినేని సీతారాం కూడా.. చంద్రబాబుకు మైకు ఇవ్వలేదు. దీంతో ఈ కౌరవ సభలో ఇక తాను ఉండనని.. మళ్లీ సీఎంగానే గౌరవ సభలో అడుగుపెడతానని శపథం చేసి బయటకు వెళ్లిపోయారు. ఆయన వెళ్లిపోతుంటే జగన్ అండ్ కో గేలిచేశారు.
- సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను ఉద్దేశించి జోగి రమేశ్ బూతుల దండకం చదువుతుంటే.. జగన్ నవ్వుతూ మరింత ప్రోత్సహించారు. అంతకుముందు ఇదే జోగి చంద్రబాబు ఇంటి మీదకు దాడికి వెళ్తానని ఒకరోజు ముందే చెప్పి.. మందీమార్బలంతో వెళ్తే పోలీసులు కనీసం అడ్డుకోలేదు. ఆయనకు జగన్ బహుమతిగా మంత్రి పదవి కట్టబెట్టారు.

ప్రజాస్వామ్యానికి పెనుముప్పంటూ

» రెండో రోజూ ట్వీట్

రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయి అంటూ జగన్ ఎక్స్‌లో రెండవరోజు శుక్రవారమూ స్పందించారు. 'చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వచ్చింది. టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు తలెత్తాయి. యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైపోయింది. వైసీపీ నాయకులు, కార్యకర్తలపైనా ఉన్మాదంతో దాడులు చేస్తున్నారు. పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకూ రక్షణ లేకుండా పోయింది. ఉన్నత చదువులకు కేంద్రాలైన యూనివర్సిటీల్లో ఆచార్యులపై దౌర్జన్యాలకు దిగి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గౌరవ గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా' అని జగన్ పేర్కొన్నారు.

కేడర్ జారిపోతారనే..

మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధులని కూడా చూడకుండా వైసీపీ మూకలు దాడులు చేస్తుంటే.. నోరెత్తని జగన్.. ఇప్పుడు సుద్దపూసలా మాట్లాడుతున్నారు. కనీవినీ ఎరుగని పరాజయంతో షాకులో ఉన్న ఆయన.. సీబీఐ, ఈడీ కేసుల భయంతో గజగజ వణికిపోతున్నారు. రాజకీయంగానూ కేడర్ దూరమైపోతుందన్న భయంతో.. వారు జారిపోకుండా చూసుకోవడానికి రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందంటూ హాహాకారాలు చేస్తున్నారని రాజకీయ వర్గాలు ఎద్దేవాచేస్తున్నాయి. ఆయన ఐదేళ్ల విధ్వంస పాలన చూసిన జనం.. ఇలాంటి చౌకబారు ఎత్తులను విశ్వసించరని అంటున్నాయి.

కేంద్రంలో ఎవరికి చాన్స్!

» రాష్ట్రం నుంచి ఎక్కువ మందికి చాన్స్

» టీడీపీ రామ్మోహన్ నాయుడికి అవకాశం?

» బీజేపీ, జనసేన నుంచి ఎవరు?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఎవరికి అవకాశం లభిస్తుంది? ఎందరికి చాన్స్ దక్కుతుంది? దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఆదివారం నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశముంది. వీరిలో ఏపీ నుంచి ఎంత మంది ఉంటారనేది కీలకంగా మారింది. ఎన్డీయేలో బీజేపీ తర్వాత అత్యధికంగా 16 మంది ఎంపీలతో టీడీపీ రెండో స్థానంలో ఉంది. బీజేపీ నుంచి ముగ్గురు, జనసేన ఎంపీలు ఇద్దరు ఉన్నారు. కేంద్ర కేబినెట్‌లో భాగస్వామి అయ్యేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా సుముఖంగా ఉన్నారు. అంటే... రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలతోపాటు టీడీపీ, జనసేన సభ్యులకూ కేంద్ర కేబినెట్‌లో అవకాశం దక్కనుంది. కేంద్రంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ సంఖ్యలోనే మంత్రి పదవులు వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. శుక్రవారం కొంతమందికి, ఆ తర్వాత మరో విడతలో కొందరికి పదవులు దక్కే అవకాశముంది. కేంద్రంలో కేబినెట్‌తోపాటు ఇండిపెండెంట్ చార్జి మంత్రులు, సహాయ మంత్రి పదవులు ఉంటాయి. వీటిలో కేంద్ర కేబినెట్ పదవి స్థాయి ఎక్కువ. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం టీడీపీ నుంచి శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేబినెట్ పదవి లభించే అవకాశం ఉంది. ఆ పార్టీ నుంచి పెమ్మసాని చంద్రశేఖర్ (గుంటూరు), వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (నెల్లూరు), దగ్గుమళ్ల ప్రసాదరావు (చిత్తూరు)కు కూడా అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. జనసేన తరపున ఇద్దరు ఎంపీలు ఉన్నారు. అందులో బాలశౌరి (మచిలీపట్నం) సీనియర్. ఆయనకే ఎక్కువ అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. బీజేపీ నుంచి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి (రాజమహేంద్రవరం)కి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని అంటున్నారు. సీఎం రమేశ్ (అనకాపల్లి) కూడా బీజేపీ నుంచి మంత్రి పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

చంద్రబాబు గెలుపుపై పెన్షనర్ల సంబరాలు

» జగన్ పాలనలో ఇబ్బందులు పడ్డామని వ్యాఖ్య

యూసుఫ్‌గూడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తమను ఎన్నోరకాలుగా ఇబ్బందులు పెట్టిందని, ఎంతో వేదనకు గురి చేసిందని 'అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్' నాయకులు బి.లక్ష్మీకాంతం, నళినీ మోహన్‌కుమార్, టీఎంబీ బుచ్చిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే చంద్రబాబు నాయుడు గెలుపునకు తమవంతు కృషి చేశామని, ఎట్టకేలకు అనూహ్య విజయంతో చంద్రబాబు అధికారంలోకి రావటం తమకు ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతున్న సందర్భంగా శుక్రవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఎన్నో ఇబ్బందులు పెట్టారని, రివర్స్ పీఆర్సీ, పెన్షన్ల కోత, వేతన సవరణ, కరువు భత్యాల బాకీలు ఇవ్వకుండా అవస్థలు పెట్టారన్నారు.

12న ఉదయం 11.27 గంటలకు..

» చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు.. కేసరపల్లి వేదిక

» గన్నవరం మైదానంపై టీడీపీ నేతల మొగ్గు

అమరావతి (ఆంధ్రజ్యోతి), గన్నవరం, తాడేపల్లి టౌన్, జూన్ 7: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు గన్నవరం వద్ద కేసరపల్లిలో ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ భారీ కార్యక్రమానికి అనువైన ప్రదేశం కోసం తెలుగుదేశం పార్టీ నేతలు, అధికారులు శుక్రవారం స్థలాన్వేషణ చేశారు. రాజ్‌భవన్‌లో కాకుండా బహిరంగ సభలో, ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయాలని చంద్రబాబు ఇప్పటికే నిర్ణయం తీసుకొన్నారు. ప్రమాణ స్వీకారానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు మరికొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరు కానున్నారు. ప్రజలు కూడా భారీగా హాజరయ్యే



గన్నవరంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, టీడీ జనార్దన్

అవకాశం ఉంది. దీంతో ఈ కార్యక్రమం నిర్వహణ కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పార్టీ ముఖ్య నేత టీడీ జనార్ధనరావు, పార్టీ జోనల్ సమన్వయకర్త సత్యనారాయణ రాజుతో పాటు కొందరు అధికారులు శుక్రవారం వివిధ ప్రాంతాలను పరిశీలించారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి సమీపంలోని తాడేపల్లి వద్ద సిమెంటు ఫ్యాక్టరీ ఏరియా మైదానంతోపాటు, కృష్ణా జిల్లా గన్నవరంలో కేసరపల్లి వద్ద ఉన్న మరో మైదానాన్ని వారు చూశారు. వాటిలో కేసరపల్లి వద్ద ఉన్న మైదానం జాతీయ రహదారి పక్కన ఉంది. విమానాశ్రయం నుంచి అతి దగ్గరగా ఉండడంతో వీఐపీల రాకపోకలకు అనువుగా ఉంటుందన్న అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమైంది. తాడేపల్లి వద్ద ఉన్న మైదానానికి వెళ్లే రోడ్డు అంత విశాలంగా లేకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బంది ఉంటుందని, సెక్యూరిటీ సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉందని కొందరు నేతలు భావించారు. దీనిపై శనివారం తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఈ నెల 12న ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఉంటుందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

మళ్లీ మంచి రోజులు!

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీకి సొంతంగా పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఎన్డీయే కూటమిలోని భాగస్వామ్య పక్షాల మద్దతుపై ఆధారపడాల్సి వచ్చింది. ఎన్డీయేలో బీజేపీ తర్వాత ఎక్కువ సీట్లు టీడీపీకే ఉన్నాయి. చంద్రబాబు ఎటువంటి శషభిషలకు, ఊహాగానాలకు తావివ్వకుండా ఎన్డీయే కూటవికి విస్పష్టమైన మద్దతు ప్రకటించారు. దీంతో జాతీయ రాజకీయాల్లో మరోసారి ఆయన పేరు మార్మోగడం మొదలైంది. చంద్రబాబుకు కేంద్రంలో పెరిగిన పరపతి రాష్ట్రానికి బాగా ఉపయోగపడే అవకాశముందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. జగన్ విధానాల కారణంగా రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ పరిస్థితుల్లో సంక్షేమంతోపాటు తమ మార్కు అభివృద్ధిని చూపించడమెలా అనే చర్చ టీడీపీలో జరిగింది. ఇప్పుడు... కేంద్రం నుంచి ఉదారంగా సహాయం అందుతుందని, మంచి శకునాలు కనిపిస్తున్నాయని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

గతంలో ఇలా...

గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా చంద్రబాబు పలుమార్లు కేంద్రంలో కీలక పాత్ర పోషించారు. మొదట యునైటెడ్ ఫ్రంట్, తర్వాత ఎన్డీయే ప్రభుత్వం టీడీపీ మద్దతుతోనే నడిచాయి. దీనిని అవకాశంగా తీసుకొని చంద్రబాబు ఆ సమయంలో రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులు తీసుకొచ్చారు. గరిష్ఠ స్థాయిలో నిధులూ సాధించారు. అప్పట్లో కేంద్ర ప్రాయోజిత పథకాలను ఆంధ్రప్రదేశ్ స్థాయిలో మరే రాష్ట్రమూ ఉపయోగించుకోలేదనడం అతిశయోక్తి కాదు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఏర్పడిన ఎన్డీయే సర్కారులోనూ టీడీపీ భాగస్వామిగా ఉన్నప్పటికీ... అప్పుడు బీజేపీకి సొంతంగానే ఆధిక్యం ఉండింది. అయినప్పటికీ... ఉన్నత విద్యా సంసల ఏర్పాటుతోపాటు విభజన హామీలను కొంతమేరకు సాధించుకోగలిగారు. ఇప్పుడు పరిస్థితి అలా కాదు. 'మాకు కేసుల గొడవలు లేవు. చంద్రబాబు నాయుడు తనకున్న పలుకుబడిని రాష్ట్రం కోసమే వాడతారు. ఆ విషయంలో ఆయన పట్టుదల ఎవరూ కాదనలేనిది. అన్ని రాష్ట్రాలను కాదని కేంద్రం ఒక రాష్ట్రానికే అన్నీ చేయలేదు. ఆ విషయం మాకూ తెలుసు. కానీ, ఉన్న పరిస్థితుల్లో కొంత మెరుగ్గా సాయం తెచ్చుకోగలం' అని టీడీపీ ఎంపీ ఒకరు చెప్పారు. కేంద్ర నిధులు, పథకాలు, ఇతర అంశాల పరిష్కారంలో కేంద్ర అధికారుల పాత్ర చాలా కీలకం. సాధారణంగా వీరు దక్షిణాది రాష్ట్రాలను పట్టించుకోరు. కానీ... కేంద్రంతో సాన్నిహిత్యం ఉన్న రాష్ట్రాలకు మాత్రం ప్రాధాన్యమిస్తుంటారు. ప్రతిదీ ప్రధాని లేదా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ స్థాయిలోనే పరిష్కరిస్తారు. ఇప్పుడు... కేంద్రంలో తెలుగుదేశానికి మరోసారి ప్రాధాన్యం దక్కింది. ఈ నేపథ్యంలో నిధులు, బకాయిల విడుదల, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, నిబంధనల్లో వెసులుబాటు, విన్నపాలపై స్పందించే తీరు... అన్నీ మారుతాయి. గతంలో ఇలాగే జరిగింది. ఇప్పుడూ అలాగే జరగనుందని అధికార వర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి.

కేంద్ర బిందువుగా చంద్రబాబు...

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత జాతీయ రాజకీయాల్లో మరో సారి చంద్రబాబు నాయుడు ప్రాభవం స్పష్టంగా కనపడింది. శుక్రవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నరేంద్రమోదీ పక్కనే కూర్చున్న చంద్రబాబు మొత్తం ఎన్డీయే నేతలందరికీ కేంద్ర బిందువుగా వ్యవహరించారు. సమావేశం జరుగుతున్నప్పుడు మోదీ పలుసార్లు చంద్రబాబుతో మాట్లాడుతూ ఉండడం, ఇరువురూ చలోక్తులు విసురుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ దృశ్యాలు 1999 లోక్‌సభ ఎన్నికల తర్వాత చంద్రబాబుకూ, అప్పటి ప్రధాని వాజపేయికీ మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేశాయి. నిజానికి 1996లో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా చంద్రబాబు కేంద్రంలో 13 పార్టీల సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. తొలుత దేవెగౌడ , తర్వాత ఐకే గుజ్రాల్‌ను ప్రధానమంత్రులుగా నియమించడంలో చంద్రబాబు ప్రమేయం కీలకం. ఏపీ భవన్‌లోని ఆయన ఛాంబర్‌లోనే యునైటెడ్ ఫ్రంట్ సమావేశాలు జరిగాయి. యునైటెడ్ ఫ్రంట్ కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకల్పనలో కూడా ఆయన పాత్ర ఉన్నది. ఆ తర్వాత 1999 లోక్‌సభ ఎన్నికల్లో చంద్రబాబు భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి బలమైన మద్దతు నిచ్చారు. ఈ సమయంలోనే జాతీయ స్థాయిలో ఆయన కీలక రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈ ఎన్నికల్లో బీజేపీ-తెలుగుదేశం కలిసి పోటీ చేసి 36 ఎంపీ స్థానాలను గెలుచుకున్నాయి. 29మంది ఎంపీలున్నప్పటికీ... చంద్రబాబు అంశాల ప్రాతిపదికన మాత్రమే మద్దతు నిచ్చారు. వాజపేయి 8 కేబినెట్ పోస్టులను ఇవ్వజూపినప్పటికీ ఆయన అంగీకరించలేదు. లోక్‌సభ స్పీకర్ పదవి తీసుకునేందుకు మాత్రం అంగీకరించారు. అప్పట్లో రాష్ట్రపతిగా అబ్దుల్ కలామ్ నియామకం ఏకగ్రీవంగా జరగడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. టీడీపీ 2019లోనూ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి అయినప్పటికీ... ఇప్పుడున్న పరిస్థితులు వేరు. బీజేపీకి 240 సీట్లు మాత్రమే రావడంతో చంద్రబాబు మద్దతు కీలకంగా మారింది. దీంతో వాజపేయి ప్రభుత్వంలో మాదిరి చంద్రబాబు మరోసారి జాతీయ రాజకీయాల్లో బలమైన పాత్ర పోషించి రాష్ట్ర ప్రయోజనాలు నెరవేర్చుకునే అవకాశం ఏర్పడింది.

కొలిక్కి వచ్చిన స్థానికత!

» ఒకటి, రెండు రోజుల్లో జీవో విడుదల

» ఎంబీబీఎస్ అడ్మిషన్లపై వైద్యశాఖ కసరత్తు

» 280 వైద్య విద్య సీట్లు.. తెలంగాణ విద్యార్థులకే

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో వైద్య విద్య ప్రవేశాల కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియలో కీలకమైన స్థానికత అంశాన్ని కొలిక్కి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించిన జీవోను ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇప్పటిదాకా ఇంజనీరింగ్, మెడికల్ అడ్మిషన్లలో 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ సీట్లు ఏపీ విద్యార్థులకు దక్కేవి. అదేతీరులో ఏపీలోని ఉన్నత విద్యాసంస్థల్లో తెలంగాణ విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉండేది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటైన కొత్త మెడికల్ కాలేజీల్లో 15శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటాను గత బీఆర్ఎస్ సర్కారు రద్దు చేసింది. కేవలం విభజన సమయానికి ఉన్న మెడికల్ కాలేజీల్లోని సీట్లకే ఆ 15శాతం కోటా వర్తిస్తుందని జీవో తీసుకువచ్చింది. దీనిపై కొందరు ఏపీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగానే తీర్పు వచ్చింది. దాంతో పాత మెడికల్ కాలేజీల్లోని సీట్లకే 15శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా ఇప్పటి వరకూ వర్తించింది. కాగా, విభజన చట్టంలోని పదేళ్ల గడువు ఈ నెల 2వ తేదీన ముగిసిన నేపథ్యంలో ఇకపై రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ఉమ్మడి ప్రవేశాలకు అవకాశం ఉండదు. ఈ మేరకు స్థానికులు ఎవరన్న అంశంపై సర్కారు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన జీవో ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేసేందుకు వైద్య శాఖ సిద్ధమవుతోంది. అయితే, ఏ ప్రాతిపదికన స్థానికతను నిర్ధారించారన్న అంశాలు మాత్రం ఇంకా బయటకు రాలేదు. మొత్తంగా 280 సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కుతాయని వెల్లడించాయి.

హెల్త్ వర్సిటీ వీసీ పోస్టుకు నోటిఫికేషన్

వైద్య విద్య ప్రవేశాలకు సమయం దగ్గర పడటంతో హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పోస్టు భర్తీ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత హెల్త్ వర్సిటీ వీసీ పోస్టు కోసం నోటిఫికేషన్ జారీ చేయడం ఇదే తొలిసారి. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పల్నాడు వైసీపీ నాయకుల మకాం!

» అరెస్టు భయంతో బంధువుల ఇళ్లకు...

నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చూసిన వైసీపీ నేతలు తెలంగాణకు మకాం మార్చారు. ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ సరిహద్దులోని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కృష్ణపట్టె గ్రామాలు, సమీప పట్టణాల్లో తిష్టవేశారు. ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో గొడవలు, ఘర్షణలు జరగడం, గ్రామాల్లో పరస్పర దాడుల నేపథ్యంలో అక్కడ 144 సెక్షన్ అమల్లో ఉంది. పలువురు నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు, రౌడీ షీట్లు కూడా ఉన్నాయి. దీంతో తాము అక్కడే ఉంటే పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో పాటు, ప్రత్యర్థులు దాడిచేసే అవకాశం ఉండటంతో కృష్ణానది దాటి తెలంగాణలోని సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఉంటున్నారు. అలాగే మిర్యాలగూడ, హుజూర్‌నగర్, నాగార్జున సాగర్, దేవరకొండ, మఠంపల్లి ప్రాంతాల్లోని లాడ్జిల్లో తలదాచుకుంటున్నారు. ప్రధానంగా మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని పిన్నెల్లి, బ్రాహ్మణపల్లి, మాచవరం, తంగేడ, దాచేపల్లి, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, మాచర్ల టౌన్, పెదగార్లపాడు, కేశానుపల్లి, మాదినపాడు, ధైద, ఫుల్లారెడ్డిగూడెం తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లో రెండు రోజుల నుంచి మకాం వేశారు. తర్వాత మిర్యాలగూడ, హుజూర్‌నగర్, మఠంపల్లిలోని లాడ్జిలకు చేరారు. పల్నాడులో పరిస్థితి సద్దుమణిగాక సొంత ఊళ్లకు తిరిగి వెళ్లాలని, లేకపోతే హైదరాబాద్ వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

తెలంగాణలో సాగునీరు, జల వనరుల ప్రభుత్వ సలహాదారుగా ఆదిత్యనాథ్ దాస్

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సీఎస్ ఆదిత్యనాథ్ దాస్‌ను నీటిపారుదల, జల వనరుల సలహాదారుగా తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి ఏపీలో ఆదిత్యనాథ్ తెలంగాణ ప్రాజెక్టులకు ఇన్‌చార్జిగా ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం దాస్‌ను ఏపీకి కేటాయించారు.

వైసీపీ మూకల దాడిలో గాయపడిన
టీడీపీ కార్యకర్త మృతి

» ఆస్పత్రిలో 4 రోజులపాటు మృత్యువుతో ఖాసిం పోరాటం


షేక్ ఖాసిం(ఫైల్)

దుగ్గిరాల, జూన్ 7: వైసీపీ ముష్కరుల చేతిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన షేక్ ఖాసిం(22) శుక్రవారం కన్నుమూశారు. ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థులు విజయం సాధిస్తుండటంతో ఖాసిం, తన స్నేహితుడితో కలిసి బైక్‌పై రేవేంద్రపాడు వెళ్తుండగా తుమ్మపూడి చర్చి సమీపంలో వైసీపీకి చెందిన కమల్ మరో ముగ్గురు అడ్డుకుని క్రికెట్ బ్యాట్‌తో దారుణంగా కొట్టారు. విషయం తెలిసి అక్కడకు వచ్చిన ఎస్ఐ మహీంద్ర.. ఖాసింను మంగళగిరి ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. నాలుగురోజులు మృత్యువు తో పోరాడిన ఖాసీం శుక్రవారం మృతిచెందాడు. తమ బిడ్డను వైసీపీ మూక లు పొట్టన పెట్టుకున్నాయంటూ తల్లిమెహరూన్ కన్నీటి పర్యంతమయ్యారు.

టీడీపీ కుటుంబంపై వైసీపీ శ్రేణుల దాడి

» విజయవాడలో చికిత్స పొందుతున్న బాధితులు

మునునూరు, జూన్ 7: ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేటలో పాతకక్షలు పురివిప్పాయి. వైసీపీ ఓటమిని జీర్ణించుకోలేకపోవడంతో పాటు పంచాయతీ స్థల అక్రమణను అడ్డుకున్నారని వైసీపీకి చెందిన కొంతమంది గురువారం రాత్రి టీడీపీ సానుభూతిపరుడి కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలో వైసీపీకి చెందిన ఉప్పే పిచ్చేశ్వరరావు, ఉప్పే సుబ్బారావు పంచాయతీకి చెందిన స్థలాన్ని అక్రమించుకుని కొన్ని నెలల క్రితం నూతనంగా ఇంటి నిర్మాణాన్ని చేస్తుండగా, టీడీపీ నేత ఉప్పే శివనాగాంజనేయులు అడ్డుకున్నాడు. దీనిపై ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. మరోవైపు ఎన్నికల్లో వైసీపీ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీకి చెందిన ఉప్పే శ్రీనివాసరావు, ఉప్పే పెదకాపు, ఉప్పే రామకృష్ణ, ఉప్పే గోపాలంజనేయులు, ఉప్పే పిచ్చేశ్వరావు, ఉప్పే మారేశ్వరావు, ఉప్పే సుబ్బారావు గురువారం రాత్రి రహదారిపై ఉన్న టీడీపీ నేత ఉప్పే శివనాగాంజనేయులపై కర్రలు, కత్తులతో దాడి చేశారు. అడ్డుకోబోయిన అతడి భార్య సత్యవతి, తండ్రి సత్యనారాయణ, తమ్ముడు శివరామకృష్ణలపై కూడా దాడిచేయగా.. ఆ నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం బాధితులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల వాంగ్మూలం మేరకు ఏడుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

రెచ్చగొట్టి.. ఆపై కత్తితో దాడి

» తెనాలిలో వైసీపీ మూకల బరితెగింపు

తెనాలి(మారీసుపేట), జూన్ 7: జగన్‌పై ఒంటరిగా పోటీ చేయలేక జనసేన, బీజేపీలతో పొత్తుపెట్టుకుని ఓటింగ్ మిషన్లను ట్యాంపరింగ్ చేసి గెలిచిన సన్నాసులు అంటూ టీడీపీ వారిని రెచ్చగొట్టారు. కత్తితో దాడికి తెగబడ్డారు. ఈ ఘనటతో తెనాలిలో గురువారం రాత్రి అలజడి రేగింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. స్థానిక మారీసుపేటలోని 22వ వార్డులో గురువారం సాయంత్రం షేక్ గౌస్, షేక్ సుభాని స్నేహితులతో కలిసి టీడీపీ, జనసేన విజయోత్సవాలు జరుపుకొన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన వైసీపీ కౌన్సిలర్ దుబాయి బాబు టీడీపీ వారిని రెచ్చగొట్టేలా అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. దీంతో అక్కడున్నవారు అతడ్ని నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో కౌన్సిలర్ దుబాయిబాబు అనుచరులను తీసుకువచ్చి తుప్పుపట్టిన కత్తితో టీడీపీ వారిపై దాడికి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో షేక్ గౌస్ గాయపడ్డాడు. కాగా, ఘటనపై పోలీసులు ఫిర్యాదు చేస్తే తీసుకోకుండా వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ స్టేషన్ ఎదుట అర్ధరాత్రి దర్నా చేశారు. దీంతో కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.


విజయవాడలో వంశీ ఇంటి వద్ద సీఆర్పీఎఫ్ బందోబస్తు


వంశీ ఇంటి వద్ద దాడులకు పాల్పడుతున్న దృశ్యం

కవ్వింపులు.. దాడులు!

» బెజవాడ, గుడివాడల్లో హైటెన్షన్
» వంశీ, కొడాలి ఇళ్లపై రాళ్లు, కోడి గుడ్లదాడి.. తీవ్ర ఉద్రిక్తత
» విజయవాడలో యార్లగడ్డ అనుచరులపై పోలీసుల లాఠీచార్జి.. పలువురికి గాయాలు
» పోలీసు వాహనాల అద్దాలు ధ్వంసం
» కార్యకర్తల అరెస్టుపై వెంకట్రావు ఆగ్రహం
» వంశీ అనుచరులే రెచ్చగొట్టారు: యార్లగడ్డ
» కొడాలి నాని రాజకీయ సన్యాసం శపథం నిలబెట్టుకోవాలని తెలుగుయువత పట్టు


కొడాని నాని ఇంటిపైకి కోడిగుడ్లు విసురుతున్న దృశ్యం

విజయవాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి)/గుడివాడ: ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన వైసీపీ నాయకులు వల్లభనేని వంశీ, కొడాలి నానీలు చేసిన కవ్వింపు వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారి ఇళ్లపై దాడులకు దిగారు. కృష్ణా జిల్లా గన్నవరంలో ప్రత్యర్థులుగా ఉన్న వల్లభనేని వంశీమోహన్, యార్లగడ్డ వెంకట్రావు మధ్య ఉన్న రాజకీయ విభేదాల ప్రభావం విజయవాడ నగరంపై పడింది. విజయవాడ గాయత్రీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నివాసం ఉంటున్నారు. వైసీపీలో ఉన్న వంశీ అధికారంలో ఉన్నప్పుడు పలుమార్లు చంద్రబాబు, లోకేశ్‌లపై నోరుజారారు. అదేవిధంగా యార్లగడ్డ అనుచరులపై కవ్వింపు చర్యలకు దిగారు. ఈ నేపథ్యంలో శుక్రవారం యార్లగడ్డ అనుచరులు వంశీ ఉన్న అపార్ట్‌మెంట్‌పై దాడికి దిగి రాళ్లు రువ్వారు. పోలీసులు అక్కడికి చేరుకుని అపార్టుమెంట్‌కు ఉన్న మూడు మార్గాల్లో బారికేడ్లు పెట్టి, ఇనుపకంచెలు అడ్డంగా పెట్టారు. ఈ సమయంలో ఇంట్లోనే వంశీని వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. కానీ, ఆయన మాత్రం వెళ్లేందుకు ససేమిరా అన్నారు. ఇక, కాసేపటికి గన్నవరం నుంచి మరింత మంది యార్లగడ్డ అనుచరులు రావడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను ప్రతిఘటించిన ఆందోళనకారులు ఏసీపీ జీపు, టాటా ఏస్ వాహనాలపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో సీఆర్పీఎఫ్ బలగాలు రంగంలోకి దిగి లాఠీచార్జి చేశారు. యార్లగడ్డ అనుచరుడు సునీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లాఠీచార్జి విషయాన్ని తెలుసుకున్న యార్లగడ్డ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత ఇక్కడి నుంచి ఆయన మాచవరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న సునీల్‌ను తీసుకుని వచ్చారు. అనంతరం పోలీసుల తీరుకు వ్యతిరేకంగా ధర్నా చేశారు. వంశీ ఇంటి వద్ద జరిగిన పరిణామాలతో గుణదలలోని వైసీపీ నేత దేవినేని అవినాశ్ ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుడివాడలో..

ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని విసిరిన సవాల్‌ను నిలబెట్టుకోవాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. గుడివాడలో కొడాలి నాని ఇంటి ముట్టడికి శుక్రవారం తెలుగు యువత ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. తెలుగు యువత రాష్ట్ర నాయకుడు పొట్లూరి దర్శిత్ ఆధ్వర్యంలో నాని ఇంటిపై కోడిగుడ్లను విసురుతూ.. వైసీపీ గుర్తు ఫ్యాన్‌ను నేలకేసి కొట్టి నిరసన తెలిపారు. తెలుగు యువత నేతలు వెంటనే నిరసన ఆపి వెళ్లి పోవాలని పోలీసులు హెచ్చరించారు. మాట వినకుంటే కాల్చి పడేస్తానని ఒన్‌టౌన్ సీఐ కె. ఇంద్ర శ్రీనివాసరావు బెదిరించారు. సీఐ వ్యాఖ్యలపై దర్శిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్చాలంటూ ఎదురొడ్డి సవాల్ విసిరారు. వైసీపీ నేతలు దాష్టీకాలు చేసినప్పుడు పోలీసులు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఇంతలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ సత్యసాయి అక్కడి చేరుకోవడంతో దర్శిత్ పోలీసు వలయాన్ని ఛేదించి నాని ఇంటి వైపు వెళ్లారు. డీఎస్పీ శ్రీకాంత్ స్వయంగా రంగంలోకి దిగి దర్శిత్, తెలుగు యువత నాయకులతో మాట్లాడటంతో నిరసన విరమించారు. ఇంత జరుగుతున్నా కొడాలి నాని ఇంట్లో ఉండి బయటకు రాలేదు. అనంతరం పొట్లూరి దర్శిత్ విలేకర్లతో మాట్లాడుతూ.. గుడివాడలో కొడాలి నానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు.

వంశీ అనుచరులే రెచ్చగొట్టారు: యార్లగడ్డ

వైసీపీ నేత వల్లభనేని వంశీ అనుచరులు తమవారిని రెచ్చగొట్టడం వల్లే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ పటమటలోని తన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడారు. వంశీ అనుచరులు తన అనుచరులను అసభ్యకరంగా దూషించడంతో ఘర్షణ మొదలైందన్నారు.

మహాకవి శ్రీశ్రీ కుమారుడు కన్నుమూత

» అనారోగ్యంతో అమెరికాలో మృతి



గుంటూరు(తూర్పు), జూన్ 7: మహాకవి శ్రీశ్రీ కుమారుడు శ్రీరంగం వెంకటరమణ(59) ఆనారోగ్య కారణాలతో అమెరికాలో చనిపోయారు. శుక్రవారం ఈమేరకు ఆయన బంధువు రమణ యశస్వి గుంటూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీ రంగం వెంకటరమణ కుటుంబం పాతికేళ్ల క్రితం అమెరికాలో స్థిరపడింది. ఫైజర్ కంపెనీలో వెంకటరమణ పరిశోధన విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడికి శ్రీనివాసరావు(శ్రీశ్రీ) అని, కుమార్తెకు 'కవిత' పేరును పెట్టుకున్నారు. వెంకటరమణ కుటుంబానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచంద్, పలువురు సాహితీవేత్తలు సానుభూతి తెలిపారు.

కమీషన్ల కోసమే బడా సంస్థలకు బిల్లులు

» ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన బాయ్, సబ్‌కా
» ఆధారాలతో గవర్నర్‌కు ఇంజనీరింగ్ కాంట్రాక్టర్ల ఫిర్యాదు
» మాజీ సీఎస్ జవహర్, రావత్, కేవీవీ, లక్ష్మీశలపై విచారణకు వినతి

విజయవాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలను కాలరాసి, సొంత వారికోసం పాతిక వేల కోట్ల రూపాయల మేర అక్రమంగా బిల్లులు చెల్లించారని, కమీషన్ల కోసం బడా సంస్థలకు చెల్లించారని, వీటిపై సమగ్ర విచారణ జరపాలంటూ ఇంజనీరింగ్ కాంట్రాక్టర్లు శుక్రవారం విజిలెన్స్, ఏసీబీలకు ఫిర్యాదు చేశారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్), సబ్‌కా, జేజేఎం వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. దీంతో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కూడా ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన కేఎస్ జవహర్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ ఫిర్యాదుపై బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంజనీరింగ్ శాఖలైన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, గృహ నిర్మాణ శాఖల్లో కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ శాఖల పరిధిలో దాదాపు రూ.25 వేల కోట్ల మేర సొంత వారికి చెల్లించారని తెలిపారు. ఫిఫో నిబంధనలను తుంగలో తొక్కి, ఎంపిక చేసిన 11 కాంట్రాక్టు సంస్థలకే ఈ బిల్లులు చెల్లించారన్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా లక్ష్మీశ పనిచేస్తున్న కాలంలో అడ్డగోలుగా బిల్లు చెల్లింపులు జరిగాయని తెలిపారు. చిన్న, మధ్య కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులురాక ఆర్థికంగా చితికిపోయారని పేర్కొన్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిని కలిసి.. రాష్ట్ర ఏసీబీ విభాగం, ఇంటెలిజెన్స్ విభాగాలు తక్షణం రంగంలోకి దిగి విచారణ జరపాల్సిందిగా డిమాండ్ చేశారు.

పర్యాటకశాఖలో
ఫైళ్ల మాయంపై విచారణ

» కార్యాలయాలకు వెళ్లి నివేదిక కోరిన రజత్ భార్గవ

విజయవాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖలో ఫైళ్ల మాయం ఉదంతంపై రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ విచారణకు ఆదేశించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పర్యాటక శాఖ ఫైల్స్ మాయం' కథనంపై ఆయన స్పందించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ), ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)ల కార్యాలయాలకు వెళ్లి పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఈడీ(అడ్మినిస్ట్రేషన్)ని ఆదేశించారు. కాగా, పర్యాటక శాఖకు చెందిన ఎలాంటి ఫైల్స్ మాయం కాలేదని ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆయన స్పందించారు. ఆ సమయంలో తాను మధ్యప్రదేశ్‌లో ఎన్నికల విధుల్లో ఉన్నానని, ఆఫీసు సిబ్బంది ఎవరూ తనను కలవలేదని తెలిపారు. ఫైల్స్ మాయం అనేది లేదని చెప్పారు.

ఏయూకు ముఖం చాటేసిన వీసీ!

» కూటమి గెలిచినప్పటి నుంచి ప్రసాదరెడ్డి మాయం
» వైసీపీ హయాంలో ఇష్టానుసారం వ్యవహరించారనే ఆరోపణలు



విశాఖపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించిన ఉప కులపతి పీవీజీడీ ప్రసాదరెడ్డి మూడు రోజుల నుంచి క్యాంపస్‌లో కనిపించడం లేదు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి ఆయన ఎక్కడికి వెళ్లారో సమాచారం లేదు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల ప్రసాదరెడ్డి నియంత తరహాలో పాలన సాగించారన్న విమర్శలు ఉన్నాయి. ఒకప్పుడు విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఎప్పుడు కావాలంటే అప్పుడు వీసీని కలిసి తమ సమస్యలు చెప్పుకునేవారు. కానీ, ఈ ఐదేళ్లలో ఎప్పుడూ ఆయన ఎప్పుడూ అలాంటి అవకాశం ఇవ్వలేదు. పైపెచ్చు మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి విద్యార్థుల ను పరిపాలనా భవనం దరిదాపుల్లోకి కూడా రాకుం డా చేశారు. అదే సమయంలో ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు, నియామకా లు వివాదాస్పదమయ్యాయి. అస్మదీయులకు అడ్డగోలుగా పదవులు కట్టబెట్టారు. ఐదేళ్లుగా వర్సిటీలో ప్రసాదరెడ్డి తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలపై టీడీపీ, జనసేన నాయకులు పోరాడారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రసాదరెడ్డి అరాచకాలపై దృష్టిసారిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కూడా స్పష్టం చేశారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ప్రసాదరెడ్డిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనన్న చర్చ జోరందుకుంది. ఈ నేపథ్యంలో ఆయన ఎక్కడున్నారంటూ పలువురు ఆరా తీయగా... మూడు రోజుల నుంచి వర్సిటీకి రావడం లేదని తెలిసింది. ఒక దశలో ఆయన రాజీనామా చేశారన్న ప్రచారం కూడా సాగింది. కానీ, ప్రసాదరెడ్డి రాజీనామా చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖం చెల్లకే వర్సిటీకి రావడం లేదని పేర్కొంటున్నారు.

విదేశాలకు వెళ్లిపోయిన ఓఎస్‌డీ

ఏయూలో రిజిస్ట్రార్‌గా పనిచేసి, ఆ తర్వాత ఓఎస్‌డీగా నియమితులైన ప్రొఫెసర్ కృష్ణమోహన్ కూడా ప్రస్తుతం సెలవులో ఉన్నారు. ఎన్నికల అనంతరం ఆయన రెండు నెలలు సెలవు పెట్టి విదేశాలకు వెళ్లినట్టు చెబుతున్నారు. ఆయన ఎప్పుడొస్తారన్న దానిపై స్పష్టత లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీలో చక్రం తిప్పిన ఇద్దరు అధికారులు... కూటమి గెలవగానే కనిపించకపోవడం గమనార్హం. ఇదిలావుండగా వర్సిటీలో ఐదేళ్లుగా వీసీ నియంతృత్వ పోకడలతో ఇబ్బందిపడిన విద్యార్థి సంఘాల నేతలు కూటమి విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. థియేటర్ ఆర్ట్స్ డిపార్టుమెంట్‌లో పనిచేసే ఒక ఉద్యోగి ఏయూలోని గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి.. వర్సిటీకి పట్టిన శని విరగడైందంటూ ఆనందం వ్యక్తంచేశారు.

నేడు, రేపు వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలతో పాటు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న 48గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శని, ఆదివారాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, శుక్రవారం రాష్ట్రంలో అనేక చోట్ల వర్షాలు పడ్డాయి. బండి ఆత్మకూరులో 50, గోస్పాడులో 46.2, అమరావతిలో 44.5, ఆళ్లగడ్డలో 43.7, పత్తికొండలో 43.5, బత్తలపల్లిలో 41, గన్నవరంలో 24, కడపలో 23 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 2, మూడు రోజుల్లో కోస్తాలో మిగిలిన ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరిస్తాయని పేర్కొంది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

» ఏడుగురు మావోయిస్టుల మృతి

చర్ల, జూన్ 7: ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణపూర్ జిల్లాలోని ఓర్చా అడవుల్లో శుక్రవారం సాయంత్రం నక్సల్స్ పోలీసులకు మధ్య చోటుచేసుకున్న ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందగా, ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. ఓర్చా అడవుల్లో మావోయిస్టులున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో ఉదయం నారాయణపూర్ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, కొండగావ్, దంతెవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన ఇండో-టిబెటన్ 45వ బెటాలియన్ బలగాలు సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయి. సాయంత్రానికి నక్సల్స్ ఉన్న ప్రాంతానికి పోలీసులు చేరగా.. ఇరువురి మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారని.. ముగ్గురు డీఆర్‌డీ సిబ్బంది గాయపడ్డారని వెల్లడించారు. ఘటనా స్థలంలో తుపాకులు, మందుగుండు సామగ్రి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 124 మంది మావోయిస్టులు మృతి చెందారు.

వర్సిటీల్లో 'విగ్రహ' రాజకీయాలు!

» నిబంధనలకు విరుద్ధంగా ఎడాపెడా వైఎస్ విగ్రహాల ఏర్పాటు
» జగన్ భక్తుల అత్యుత్సాహం
» తాజాగా ఎస్కేయూలో వైఎస్ విగ్రహం తొలగింపు
» వీఎస్‌యూలో శిలాఫలకాలు కూడా..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


ఎస్కేయూలో వైఎస్ విగ్రహాన్ని తొలగిస్తున్నదృశ్యం

జగన్ ఏలుబడిలో విద్యాలయాలు సైతం రాజకీయాలతో అల్లాడిపోయాయి. ఆయన మెప్పు పొందేందుకు కొన్ని విశ్వవిద్యాలయాల వీసీలు, ఉన్నతాధికారులు స్వామిభక్తి ప్రదర్శించారు. నిబంధనలు తుంగలో తొక్కి... జగన్ తండ్రి, మాజీ సీఎం వైఎస్ విగ్రహాలను వర్సిటీ ప్రాంగణాల్లో ఎడాపెడా ఏర్పాటు చేశారు. విద్యార్థి సంఘాలు నిరసనలు తెలిపినా పట్టించుకోలేదు. జగన్ ఏకంగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరుమార్చేసి తన తండ్రి పేరు పెట్టుకున్నారు. తర్వాత ఆ వర్సిటీ వీసీ కోరుకొండ బాబ్జీ నిరుడు జూన్ 22న వర్సిటీ ప్రాంగణంలో వైఎస్ విగ్రహాన్ని గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభించారు. తాజాగా ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే హెల్త్ వర్సిటీ భవనానికి వైఎస్ఆర్ పేరును టీడీపీ అభిమానులు తొలగించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో రూ.5.80 లక్షల విశ్వవిద్యాలయ నిధులతో వైఎస్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కానీ ఆవిష్కరించలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందనగా విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేసినా వాయిదా వేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 2009లోనే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వైఎస్ విగ్రహాన్ని ప్రధాన గేటు వద్ద ఏర్పాటుచేశారు. అయితే నిరుడు చివర్లో వీసీ ప్రసాదరెడ్డి దాని స్థానంలో కాంస్య విగ్రహాన్ని పెట్టించారు. ఇందుకోసం రెండు వర్సిటీ అనుబంధ కాలేజీల నుంచి నిధులు సేకరించినట్లు సమాచారం. కడపలో యోగివేమన వర్సిటీ పాలనా భవనం ముందు వేమన విగ్రహాన్ని 2014లో ఏర్పాటు చేశారు. జగన్ సీఎం అయ్యాక ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తీసివేసి వైఎస్ విగ్రహాన్ని పెట్టారు. 2019 డిసెంబర్లో వీసీ రాజశేఖర్‌నాగార్జున వర్సిటీలో వైఎస్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ(ఎస్కే) వర్సిటీలో అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థి సంఘాలు అభ్యంతరం తెలిపినా వీసీ రామకృష్ణారెడ్డి పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో.. ఆ విగ్రహాన్ని వర్సిటీ అధికారులు శుక్రవారం తొలగించారు. నెల్లూరు జిల్లా విక్రమ సింహపురి వర్సిటీ ప్రాంగణంలో నిర్మించిన పరిపాలనా భవనానికి వైఎస్ పేరు పెట్టారు. వర్సిటీ వీసీ సుందరవల్లి(జగన్ బంధువు), రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి సమక్షంలో అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఆ సమయంలోనే భవనంలో వైఎస్ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఇప్పుడు టీడీపీ నాయకులు తొలగించారు.

పోదుర్లే కాస్త ఆగండి!

(మొదటి పేజీ తరువాయి)

వారిని కూడా ఆపేస్తున్నారు. 'పోదుర్లే కాస్త ఆగండి' అంటూ గేట్లు మూసేస్తున్నారు. సీఐడీ చీఫ్‌గా అడ్డగోలు అరెస్టులు సాగించిన అధికారి సంజయ్. ముఖ్యమంత్రిగా జగన్ రాజీనామా చేసిన వెంటనే, సంజయ్ విదేశాలకు వెళ్లిపోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి యథావిధిగా ఆయనకు సహకరించారు. సంజయ్‌కు సెలవు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ జీఏడీ అధికారులు ఆయన సెలవును రద్దు చేశారు. ఈ క్రమంలో చంద్రబాబును కలిసి కాస్త ప్రసన్నం చేసుకోవాలన్న సంజయ్ ఆలోచనకు కూడా బ్రేక్ పడింది. చంద్రబాబు నివాసంలోకి ఎంట్రీ దొరకలేదు.

హతవిధీ....

ప్రభుత్వ ఆదాయం పెంచేందుకు స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అస్మదీయ ఐఆర్ఎస్ అధికారి చిలకల రాజేశ్వరరెడ్డిని తీసుకొచ్చి ఆ విభాగాన్ని జగన్ అప్పగించారు. 2020లో నియమితులైన రాజేశ్వరరెడ్డి అన్ని పనులు మానుకుని, టీడీపీ నేతల వ్యాపారాలపై పడ్డారు. ఎన్నికలకు కొద్ది కాలం ముందు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబ సభ్యులకు చెందిన వ్యాపారాలపై దాడులు చేయించారు. ఇదే సమయంలో కేంద్రం డిప్యుటేషన్‌పై కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. ఐదేళ్ల డిప్యుటేషన్‌ను మూడేళ్లకు కుదించింది. దీంతో డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన ఆయనను తిరిగి వెనక్కి పంపించాలని కేంద్రం.. జగన్ సర్కారుకు లేఖ రాసింది. అయితే, ఆయన మాత్రం 'నేను పోను. ఇక్కడే ఉంటాన'ని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ మెట్లు ఎక్కి.. రిలీవ్ ఆర్డర్‌ను పక్కన పెట్టేలా చేసుకున్నారు. కానీ ప్రభుత్వం మారబోతుందన్న విషయాన్ని గ్రహించారు. అంతే.. క్యాట్‌లో తాను వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. వెంటనే తనను రిలీవ్ చేయాలని కోరగా, అప్పటి సీఎస్ జవహర్ రెడ్డి ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ రిలీవ్ చేసేశారు. ఇప్పుడు రాజేశ్వరరెడ్డిని వెనక్కి రప్పిస్తున్నారు. ఈ మేరకు జీఏడీ ఉత్తర్వులు జారీ చేసింది. అదే కోవలోకి చేరే ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా విజయకుమార్ రెడ్డి వైసీపీ కార్యకర్తలాగే పనిచేశారు. ప్రభుత్వం మారగానే.. వెళ్లిపోవాలని ప్రయత్నించారు. కానీ, ఆయనను జీఏడీ అధికారులు ఆపేశారు.

మరో 2,000 కోట్ల అప్పు

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు నుంచి రూ.2,000 కోట్ల అప్పు తెచ్చేందుకు సిద్ధమవుతోంది. 11వ తేదీన ఆర్‌బీఐ నిర్వహించే వేలంలో రూ.2,000 కోట్ల అప్పు తీసుకొస్తారు. ఏప్రిల్ నుంచి జూన్ 4వ తేదీ వరకు జగన్ రూ.25,000 కోట్ల అప్పులు తెచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు వాడుకోవడానికి రూ.47,000 కోట్ల అప్పులకు కేంద్రం అనుమతిచ్చింది. సగానికిపైగా అప్పులను జగన్ కేవలం రెండు నెలల్లోనే తెచ్చి వాడేశారు. ఇంకో 4 నెలలకు గాను ఇంకా రూ.22,000 కోట్ల అప్పుల పరిమితి మాత్రమే మిగిలి ఉంది.


సీఎస్ నీరబ్‌ను కలిసిన ఏపీ జేఏసీ అమరావతి నాయకులు

సీఎస్‌గా నీరబ్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం కల్పించిన చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సీఎస్‌లు ద్వివేది, రజత్ భార్గవ, విజయానంద్, పలువురు అధికారులు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని నీరబ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ ప్రస్థానం ఇలా...

బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన నీరబ్ కుమార్ ప్రసాద్ 1988లో పశ్చిమ గోదావరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ)గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1990లో తూర్పుగోదావరి సబ్ కలెక్టర్‌గా పని చేశారు. 1996లో ఖమ్మం కలెక్టర్‌గా, 1998లో చిత్తూరు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 1999లో యువజన సంక్షేమశాఖ డైరెక్టర్, శాప్ ఎండీగా పనిచేసి 2000లో కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. 2005లో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీగా, 2007లో పరిశ్రమలశాఖ కమిషనర్‌గా, 2009లో మత్స్యశాఖ కమిషనర్‌గా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో జీఏడీ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2017లో కార్మిక ఉపాధి కల్పన శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2019 నవంబరు నుంచి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్స్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ)గా బాధ్యతలు నిర్వర్తించారు. 2022 ఫిబ్రవరి నుంచి రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు.

కొత్త సీఎస్ నీరబ్‌ను కలిసిన ఉద్యోగ నేతలు

విజయవాడ(ఆంధ్రజ్యోతి), వన్‌టౌన్, జూన్ 7: రాష్ట్ర చీఫ్ సెక్రటరీ (సీఎస్)గా బాధ్యతలు స్వీకరించిన నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను ఏపీఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, సీహెచ్ పురుషోత్తం నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుతో పాటు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి జేఏసీ స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకుడు కె.రమేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామిశెట్టి వెంకట రాజేష్, మునిసిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దొప్పలపూడి ఈశ్వర్, ఏపీజేఏసీ మహిళా చైర్‌పర్సన్ పారే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఈవో మీనాకు అభినందనలు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనాకు, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎంఎన్ హరీంద్ర ప్రసాద్‌లను శుక్రవారం ఏపీ జేఏసీ అమరావతి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించి అత్యధికంగా 82 శాతం మేరకు పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నందుకు అధికారులను ప్రశంసించారు. ఎన్నడూ లేని విధంగా 5.30 లక్షల పోస్టల్ బ్యాలెట్‌ల అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు, కె.రమేషకుమార్ తదితరులు మీనాను కలిసిన వారిలో ఉన్నారు.

ఉచితానికి బస్సులు చాలవు.. కొత్తవి కొనాలి: ఈయూ

విజయవాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొలువుతీరనున్న కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవని, కొత్తవి కొనాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, అధ్యక్షుడు జి.వి. నరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వానికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



మీటింగ్‌లకు ఏఐ అవతార్!

ఏఐ కాలంలో మరో కొత్త విషయం అనుభవంలోకి రాబోతోంది. అదేమిటంటే, వ్యక్తులకు బదులు ఏఐ అవతార్ పనులు చక్కబెట్టబోతోంది. జూమ్ మీటింగ్ వంటివాటికి ఏఐ అవతార్ హాజరవుతుందని జూమ్ సీఈఓ ఎరిక్ యువాన్ చెబుతున్నారు. సంబంధిత సాంకేతికత వాస్తవరూపం ధరించేందుకు అయిదారేళ్ళు పడుతుందని కూడా ఆయన తెలిపారు. 'ద వెర్జ్' మేగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇదే ఆచరణలోకి వస్తే కార్పొరేట్ టాస్క్‌లకు అనువుగా ఉంటుంది. మనిషి ఎక్కడున్నా, అర్జెంట్‌గా పిలిచే సమావేశాలకు తనకు బదులు అవతార్‌ను పంపుకోవచ్చు. అయితే ఎంత అభివృద్ధి జరిగినప్పటికీ అది మనిషి స్థానాన్ని ఏఐ ఆక్రమించుకోలేదని జూమ్ సీఈఓ తెలిపారు. అటు పని, ఇటు జీవితం మధ్య సమతుల్యానికి ఇలాంటి సాంకేతిక పురోగతి దోహదపడుతుందని చెప్పవచ్చు. జూమ్ విషయానికి వస్తే, ఏఐ పవర్డ్ ఫ్యూచర్‌తో ఏర్పడే గ్యాప్‌ని సరిదిద్దేవిధంగా సాంకేతికను అభివృద్ధి పర్చే పనిలోనే ఉంది. ఇలాంటివి కొంత ఉత్సుకతను కల్పిస్తున్నప్పటికీ భవిష్యత్తులో వీటితో జరిగే విపరిణామాలపైనా సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

న్యాయ సేవల్లో చాట్ జీపీటీ వద్దు

ఇటీవల ప్రతీదానికీ చాట్ జీపీటీ సేవలు వాడుకోవడం కామన్‌గా మారింది. అయితే న్యాయ సేవల కోసం చాట్ జీపీటీని ఉపయోగించవద్దని నిపుణులు చెబుతున్నారు. ఎందుకు వద్దంటున్నామో కూడా సాధికారికంగా వివరిస్తున్నారు. అసలు విషయానికి వెళ్ళే ముందు మరికొన్నింటిని తెలుసుకోవాలి. వాస్తవానికి ఒక సర్వే ప్రకారం 52 శాతం మంది మాత్రమే ప్రొఫెషనల్స్ నుంచి న్యాయ సేవలు అందుకుంటున్నారు. పదకొండు శాతం మంది తమ స్నేహితులు, బంధుమిత్రుల సలహాలు తీసుకుంటున్నారు. మిగిలిన వారికి న్యాయ సేవలు అందటం లేదు, నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. లా సొసైటీ, లీగల్ సర్వీసెస్ బోర్డు, యువగవ్ ఉమ్మడిగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం తేలింది. గడచిన నాలుగేళ్ళ కాలంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లీగల్ సమస్య ఎదురైంది. నిరుద్యోగం, ఫైనాన్స్, సంక్షేమం, ప్రయోజనం, వినియోగదారుల సమస్యలు లీగల్‌కు సంబంధించిన వాటిలో ముఖ్యమైనవిగా ఆ సర్వే తేల్చింది. అలాగే అందరికీ న్యాయ సహాయం ప్రొఫెషనల్స్ నుంచి తీసుకోవడం సాధ్యం కాదని కూడా తెలిపింది.



ఈ నేపథ్యంలోనే లీగల్ అంశాలకు సంబంధించి ఎక్కువ మంది ఇంటర్నెట్ సహకారం తీసుకుంటున్నారు. చాట్‌జీపీటీ, గూగుల్ బార్డ్, మైక్రోసాఫ్ట్ కోపైలెట్, క్లాడేని అడిగి తెలుసుకుంటున్నారు. ఈ టూల్స్ అన్నీ జనరేటివ్ ఏఐ పవర్‌ని కలిగి ఉంటున్నాయి. ప్రధానంగా ఈ చాట్‌బోట్స్ అందిస్తున్న న్యాయ సహాయంపై ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్లినికల్ లీగల్ ఎడ్యుకేషన్ ఒక స్టడీని ఇటీవల నిర్వహించింది. అడిగిన ప్రశ్న, ఇస్తున్న సమాధానం అవసరానికి తగ్గట్టు లేవని తేల్చింది. ముఖ్యంగా...

- సమాధానాలు అమెరికా న్యాయ చట్టాలకు లోబడి ఉంటాయి. అయితే ప్రశ్న అడిగిన వ్యక్తి తనుంటున్న ప్రదేశంలో అది వర్తిస్తుందనే భావిస్తారు. ఒక ప్రాంతానికి వేరే చోటుకు మధ్య తేడా ఉంటుందన్నది చాట్‌బోట్ తెలియజేయదు. యూకేలో ఇది మరింత క్లిష్టంగా ఉంటుంది. ఇంగ్లండ్ - వేల్స్, స్కాట్లాండ్ - నార్త్ ఐర్లాండ్ మధ్య తేడా ఉంటుంది. ఉదాహరణకు ఇంటి అద్దెకు సంబంధించే చట్టాలు వేర్వేరు. విడాకులు, సివిల్ భాగస్వామ్యంలోనూ ఇదే ఇబ్బంది.
- కాలక్రమంలో కొత్త చట్టాలను వివిధ దేశాలు రూపొందిస్తూ ఉంటాయి. ఉదాహరణకు ఇంగ్లండ్, వేల్స్‌లో 2002 ఏప్రిల్‌లో విడాకుల చట్టాన్ని మార్చారు. మన దేశంలోనూ గడచిన ఏడాది చట్టపరంగా కొన్ని మార్పులు చేశారు. అప్డేట్ అయిన చట్టాలను అనుసరించి ఇక్కడ సలహాలు ఉండవు.
- కుటుంబం, ఉద్యోగ సంబంధిత విషయాల్లో తప్పుడు సలహాలు ఇస్తూ ఉంటుంది. అవి మనల్ని తప్పుదోవ పట్టిస్తాయి. కొన్నింటిలో సలహాలు బాగుంటాయి. అయినప్పటికీ ఇంకా స్పందనలో గ్యాప్స్ అలానే ఉంటున్నాయి. కొన్ని సార్లు ముఖ్యమైన పాయింట్లు సమాధానంలో ఉండటం లేదు. చాలా బాగా రాసి ఉన్నప్పటికీ లీగల్ పాయింట్లు అందులో కనిపించడం లేదు.
- పూర్తిగా జనరిక్‌గా ఉంటుంది. అంటే కొన్ని సందర్భాల్లో అక్కడ ఉన్న సమాచారాన్ని ఇవ్వడం తప్ప లీగల్‌గా అడిగిన నిర్దిష్ట ప్రశ్నకు తగ్గ సమాధానం సూటిగా ఉండటం లేదు. ప్రాక్టికల్ అయినప్పటికీ అందులో లీగల్ యాంగిల్ ఉండటం లేదు. అలాంటివి ప్రస్తావించి చట్టపరమైన ఆదేశాలు పొందడం కష్టమనే చెప్పాలి.
- ఇప్పుడు అందుబాటులో ఉన్న ఏఐ తరహా సమాధానాల్లో చాట్‌జీపీటీ4 అంటే పెయిడ్ వెర్షన్ బెటర్ అని చెప్పవచ్చు. మొత్తమ్మీద ఈ సమాధానాలను పరిగణనలోకి తీసుకుంటే రిస్క్ ఉంటుందని చెప్పకతప్పదు. చాట్‌బోట్స్ అన్నీ అడిగిన వాటికి తగ్గ సమాధానాలు ఇస్తాయి. అయితే ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకునే ముందుకు వెళ్ళాల్సి ఉంటుందన్న అభిప్రాయం ఈ సర్వేలో వెల్లడైంది.

మూడేళ్ళలో యువతకు చేరువ

ఫేస్‌బుక్ అనతికాలంలోనే అంటే ఆరంభించిన ఇరవై సంవత్సరాల్లోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. మరీ ముఖ్యంగా గడచిన మూడేళ్ళలో యువతకు మరింత చేరువైంది. ఈ విషయాన్ని ఫేస్‌బుక్ స్వయంగా ప్రకటించింది. అమెరికా, కెనడాలోనే 18-29 మధ్యవయస్కులైన నాలుగుకోట్ల మంది యువత రోజూ ఫేస్‌బుక్‌ని ఉపయోగిస్తున్నారు.



గడచిన అయిదు క్వార్టర్లలో ఆరోగ్యకరమైన అభివృద్ధి సాధించామని మెటా ప్రకటించింది. మొదటిసారి ఇలాంటి వివరాలతో డెమోగ్రాఫిక్ సమాచారాన్ని మెటా విడుదల చేసింది. టిక్‌టాక్ వైపు మరలిన యువతను ఆకట్టుకునేందుకు ఈ మూడేళ్ళూ కృషి చేసింది. ఆ ప్రయత్నాలు ఫలించాయి. యువత చేరిన కొత్తలో మార్కెట్స్, గ్రూప్స్, డేటింగ్‌పైనే దృష్టి పెడతారు. తమ జీవితానికే ప్రాధాన్యం ఇస్తారని తెలిపింది. నిజానికి ఆరంభించిన మూడేళ్ళలోనే అయిదు కోట్ల మందిని ఆకట్టుకున్న ఘనత ఫేస్‌బుక్‌కు ఉంది. గత ఏడాది 'ప్యూ గ్రూప్' నిర్వహించిన సర్వే ప్రకారం అమెరికా యువతలో మూడో వంతుమంది ఫేస్‌బుక్ ఉపయోగిస్తున్నారు.

ఇక ఉబర్ రైడ్‌లో గేమ్స్ ఆడొచ్చు



ఆడుతు, పాడుతు పనిచేయడం కాదు, ప్రయాణిస్తే ఎంతో బాగుంటుంది. ఉబర్ సరిగ్గా అదే పని చేయనుంది. ఉబర్ తన ప్రయాణికులను ఆకట్టుకునేందుకు వీలుగా రైడ్ సమయంలో మినీగేమ్స్‌ను పరిచయం చేసే పనిలో ఉంది. అందుకుగానే యాప్‌లోనే మినీ గేమ్స్‌ను అభివృద్ధిపరుస్తోంది. నెట్ కనెక్షన్ ఉంటేనే ఈ గేమ్స్‌ని ఫ్రీగా ఆడుకునే సౌలభ్యం ఉంటుంది. అయితే అధికారికంగా దీనిపై సమాచారం వెలువడలేదు. ఇదే వస్తే ఉబర్ వాహనంలో కూర్చుని ఇకపై దారిలో ఉన్న గోడలు, మిద్దెలు, భవంతులూ చూస్తూ ఉండనవసరం లేదు. ఇటీవలే ఉబర్ యాప్ లేటెస్ట్ వెర్షన్‌ని విడుదల చేసింది. అందులో చాలా గేమ్స్ రిఫరెన్స్‌లు ఉన్నాయి. ఇంటర్నెట్ కనెక్షన్ ఉండాలని ఒక కోడ్ చెబుతోంది. అంతకుమించిన అధికారిక వివరాలు ఏవీ లేవు. ఆ గేమ్స్ ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయి, అవి ఉచితమా, కొనుగోలు చేయాలా అన్న వివరాలు కూడా లేవు. గత నెలలోనే యూట్యూబ్ కొన్ని చిన్నపాటి గేమ్స్‌ను ఐఫోన్ యాప్‌లో అందుబాటులోకి తెచ్చింది. దాన్నే ఉబర్ కూడా ఫాలో అవుతున్నట్టుంది. దీంతో అటు ప్రయాణం, ఇటు ఆనందాన్ని జోడించే యత్నంలో ఉబర్ ఉందని మాత్రం అర్థం అవుతోంది.

స్మార్ట్‌ఫోన్ ఓవర్ హీట్

ఇలా చేస్తే బెస్ట్



వేడి ఏ రూపంలో ఉన్నప్పటికీ కొన్ని ఇబ్బందులు తప్పవు. స్మార్ట్ ఫోన్‌కూ వర్తిస్తుంది. ఎండలనే కాదు, గేమ్స్ తదితరాలతో ఎక్కువగా ఉపయోగించినా ఫోన్ వేడెక్కుతుంది. ఫలితంగా ఇబ్బందులకూ అవకాశం ఉంటుంది. దరిమిలా ఫోన్ వేడెక్కకుండా ఉండేందుకు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఎండాకాలమనే కాదు, బైటి వాతావరణం బాగా వేడిగా ఉన్నప్పుడు స్మార్ట్ ఫోన్ కేసును మొదట తొలగించాలి. ఇప్పుడు వస్తున్న ఫోన్లు ఎక్కువగా ఫాస్ట్-చార్జింగ్ టెక్నాలజీతో వస్తున్నాయి. ఆ నేపథ్యంలో కేసును తొలగించడం ద్వారా ఫోన్‌ను వేడిమి నుంచి రక్షించుకోవచ్చు.
- కనీస స్థాయిలో డిస్‌ప్లే బ్రైట్‌నెస్‌ని ఉంచుకోవాలి. అది ఎక్కువగా ఉంటే ఫోన్ వేడెక్కుతుంది. ఆ కారణంగా, అవసరమైన మేరకు బ్రైట్‌నెస్‌ను అడ్జెస్ట్ చేసుకోవాలి.
- బైట అంటే రోడ్డుపై ఉన్నప్పుడు స్మార్ట్‌ఫోన్‌పై సూర్యకాంతి నేరుగా పడకుండా చూసుకోవాలి. అందుకోసం ఏదో ఒక అడ్డును ఏర్పాటు చేసుకోవాలి. వాహనంలో లేదంటే పైన ఏదో ఒక అడ్డు ఉండేలా చూసుకుంటే మంచిది.
- వేడి వాతావరణంలో ఎక్కువ సేపు స్మార్ట్ ఫోన్ వినియోగం లేదంటే దాంట్లో ఆటలు అంత మంచిది కాదు. భారీ స్థాయిలో ఉండే గేమ్స్ ఆడేటప్పుడు హార్డ్‌వేర్‌ని బాగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా వేడెక్కుతుంది. అందువల్ల అదేపనిగా ఆడకూడదు.
- స్మార్ట్‌ఫోన్లను జేబులో ఉంచుకోకూడదు. సహజంగా సాగే ఎయిర్ ఫ్లోని అది నిరోధిస్తుంది. అలా కూడా వేడెక్కే ప్రమాదం ఉంది. సహజంగా సాగే గాలి ప్రక్రియకు అవకాశం కల్పించాలి.

మైక్రోసాఫ్ట్ విండోస్ 10కి కొత్త ఫీచర్లు



మైక్రోసాఫ్ట్ ఇప్పటికే విండోస్ 10కి వచ్చే ఏడాది అక్టోబర్ 10 నుంచి సపోర్ట్‌ని ఆపేస్తున్నట్టు ప్రకటించింది. అయితే అనూహ్యంగా విండోస్ 10కి బేటా ప్రోగ్రామ్‌ని తిరిగి ఆరంభించింది. తద్వారా కొత్త ఫీచర్లను టెస్ట్ చేస్తోంది. విండోస్ 11కి ప్రత్యేకంగా తెచ్చిన ఏఐ కోపైలెట్‌ని విండోస్ 10 ఇప్పటికే పొందింది. విండోస్ 10 కోసం బేటా చానల్‌ని ఆరంభించినట్టు మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్‌పోస్ట్‌లో వెల్లడించింది. విండోస్ 10కి సంబంధించి కొత్త ప్రణాళికలను మైక్రోసాఫ్ట్ ఇంకా బైటపెట్టలేదు. అయితే విండోస్ ఇన్‌సైడర్స్ బేటా చానల్‌ని ఆప్ట్ చేసుకుంటే ఫీచర్లను పొందే అవకాశం ఉంటుంది. విండోస్ 10ని ఉపయోగించే వాళ్ళ కోసం పెయిడ్ సెక్యూర్టీ అప్డేట్స్‌ని ఆఫర్ చేసింది. బిజినెస్ సముదాయాలు అందుకోసం ఏడాదికి 61 డాలర్లు చెల్లించాలి. రెండో ఏడాదికి రెండింతలు అవుతుంది. మూడో ఏడాదికి మళ్లీ రెట్టింపు అంటే 122, 244 డాలర్లుగా ఫీజు ఉంటుంది. వ్యక్తిగత వినియోగదారులు ఎంత చెల్లించాలన్నది మాత్రం మైక్రోసాఫ్ట్ ఇంకా వెల్లడించలేదు. యూజర్లు 11కి షిఫ్ట్ అయ్యేలా మైక్రోసాఫ్ట్ యత్నిస్తోంది. అయితే హార్డ్‌వేర్ రిక్వైర్‌మెంట్స్ కారణంగా ఆ పని జోరందుకోవడం లేదు. 2018 తరవాత విడుదలైన సీపీయూ మాత్రమే విండోస్ 11ని సపోర్ట్ చేస్తుంది. డివైజ్ కాస్తా టీపీఎం సెక్యూరిటీ చిప్స్‌ను సపోర్ట్ చేస్తుంది. 2015లోనే విండోస్ 11ని విడుదల చేశారు. తొమ్మిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇంకా 68 శాతం మంది విండోస్10నే ఉపయోగిస్తుండటం విశేషం.

ఏఐ ఓవర్‌వ్యూస్ 15 శాతానికే జవాబు!



గూగుల్‌కు చెందిన ఏఐ ఓవర్‌వ్యూస్ - వివిధ ప్రశ్నలకు స్పందించడంలో తప్పులు చోటుచేసుకుంటున్నాయి. పూర్తిగా తప్పు లేదంటే ఉపకరించని రీతిలో సమాధానాలను ఇస్తోంది. ప్రస్తుతం దాన్ని సరిదిద్దే పనుల్లో గూగుల్ ఉంది. అడిగిన దానిలో పదిహేను శాతానికే సమాధానం ఇస్తోందని సరికొత్త నివేదకలో వెల్లడైంది. ఎస్ఈఓ వేదిక 'బ్రైట్‌ఎడ్జ్' ఈ ధోరణిని ఏప్రిల్ మధ్య నుంచే కనుగొంది. సమాధానం ముక్కలు ముక్కలుగా కనిపిస్తోందని కూడా తెలిపింది. ఏఐ ఓవర్‌వ్యూస్ అంటే సెర్చ్ జనరేటెడ్ ఎక్స్‌పీరియెన్స్(ఎస్‌జీఈ) ఇచ్చే సమాధానం విజిబిలిటీ 84 శాతానికి పరిమితమై ఉండేది. అమెరికాలోని యూజర్లు అందరికీ మే నెల మొదట్లో ఏఐ ఓవర్‌వ్యూస్‌ని అందించారు. అయితే కొంతమంది యూజర్లు అది చేస్తున్న తప్పులను ఎత్తి చూపుతూ ఎక్స్‌లో స్పందించారు. సమాధానాలకు సంబంధించి స్క్రీన్‌షాట్లను పోస్ట్ చేశారు. ఈ ఫిర్యాదులకు గూగుల్ వెంటనే స్పందించింది. సమస్యలను పరిష్కరించే పనిలో ఉన్నట్టు కూడా తెలిపింది. తమ అల్గోరిథమ్స్‌ను మెరుగుపర్చుకోవడం లేదా తమ పాలసీకి విరుద్ధంగా ఉన్న స్పందనలను ప్రత్యేక ప్రక్రియల ద్వారా తొలగించడం చేస్తామని కూడా ప్రకటించింది. వెబ్ ద్వారా అడిగిన సందేహాలకు స్పందించకుండా గూగుల్ మాన్యువల్‌గా టర్నింగ్ ఆఫ్ చేస్తోందంటూ ఈలోపు మరో నివేదిక బైటపడటం గమనార్హం.



టైమ్‌లైన్‌గా లొకేషన్ హిస్టరీ

గూగుల్ - మ్యాప్స్ లొకేషన్ హిస్టరీ ఇకపై క్లౌడ్‌లో కాకుండా ఫోన్‌లోనే స్టోర్ కానుంది. లొకేషన్ డేటా గూగుల్ సెర్వర్లలో ఉంటే జియోఫెన్స్ వారెంట్‌లకు లోనుకావాల్సి వస్తోంది. ఈ మార్పుతో ఇకపై గూగుల్‌కు రెస్పాండ్ అయ్యే ఇబ్బంది తప్పుతుంది. అలాగే లొకేషన్ హిస్టరీని ఇకపై టైమ్‌లైన్ అంటారు. 'యువర్ టైమ్‌లైన్' ఫీచర్‌లో ఉంటుంది. అదే ఒక వ్యక్తి ఎక్కడికి ఎన్నిసార్లు విజిట్ చేశారన్నది తెలియజేసేది. అదిఇప్పుడు ట్రిప్స్, ప్లేసెస్, సిటీస్ అంటే గ్రూపులుగా డేటా విభజించి ఉంటుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లో గూగుల్ మ్యాప్స్ ఫీచర్ ఎప్పటిలానే అంటే టైమ్‌లైన్ ఫీచర్ పనిచేస్తుంది. ఇటీవలి కాలంలోనే ఈ ఫీచర్ విడుదలైంది. ఇంకా అందరికీ చేరువ కావాల్సి ఉంది. ఒకసారి ఇది పొందితే ఆటోమేటిక్‌గా టైమ్‌లైన్‌కు రావచ్చు. డివైజ్‌ల మధ్య స్విచ్ కావచ్చు.


హెల్త్ కనెక్ట్ ఉపయోగించుకోండి ఇలా



గూగుల్ హెల్త్ కనెక్ట్‌తో ఆరోగ్య సంబంధ డేటాను ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉపయోగించుకోవచ్చు. ఇష్టమైన హెల్త్ యాప్‌లతో అనుసంధానం అయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. అవసరమైన హెల్త్ డేటాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా దీంతో పొందవచ్చు. నిజానికి వివిధ హెల్త్ ఫిట్‌నెస్ యాప్‌ల నుంచి సమాచారాన్ని తీసుకుని క్రోడీకరించుకోవడం సమస్యే. అయితే గూగుల్ అందుకు పరిష్కారంగా గూగుల్ హెల్త్ కనెక్ట్‌కు రూపకల్పన చేసింది. శాంసంగ్‌తో కలిసి ఈ పని చేపట్టింది. ఇది వివిధ ప్లాట్‌ఫారాల్లో ఉన్న సమాచారాన్ని క్రోడీకరిస్తుంది. అవసరమైన డేటా ఇస్తుంది. వివిధ డివైజ్‌లు, ప్లాట్‌ఫారమ్‌ల మధ్య సానుకూలతను కుదురుస్తుంది. ప్రస్తుతానికి ఇది బేటా దశలో ఉంది. గత ఏడాది మార్చిలో చోటుచేసుకున్న పిక్సెల్ అప్డేట్‌తో ఇది ప్రీ ఇన్‌స్టాల్డ్‌గా మారింది. ఆండ్రాయిడ్ 14తో ఇంటిగ్రేట్ అయింది. మొదట్లో ఇది కొన్నింటితోనే అనుసంధానమైంది. ఫిట్‌బిట్, శాంసంగ్ హెల్త్, గూగుల్ ఫిట్, మైఫిట్‌నెస్‌పాల్ వంటి వాటితో కలిసింది. ఆ క్రమంలో హెల్త్ ట్రాకింగ్ మేట్రిక్స్, డేటా టైప్స్, న్యూట్రిషన్ అలాగే నిద్రకు సంబంధించిన కార్యకలాపాలపై కీలక సమాచారం తదితరాలను కలిపింది. ఈసీజీ వంటి వాటిని సపోర్ట్ చేయడం లేదు. వివిధ డివైజ్‌లను ఉపయోగించే యూజర్లకు ఇది అనువుగా ఉంటుంది. సమాచారాన్ని ఒక గొడుగు కిందకు తెచ్చుకునే సౌలభ్యాన్ని కల్పిస్తోంది. పిక్సెల్ యూజర్లు దీన్ని చాలా సులువుగా, సూటిగా సెట్ చేసుకోవచ్చు. సెట్టింగ్స్‌లో యాప్స్ అక్కడి నుంచి హెల్త్ కనెక్ట్‌ను ఎనేబుల్ చేసుకోవచ్చు. నాన్ పిక్సెల్ యూజర్లు దీన్ని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డైన్‌లోడ్ చేసుకోవాలి. అక్కడ కూడా దీన్ని ఎనేబుల్ చేసుకోవడం సులువే.

పీజీఐఎంఈఆర్‌లో
బీఎస్సీ పారామెడికల్, బీపీహెచ్

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)- బీఎస్సీ పారామెడికల్, బ్యాచిలర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (బీపీహెచ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కౌన్సెలింగ్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ సమయం గంటన్నర. ఇందులో మొత్తం 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. కోర్సుకు నిర్దేశించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటి వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మొత్తం 123 సీట్లు ఉన్నాయి.



బ్యాచిలర్స్ ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 18 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బయాలజీ)/ఒకేషనల్ కోర్సు (ఎంఎల్ఎస్/ఎంఎల్‌టీ)/మూడేళ్ల డిప్లొమా(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

బీఎస్సీ మెడికల్ రేడియాలజీ & ఇమేజింగ్ టెక్నాలజీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 12 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బైపీసీ)/రెండున్నరేళ్ల డిప్లొమా(మెడికల్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ రేడియోథెరపీ టెక్నాలజీ: కోర్సు వ్యవధి మూడున్నరేళ్లు. ఇందులో 8 సీట్లు ఉన్నాయి. ఇంటర్(సైన్స్ సబ్జెక్టులు)/డిప్లొమా(రేడియోథెరపీ టెక్నాలజీ)ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 3 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) లేదా డిప్లొమా(ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ మెడికల్ టెక్నాలజీ(పర్‌ఫ్యూజనిస్ట్): కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో 2 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బైపీసీ) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ ఎంబామింగ్ అండ్ మార్చురీ సైన్సెస్: కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో 6 సీట్లు ఉన్నాయి. ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణతతోపాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌లో పరిజ్ఞానం ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 10 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్/కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/ సైకాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

బీఎస్సీ మెడికల్ టెక్నాలజీ(డయాలసిస్ థెరపీ టెక్నాలజీ): కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 2 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) లేదా డిప్లొమా(డయాలసిస్ థెరపీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు అర్హులు.

బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 10 సీట్లు ఉన్నాయి. ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్(ఎంపీసీ/బైపీసీ)/డిప్లొమా(ఆప్టోమెట్రీ) ఉత్తీర్ణులు అర్హులు.

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ: కోర్సు వ్యవధి నాలుగున్నరేళ్లు. ఇందులో 15 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఎంపీసీ/బైపీసీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

బీఎస్సీ(హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్): కోర్సు వ్యవధి మూడున్నరేళ్లు. ఇందులో 10 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

బీఎస్సీ (మెడికల్ యానిమేషన్ అండ్ ఆడియో-విజువల్ క్రియేషన్): కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో పది సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బ్యాచిలర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 15 సీట్లు ఉన్నాయి. ఇంటర్/యాగ్జిలరీ నర్స్ మిడ్‌వైఫ్/మేల్ హెల్త్ వర్కర్/ఫిమేల్ హెల్త్ వర్కర్/మల్టీపర్పస్ హెల్త్ వర్కర్/లేడీ హెల్త్ విజిటర్/హెల్త్ ఇన్‌స్పెక్టర్/శానిటరీ ఇన్‌స్పెక్టర్/ ఫుడ్ ఇన్‌స్పెక్టర్/డ్రగ్ ఇన్‌స్పెక్టర్/ల్యాబొరేటరీ టెక్నీషియన్ కోర్సులు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 1 నాటికి అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **ఎడిట్ విండో ఓపెన్:** జూలై 7, 8
- **కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 2
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 13
- **మొదటి కౌన్సెలింగ్:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** www.pgimer.edu.in

ఐజీహెచ్‌జీడీలో
ఎమ్మెస్సీ

ఉస్మానియా యూనివర్సిటీ బేగంపేటలో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్ (ఐజీహెచ్‌జీడీ)- ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ/లైఫ్ సైన్సెస్-బయాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గ్యాట్-బీ 2024 అర్హత ఉన్నవారు ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు పంపుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.2,20,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 21
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్, ఉస్మానియా యూనివర్సిటీ, బేగంపేట్, హైదరాబాద్-500016
- **ఈ-మెయిల్:** mscmhgig2022@gmail.com
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ విద్యార్థుల కోసం 85 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పోటీపడవచ్చు. ఇతర రాష్ట్రాల విద్యార్థుల కోసం గ్లోబల్ కేటగిరీ కింద అదనంగా అయిదు శాతం సూపర్ న్యూమరీ సీట్లు; విదేశీ విద్యార్థుల కోసం రెండు శాతం సూపర్ న్యూమరీ సీట్లు నిర్దేశించారు. పదోతరగతిలో సాధించిన మెరిట్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ), రిజర్వేషన్ నిబంధనలు, కౌన్సెలింగ్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలు సహా నాన్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం వెయిటేజీ ఇస్తారు.

బాసర ఆర్‌జీయూకేటీలో
ఇంటిగ్రేటెడ్ బీటెక్

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులు ఉంటాయి. తరవాత నాలుగేళ్లపాటు బీటెక్ కోర్సు ఉంటుంది. ఇందులో కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి. మైనర్ సబ్జెక్టు కింద బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

అర్హత: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్/ఏపీఓఎస్ఎస్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. విద్యార్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 18 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను 21 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450; ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1500; గ్లోబల్ కేటగిరీలో మిగిలిన సీట్లకు పోటీ పడే విద్యార్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 22
- **స్పెషల్ కేటగిరీ (పీహెచ్/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్) విద్యార్థుల దరఖాస్తు ప్రింట్ కాపీలు స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా చేరేందుకు చివరి తేదీ:** జూన్ 29
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 3 నుంచి
- **ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 8 నుంచి 10 వరకు
- **చిరునామా:** కన్వీనర్, యూజీ అడ్మిషన్స్, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, బాసర, నిర్మల్ జిల్లా - 504107
- **వెబ్‌సైట్:** www.rgukt.ac.in



గ్రామీణ బ్యాంకుల్లో
ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు

వివిధ రీజనల్ రూరల్ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో కింద పేర్కొన్న గ్రూప్-ఎ-ఆఫీసర్ (స్కేల్-1,2,3), గ్రూప్ బి-ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది.



గ్రామీణ బ్యాంకులు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విదర్భ కొంకణ్ గ్రామీణ బ్యాంక్ తదితరాలు.

1. ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్): **5,585 పోస్టులు**
2. ఆఫీసర్ స్కేల్-1: **3499 పోస్టులు**
3. ఆఫీసర్ స్కేల్-2(అగ్రికల్చర్ ఆఫీసర్): **70 పోస్టులు**
4. ఆఫీసర్ స్కేల్-2(లా): **30 పోస్టులు**
5. ఆఫీసర్ స్కేల్-2(సీఏ): **60 పోస్టులు**
6. ఆఫీసర్ స్కేల్-2(ఐటీ): **94 పోస్టులు**
7. ఆఫీసర్ స్కేల్-2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్): **496 పోస్టులు**
8. ఆఫీసర్ స్కేల్-2(మార్కెటింగ్ ఆఫీసర్): **11 పోస్టులు**
9. ఆఫీసర్ స్కేల్-2(ట్రెజరీ మేనేజర్): **21 పోస్టులు**
10. ఆఫీసర్ స్కేల్-3: **129 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్)18-30 ఏళ్లు; ఆఫీసర్ స్కేల్-2(మేనేజర్) 21-31 ఏళ్లు; ఆఫీసర్ స్కేల్-3(సీనియర్ మేనేజర్) 21-40 ఏళ్లు; ఆఫీస్ అసిస్టెంట్లకు(మల్టీపర్పస్) 18-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; మిగతా వారందరికీ రూ.850.

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, గుంటూరు/విజయవాడ, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/ సికింద్రాబాద్, కరీంనగర్.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూన్ 27
ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష: 2024 ఆగస్టు
ఆన్‌లైన్ మెయిన్స్: 2024 సెప్టెంబరు
వెబ్‌సైట్: www.ibps.in/index.php/rural-bankxiii/

హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లో
ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీఎంఎం ఇంజనీర్: **4 పోస్టులు**
2. మిడిల్ స్పెషలిస్ట్: **8 పోస్టులు**
3. జూనియర్ స్పెషలిస్ట్: **8 పోస్టులు**

అర్హత: టెక్నాలజీ ఇంజనీరింగ్‌లో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: సీఎంఎ ఇంజనీర్ పోస్టుకు రూ.60,000, మిడిల్ స్పెషలిస్ట్‌కు రూ.50,000, జూనియర్ స్పెషలిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు మించరాదు.

దరఖాస్తు విధానం: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 17
రాత పరీక్ష తేదీ: జూన్ 17
వెబ్‌సైట్: hal-india.co.in/home

ఎన్ఐఎన్‌లో ఖాళీలు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్).... కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 15

1. లోయర్ డివిజన్ క్లర్క్: **6**
2. అప్పర్ డివిజన్ క్లర్క్: **7**; 3. లైబ్రరీ క్లర్క్: **1**
4. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: **1**

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్కిల్స్, పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: లోయర్, అప్పర్ డివిజన్ క్లర్క్ పోస్టులకు 27 ఏళ్లు; లైబ్రరీ క్లర్క్ పోస్టుకు 28 ఏళ్లు; లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష ద్వారా

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మన్, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.1000. ఇతరులకు రూ.1200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై
వెబ్‌సైట్: www.nin.res.in/

కొంకణ్ రైల్వేలో
ప్రాజెక్ట్ ఇంజనీర్లు

నవీ ముంబయిలోని కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 11

1. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: **1**
2. ప్రాజెక్ట్ ఇంజనీర్: **8**, 3. సీఏడీ/డ్రాఫ్ట్‌మ్యాన్: **1**
4. అసిస్టెంట్ ఇంజనీర్: **1**

అర్హత: ఐటీఐ/డిప్లొమా, సివిల్ ఇంజనీరింగ్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు నెలకు రూ.44,900, సీఏడీ/డ్రాఫ్ట్‌మ్యాన్ పోస్టుకు రూ.35,400, అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుకు రూ.58,100.

ఇంటర్వ్యూ తేదీలు: జూన్ 15, 20, 24, 25, 27

వేదిక: ఎగ్జిక్యూటివ్ క్లబ్, కొంకణ్ రైల్ విహార్, కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్, సీవుడ్స్ రైల్వే స్టేషన్ దగ్గర, సెక్టార్-40, సీవుడ్స్(వెస్ట్), నవీ ముంబయి.

వెబ్‌సైట్: https://konkanrailway.com/

లిటిల్స్




ప్రత్యుపకారం

ఒక అడవిలో చిక్కూ అనే కుందేలు ఉండేది. దానికి వాళ్ల అమ్మ నీతి కథలు మంచి మంచి విష యాలు చెబుతూ ఉండేది. ఒక రోజు చిక్కూకి వాళ్లమ్మ ఎవరైనా ఆపదలో ఉంటే చేతనైన సాయం చేయాలని, తిరిగి వారు మనకు ఏమీ సాయం చేయలేక పోయినా మనం మాత్రం మన సాయపడే గుణాన్ని వదలకూడదని మన వల్ల సాయం పొందిన వారే కాకుండా ఎక్కడో ఒక చోటనుండి మనకు సహాయం లభిస్తుందని చెప్పింది. తల్లి మాటలు జాగ్రత్తగా విన్న చిక్కూ ఎవరైనా ఇబ్బందిలో ఉంటే చేతనైన సాయం చేసి ఆదుకోవడం మొదలు పెట్టింది. అడవిలో ఒక మేకకు .బ్బు చేసి ఆహారం వెతుక్కునే ఓపిక లేక అలాగే ఉండిపోతే చిక్కూ వెళ్లి ఆ మేకకు విశ్రాంతి తీసుకోమని చెప్పి తన చిన్నారి నోటితో మోయగలిగినంత మేత తీసుకొచ్చి పెట్టి మేకకు సాయం చేసింది. ఒక గుర్రం కాలిలో ముల్లు గుచ్చుకుని నడవలేక పోతుంటే తన పదునైన పళ్లతో దాని కాలిలో నుండి ముల్లును పెకలించివేసింది. ఒక డేగ రెక్కలకు దెబ్బ తగిలి ఎగరలేక పోతుంటే, ఏ మందు వేయాలో వాళ్ల అమ్మను అడిగి తెలుసుకుని, ఆ ఆకు పసరు తెచ్చి పూసి డేగ గాయాన్ని మాన్పింది తర్వాత ఒక రోజు చిక్కూ వెంట ఒక వేట కుక్క పడి తరమడం మొదలు పెట్టింది. చిక్కూ తాను అంత క్రితం ఆదుకున్న మేకను, గుర్రాన్ని పిలిచి సాయం అడిగింది, అవన్నీ మేము పనిలో ఉన్నాము. ఇపుడు నిన్ను కాపాడలేము అన్నాయి. ఈలో గా ఎక్కడినుండో వేట కుక్క కుందేలును తరమడం గమనించిన ఒక పెద్ద గద్ద వేగంగా ఎగురుతూ వచ్చి కుందేలును ఉన్నపళంగా ఎత్తుకుపోయి మరొక చోట దింపేసింది. వెంటనే చిక్కూ వాళ్లమ్మ దగ్గరికి వెళ్లి నువ్వు చెప్పింది నిజం అమ్మా మనం ఎదుటి వారికి చేతనైన సాయం మానకుండా చేస్తూ ఉంటే వారు కాకున్నా ఎవరో ఒకరు మనల్ని ఆదుకుంటారు అని ఇవాళ తెలుసుకున్నాను అని చెప్పింది.


సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



ఎన్ని రోబోలు ఉన్నాయి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 327

8		1				5		2
				8		9		
2					1			4
			6				5	
5			8		2			3
	4				9			
6			3					9
		4		7				
1		3				8		6

సుడోకు - 326 సమాధానం

5	1	3	2	6	4	7	9	8
9	8	4	5	1	7	3	6	2
7	2	6	9	8	3	5	1	4
4	9	8	7	2	6	1	3	5
1	5	2	8	3	9	6	4	7
6	3	7	1	4	5	8	2	9
8	6	9	4	7	1	2	5	3
2	4	1	3	5	8	9	7	6
3	7	5	6	9	2	4	8	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

అశ్వత్థామ .. యుద్ధానికి సిద్ధం!



ప్రభాస్ హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ట్రైలర్ ఈ నెల 10న విడుదల కానుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాలో అశ్వత్థామగా నటిస్తున్న అమితాబ్ బచ్చన్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో నెమావార్‌లోని నర్మదా ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన ఓ మ్యాసివ్ ప్రొజెక్షన్ ద్వారా అమితాబ్ పాత్రను పరిచయం చేశారు. ఇప్పటికీ అశ్వత్థామ నర్మదా మైదానంలో నడుస్తాడనే నమ్మకం ఉండడంతో నర్మాదా ఘాట్‌లో అమితాబ్ లుక్‌ను విడుదల చేయం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధభూమి మధ్యలో నిలబడి ఓ అస్త్రాన్ని పట్టుకుని యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు అమితాబ్ కనిపించారు. ఆయన నుదిటిపై ఉన్న రత్నం మెరుస్తోంది. ఆయన వెనుక ఓ భారీ వాహనం ఉంది, అలాగే ఆయన ముందు కొంతమంది వ్యక్తులు నేలపై పడి ఉన్నారు. ఈ నెల 27న విడుదల కానున్న 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.



హిందూపురం ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి గెలుపొందిన నందమూరి బాలకృష్ణను టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు కలసి అభినందనలు తెలిపారు. దర్శకుడు గోపీచంద్ మలినేని, బాబీ, అనిల్ రావిపూడి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ తదితరులు బాలకృష్ణను కలసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.





టాలీవుడ్ అగ్ర నిర్మాత సి. అశ్వనీదత్ శుక్రవారం విజయవాడలో తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం ఘన విజయం అందుకున్న సందర్భంగా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు. టాలీవుడ్ యువ హీరో నిఖిల్ సిద్దార్థ్ శుక్రవారం తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. నిఖిల్ మామయ్య, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు నిఖిల్ నటరాజ ప్రతిమను బహూకరించారు.


తమ్ముడూ... నిన్ను చూసి గర్విస్తున్నా





తమిళ హీరో, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్ జనసేనాని పవన్ కల్యాణ్‌ను అభినందనల్లో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయాన్ని అందుకున్న సందర్భంగా 'నిన్ను చూసి గర్వపడుతున్నాను తమ్ముడూ అంటూ' పవన్‌పై ప్రశంసలు కురిపించారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పవన్ విజయంపై స్పందించారు. పవన్ కల్యాణ్ ముందు తన రాజకీయ జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఈ ప్రయాణంలో విజయం సాధించాలి, ప్రజల ఆశలు, ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చాలి అని ఆకాంక్షించారు.

టీజర్‌తో వస్తున్న కన్నప్ప



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' చిత్ర నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఈ సినిమాలో అక్షయ్‌కుమార్, ప్రభాస్, మోహన్‌లాల్, మోహన్‌బాబు, శరత్‌కుమార్ వంటి అతిరథ మహారథులు నటించారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో మోహన్‌బాబు ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇటీవల కేన్స్‌లో జరిగిన ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్‌ను విదేశీ చిత్ర ప్రముఖుల కోసం ప్రదర్శించారు. ఇండియన్ ఆడియన్స్ కోసం ఈ నెల 14న ఇక్కడ టీజర్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. గుర్రపు స్వారీ చేస్తూ ప్రకృతి అందాలను పరిశీలిస్తున్న కన్నప్పను ఈ పోస్టర్‌లో చూడవచ్చు. విజువల్ వండర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాలుగు విభిన్న గెటప్స్‌లో...



వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ భారీ సెట్ వేశారు. అందులో ఈ నెల 19 నుంచి షూటింగ్ ప్రారంభం కానుంది. 'పలాస' చిత్రంతో అందరినీ ఆకట్టుకున్న దర్శకుడు కరుణకుమార్ దర్శకత్వంలో రజనీ తాళ్లూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. యావత్ భారతదేశాన్నీ కదిలించిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వరుణ్‌తేజ్ నాలుగు విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి.రవిశంకర్ ఇతర ముఖ్య పాత్రధారులు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సినిమాటోగ్రాఫర్: ఎ.కిశోర్‌కుమార్.



కెరీర్‌లో గుర్తుండిపోతుంది

'శుక్ర', 'మాటరాని మౌనమిది' వంటి విభిన్న చిత్రాల తర్వాత దర్శకుడు సుకు పూర్వజ్ అందిస్తున్న సినిమా 'ఎ మాస్టర్ పీస్'. మనీష్ గిలాడ, అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వజ్, అషు రెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ నిర్మాతలు. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసిన అనంతరం మనీష్ గిలాడ మాట్లాడుతూ 'ఈ సినిమాలో విలన్‌గా నటించాను. మా అందరి కెరీర్‌లో గుర్తిండి పోయే గొప్ప చిత్రం అవుతుంది' అన్నారు. దర్శకుడు సుకు పూర్వజ్ మాట్లాడుతూ 'భాగవతంలోని జయ, విజయుల పాత్రల నేపథ్యంలో హీరో, విలన్ పాత్రలను డిజైన్ చేశాను. మైథాలజీనీ, సైన్స్ ఫిక్షన్‌ను కలిపేందుకు శివుడి పాత్రను సంధానంగా తీసుకున్నాం. చిన్న ప్రాజెక్ట్‌గా మొదలై నిర్మాణపరంగా ఎక్కడా రాజీ పడకపోవడంతో పెద్ద సినిమా అయింది. సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ అద్భుత అనుభూతినిస్తాయి. క్లైమాక్స్ మినహా చిత్రం పూర్తయింది. పది రోజుల్లో ఆ వర్క్ పూర్తి చేస్తాం' అని చెప్పారు. తెలుగులో ఒక ప్రాపర్ సూపర్ హీరో ప్రాజెక్ట్ చేయాలని ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత శ్రీకాంత్ చెప్పారు. సీరియల్స్‌లో నటించిన తను 'ఎ మాస్టర్ పీస్'తో సినిమాల్లో అడుగుపెడుతున్నట్లు నటి, దర్శకుడు సుకు సతీమణి జ్యోతి చెప్పారు. ఇది మనం గర్వంగా చెప్పుకొనే సూపర్ హీరో మూవీ అవుతుందని అరవింద్ కృష్ణ చెప్పారు.

తాతా వస్తాడే...



శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). లైకా ప్రొడక్షన్స్ రెడ్ జెయింట్ బేనర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న పలు భారతీయ భాషల్లో విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. మాస్‌ను అలరించే ఓ గీతాన్ని శుక్రవారం యూనిట్ విడుదల చేసింది. 'తాతా వస్తాడే..అదరగొట్టిపోతాడే' అంటూ సాగే ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. అరుణ్ కౌండిన్య ఆలపించారు. అనిరుధ్ స్వరాలు సమకూర్చారు. త్వరలో ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ, శ్రీలక్ష్మీ మూవీస్ సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నాయి. ఎస్ జే సూర్య, ప్రియా భవానీ శంకర్, కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్ ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు.



నా పెళ్లికి రండి

నటి వరలక్ష్మి శరత్‌కుమార్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నారు. జూలై 2న వీరి వివాహం థాయ్‌ల్యాండ్‌లో ఘనంగా జరగబోతున్నట్లు కోలీవుడ్ టాక్. పెళ్లి పనులు మొదలయ్యాయి. ఇటీవలే వరలక్ష్మి తన తండ్రి శరత్‌కుమార్‌తో కలసి రజనీకాంత్ ఇంటికి వెళ్లారు. తన పెళ్లి పత్రికను రజనీకాంత్‌కు అందించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. పెళ్లికి రావాల్సిందిగా కోరారు. ఆ సందర్భంలో రజనీకాంత్‌తో దిగిన ఫొటోను వరలక్ష్మి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫొటోలో రజనీకాంత్, లతా దంపతులతో పాటు రాధికా-శరత్‌కుమార్ దంపతులు ఉన్నారు.

శుద్ధి అయోధ్య.. ఎనిమిది వసంతాలు!



స్టార్స్‌తో బిగ్ బడ్జెట్ చిత్రాలు తీయడమే కాకుండా కాన్సెప్ట్ బేస్డ్ చిన్న చిత్రాలనూ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఆ తరహాలో ఈ సంస్థ అందిస్తున్న తాజా చిత్రం 'ఎనిమిది వసంతాలు'. 19 ఏళ్ల వయసు నుంచి 27 ఏళ్ల వరకూ ఎనిమిది సంవత్సరాల వ్యవధిలో ఓ యువతి జీవితంలో పరిచయమయ్యే విభిన్నమైన వ్యక్తులు, ప్రదేశాలు, భావోద్వేగాలను వివరించే చిత్రమిదని దర్శకుడు ఫణీంద్ర చెప్పారు. 'మను' సినిమాతో పలు అవార్డులు, విమర్శకుల ప్రశంసలు పొందారాయన. 'మ్యాడ్' చిత్రంలో నటించిన అనంతిక సనీల్‌కుమార్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. శుద్ధి అయోధ్యగా ఆమెను పరిచయం చేస్తూ టైటిల్ పోస్టర్ విడుదల చేశారు. ప్రస్తుతం 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాకు సంగీతం: నరేశ్ కుమారన్, ఛాయాగ్రహణం: విశ్వనాథ్‌రెడ్డి, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్.

విజయ్ సేతుపతి 50వ మైలు రాయి



తమిళ నటుడు విజయ్ సేతుపతి 50వ చిత్రం 'మహారాజా' విడుదలకు సిద్ధమైంది. నితిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనురాగ్ కశ్యప్ ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషించారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్వీఆర్ సినిమా సంస్థ ఈ నెల 14న విడుదల చేస్తోంది. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ చివర్లో విజయ్‌ని ఎదుర్కొనేందుకు అనురాగ్ కశ్యప్ రావడం ఆసక్తి పెంచింది. మమతా మోహన్‌దాస్, భారతీరాజా, నటరాజన్ సుబ్రహ్మణ్యం, సింగంపులి కల్కి కీలక పాత్రలను పోషించారు. ఈ చిత్రానికి దినేశ్ పురుషోత్తమన్ సినిమాటోగ్రఫీ, అజనీశ్ లోకనాథ్ సంగీతాన్ని అందించారు.

మళ్లీ వస్తున్న ఉపేంద్ర 'ఏ'



కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'ఏ' కు ప్రత్యేక స్థానం ఉంది. 26 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఓ కల్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. ఎన్నో రికార్డులు నెలకొల్పింది. త్వరలో ఈచిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఉప్పి క్రియేషన్స్, చందు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై 'ఏ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత లింగం యాదవ్ తెలిపారు. ఈ చిత్రంలో చాందినీ కథానాయికగా నటించారు.

ఇకపై ట్రోల్ చేయకండి

నటుడు ఉపేంద్ర ఆగ్రహం

'నన్ను మేధావి అంటూ ఇకపై ఎవరూ ట్రోల్ చేయకండి' అని ఉపేంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి, అన్నింటా విజయం సాధించింది. దీంతో పవన్ కల్యాణ్‌తో ఉపేంద్రను పోలుస్తూ సోషల్ మీడియాలో పలువురు ట్రోల్ చేస్తున్నారు. ఉపేంద్ర 'ఉత్తమ ప్రజాకీయ పార్టీ'ని ఏర్పాటు చేసి పోటీ చేసినా ఒక్కచోటా గెలవలేకపోయారు. దీంతో ఆయనపై ట్రోల్స్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఉపేంద్ర స్పందించారు. తన గెలుపోటముల గురించి సుదీర్ఘంగా ఆలోచిస్తున్నానని, తాను గెలవాలనుకున్నప్పుడు ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరి విజయం సాధిస్తానని పేర్కొన్నారు. తన రాజకీయ పార్టీ 'ప్రజాకీయ' సిద్ధాంతాలు ప్రజలకు అర్థం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)



అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి, ఆయన యువ హీరోగా ఎనభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆకృతి సంస్థ ఏర్పాటు చేసిన 'అక్కినేని యువ ఎక్సలెన్స్ అవార్డ్' హీరో వరుణ్‌సందేశ్‌కు అందజేశారు సీనియర్ నటుడు మురళీమోహన్. శుక్రవారం నిర్మాతల మండలి హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, తెలుగు నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, రచయిత్రి కె.వి. కృష్ణకుమారి, ఆకృతి సుధాకర్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నవ్వించే నాయకుడు



అనిల్, నందిని జంటగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బుక్కా పకీర్. స్వీయ దర్శకత్వంలో అనిల్ వాటుపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. జులైలో విడుదల కానుంది. ఈ సందర్భంగా టీజర్ విడుదల చేశారు. 'ఇదొక డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకుల్ని నవ్విస్తుంది' అని అనిల్ చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎమ్మెస్ కిరణ్‌కుమార్, సంగీతం: లలిత్‌కిరణ్, సహ నిర్మాతలు: కె.పవన్‌కుమార్, నరేంద్ర వాటుపల్లి.